

ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పోచారం 13

డెయిరీ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 21-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 127

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: విదియ సా. 5.07 తదుపరి తదియ; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 12.33 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ.8.52-10.17; దుర్ముహూర్తం: ఉ.11.53-12.43; అమృతఘడియలు: సా.5.25-6.50; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.33

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణ తల్లి విగ్రహాన్ని పదేళ్లలో

పెట్టలేదేం?

సచివాలయం ఎదుట ఎందుకు ఏర్పాటు చేయలేదు?

డిసెంబరు 9న సచివాలయంలో మేం పెడతాం

దీనిపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

అధికారం కోల్పోయినా బలుపు తగ్గలేదు

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తానంటావా?

టచ్ చేసి చూడు.. వీపు చింతపండే

రాజీవ్‌గాంధీ జయంతి సభలో సీఎం రేవంత్

కేటీఆర్‌పై పోలీసులకు ఎంపీ అనిల్ ఫిర్యాదు



సచివాలయంలో విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ ప్రదేశంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే.. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక తొలగిస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయంపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని తమ ప్రభుత్వమే సచివాలయంలో ఏర్పాటు చేస్తుందని

మిగతా 13వ పేజీలో...

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబరు 9న ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. మంగళవారం అందుకు సంబంధించిన స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టితో కలిసి పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు స్థలం, డిజైన్‌పై అధికారులతో చర్చించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా విగ్రహం ఉండాలన్నారు.

13

చీ(ఫ్)ప్ మినిస్టర్ గుర్తుంచుకో..

మేం వచ్చాక సచివాలయ పరిసరాల్లో చెత్తను తొలగిస్తాం

మానసిక రుగ్మత నుంచి రేవంత్ కోలుకోవాలి

రుణమాఫీపై రేపు బీఆర్ఎస్ ధర్నాలు: కేటీఆర్



కేంద్రంలో నేరుగా నియామకాలు రద్దు

పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయం

4 రోజుల కిందటి నోటిఫికేషన్ నిలిపివేత

విపక్షాల ఒత్తిడికి తలొగ్గిన మోదీ సర్కారు

నియామకాల్లో సమానత్వం, సామాజిక న్యాయానికి మోదీ కట్టుబడి ఉన్నారు

కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

రిజర్వేషన్లు కాపాడటానికి ఎంతవరకైనా వెళ్తాం: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: విపక్షాల ఒత్తిడికి కేంద్రం తలొగ్గింది. వివాదాస్పదంగా మారిన నేరుగా నియామకాల(లేటరల్ ఎంట్రీ) ప్రక్రియను నిలిపివేసింది. 2018 నుంచి అమలు చేస్తున్న ఈ విధానాన్ని పునఃపరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఇచ్చిన ఆదేశం మేరకు నాలుగు రోజుల క్రితమే ఇచ్చిన ఉద్యోగ నియామకాల ప్రకటనను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దు చేసింది. నోటిఫికేషన్ వెలువడగానే కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్లకు గండి కొడుతున్నారని మండిపడ్డారు. దొడ్డిదారిలో ఆరెస్సెస్ సానుభూతిపరులను కేంద్ర ప్రభుత్వంలోని కీలక ఉద్యోగాల్లోకి తెచ్చి పెట్టేందుకు ఈ విధానాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆయనతో విపక్షాలే కాకుండా ప్రభుత్వంలో భాగస్వాములైన ఎల్‌జేపీ, జేడీయూలు గొంతు కలిపాయి. ఎల్‌జేపీ అధ్యక్షుడు, దళిత నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేరుగా

మిగతా 2వ పేజీలో...

బీసీ కోటాకు

మధ్యేమార్గం!

చట్ట ప్రకారం 23 శాతం.. పార్టీపరంగా 19 శాతం

హామీ నిలబెట్టుకోవడానికి, సుప్రీం తీర్పు అమలుకు ఇదే మార్గం

స్థానిక ఎన్నికల ఫార్ములాపై రాష్ట్ర ప్రభుత్వ యోచన

తాము పాటిస్తూ ఇతర పార్టీలను సవాల్ చేయాలన్న ఉద్దేశం

రాష్ట్రంలో ప్రస్తుతం బీసీలకు 23%.. ఎస్సీ, ఎస్టీలకు 21%



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క పంచాయతీ సహా స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి. మరోపక్క ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన స్థితి. ఈ క్రమంలో అనేక చిక్కులు, ఇతర సమస్యలు.. వాటినుంచి బయటపడి.. రెండూ నెరవేరేలా మధ్యే మార్గాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. బీసీలకు గతంలోలాగానే చట్టపరంగా 23 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ.. మరో 19 శాతం కాంగ్రెస్ పార్టీపరంగా ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ పూర్తవుతుందని.. మొత్తం రిజర్వేషన్లు (బీసీ, ఎస్సీ, ఎస్టీ) 50 శాతానికి మించకూడదనే సుప్రీం కోర్టు నిబంధనను కూడా పాటించినట్లవుతుందని యోచిస్తోంది. ఇతర పార్టీలను కూడా ఇదే పద్ధతిలో బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేసి పైచేయి సాధించవచ్చని అంచనా వేస్తోంది. బీసీ ఓటర్ల గణన చేసినా, కులాల వారీ గణన చేపట్టినా పంచాయతీ ఎన్నికలకు ఇదే విధానాన్ని అనుసరించాలనే వ్యూహంతో ఉన్నట్లుగా

మిగతా 12వ పేజీలో...

వైద్యుల భద్రతకు

టాస్క్‌ఫోర్స్!

తొమ్మిది మంది సభ్యులతో ఏర్పాటు

3 వారాల్లో మధ్యంతర, 2 నెలల్లో పూర్తి నివేదిక

కోల్‌కతా హత్యాచార కేసుపై సుప్రీంకోర్టు ఆదేశం

మీ భద్రతపై మాది భరోసా.. మమ్మల్ని నమ్మండి ప్లీజ్

ఆందోళనలు విరమించి.. రోగులకు సేవలందించండి

వైద్యులకు అత్యున్నత న్యాయస్థానం పిలుపు

నేరస్థుడు పశువులా వ్యవహరించాడు..

హత్యాచార ఘటన భయానకమంటూ వ్యాఖ్యలు!

టాస్క్‌ఫోర్స్‌లో ఏఐజీ సీఎండీ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

బడిలో చిన్నారులపై లైంగికదాడి

మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో ఘటన

స్థానికుల ఆగ్రహం.. పాఠశాల ధ్వంసం, రైల్ రోకో



ముంబైలో జరిగిన ఓ నిరసనలో ప్రదర్శించిన పోస్టర్

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యులతో కూడిన జాతీయ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో తీవ్ర సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టాస్క్‌ఫోర్స్‌లో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి చోటు కల్పించింది. పని ప్రదేశాల్లో వైద్యులపై లైంగిక పరమైన హింసను నివారించేందుకు.. వైద్యులు, నర్సులకు భద్రత, గౌరవప్రదమైన పరిస్థితులు కల్పించడానికి జాతీయ కార్యాచరణ

మిగతా 2వ పేజీలో...

బెంగాల్‌లో అనిశ్చితి

మమత ప్రభుత్వంపై విద్యార్థులకు విశ్వాసం పోయింది

డాక్టర్‌పై హత్యాచారం సిగ్గుచేటు

సీఎం నిరసనకు దిగడమేంటి?

'అపరిచితుడి'లా మమత తీరు

బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్

రాష్ట్రపతి ముర్ముతో భేటీ

రాష్ట్రంలో స్థితిగతులపై నివేదిక

2

ఆస్పత్రుల్లో సీసీటీవీ కెమెరాలు

రోగులు, విజిటర్లకు ఐడీ కార్డులు

ఎయిమ్స్ ఆస్పత్రులు, కాలేజీల్లో భద్రతపై కేంద్రం మార్గదర్శకాలు

అడ్డగోలుగా ఎన్‌వోసీలు!



నీటిపారుదల శాఖ పరిధి కాకపోయినా జారీ

కలెక్టర్లకు తెలియకుండానే ఇచ్చిన అధికారులు!

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు అనుమతులపై హైడ్రా ఆరా

రెవెన్యూ అధికారులతో హైడ్రా కమిషనర్ భేటీ

12

కుటుంబాలను కలిపి ఉంచుదాం

అమెరికా నూతన పౌరసత్వ పథకం..

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

5 లక్షల మంది దంపతులకు, 50 వేల మంది పిల్లలకు లబ్ధి

2

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా శ్రీవత్స

13

ధరణి దరఖాస్తులను.. పది రోజుల్లో పరిష్కరించండి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ 3 నెలల్లో పూర్తవ్వాలి

కలెక్టర్లతో సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్‌లో వాన దడ

తెల్లవారుజామున కుండపోత వర్షం

చెరువుల్లా రోడ్లు.. కొట్టుకెళ్లిన కార్లు

రాంనగర్‌లో గల్లంతైన వ్యక్తి మృతి

14 చోట్ల 10 - 12.5 సెం.మీ. వర్షం

ఉమ్మడి రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండలోనూ జోరువాన

14

యాదాద్రిలో అత్యధికంగా 17 సెం.మీ.

నేడు, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు



హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లైబ్రరీలో చేరిన వాన నీరు

డెంగీతో ఐదుగురి మృతి



మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు బీటెక్ విద్యార్థులు

రాష్ట్రంలో హడలెత్తిస్తున్న డెంగీ జ్వరాలు

భయాందోళనలో ప్రజలు

14

బెంగాల్లో అనిశ్చితి

మమత ప్రభుత్వంపై విద్యార్థులకు విశ్వాసం పోయింది

- 'అపరిచితుడి'లా సీఎం తీరు: గవర్నర్ ఆనంద బోస్

కోల్‌కతా, ఆగస్టు 20: పశ్చిమ బెంగాల్లో ప్రస్తుతం అనిశ్చితి రాజ్యమేలుతోందని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ అన్నారు. ప్రజలు.. ముఖ్యంగా విద్యార్థులు మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారని తెలిపారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై హత్యాచారం.. సమాజానికే సిగ్గుచేటైన ఘటనగా పేర్కొన్నారు. ప్రజలను సంరక్షించాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదని.. పైగా చనిపోయిన వైద్యురాలికి న్యాయం చేయాలంటూ సీఎం మమత స్వయంగా నిరసనకు దిగడాన్ని తప్పుబట్టారు. ఆమెవన్నీ పైపై ప్రకటనలేనని వ్యాఖ్యానించారు. పీటీఐ వార్తాసంస్థకు ఆయన తాజాగా ఇంటర్వ్యూ ఇచ్చారు. 'బెంగాల్లో యువత భయాందోళనల్లో ఉన్నారు. మహిళలు తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉన్నారు. పౌరులను సంరక్షించాల్సిన రాష్ట్రప్రభుత్వం తన బాధ్యత నిర్వర్తించడం లేదన్న భావన సర్వత్రా ఏర్పడింది. కోల్‌కతా పోలీసు వ్యవస్థ నేరపూరితం, రాజకీయమయం అయిపోయింది. సీఎం మమత ఓ ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా క్యాంపస్‌లలో భద్రత లేదని ఆరోగ్య మంత్రి.. హోం మంత్రికి ఫిర్యాదు చేశారట! చర్యలు తీసుకోలేదని హోం మంత్రి సీఎంకు కంప్లయింట్ ఇచ్చారట! ప్రజలను పిచ్చివారిని చేయలేరు. రాష్ట్రంలో ఆరోగ్య మంత్రి, హోం మంత్రి, ముఖ్యమంత్రి ముగ్గురూ మమతే కదా' అని ఎద్దేవాచేశారు. ఆమె తీరు 'అపరిచితుడి'లా ఉందన్నారు. చర్యలు తీసుకోవలసిన ముఖ్యమంత్రే.. న్యాయం కోసమంటూ రోడ్లపై ప్రదర్శన చేపట్టడం హాస్యాస్పదమన్నారు.



రాష్ట్రపతితో బోస్ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్ మంగళవారం ఢిల్లీలో ప్రత్యక్షమయ్యారు! ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్కడ్‌తో సమావేశమయ్యారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై బెంగాల్‌తో పాటు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ భేటీలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులను ధన్కడ్, ముర్ములకు గవర్నర్ వివరించారు. కాగా గవర్నర్ తన పర్యటనలో భాగంగా అమిత్ షా, జేపీ నడ్డాతోనూ భేటీ అయ్యే అవకాశాలున్నాయి.

ఆస్పత్రుల్లో భద్రతపై కేంద్రం మార్గదర్శకాలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్, ఈఎస్‌ఐ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో భద్రతను పెంచాలని నిర్ణయించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆస్పత్రి ప్రాంగణంలో వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించడానికి రాష్ట్ర చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. "ఆస్పత్రుల లోపలికి వచ్చే, బయటకు వెళ్లే మార్గాలు, కారిడార్లు సహా అన్ని ప్రదేశాల్లో హైరిజల్యూషన్ సీసీటీవీ కెమెరాలు అమర్చాలి. సిబ్బంది, రోగులు, సందర్శకులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. అత్యవసర సమయాల్లో సమాచారాన్ని త్వరగా వ్యాప్తి చేయడానికి పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఉండాలి. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల క్యాంపస్‌లో డార్క్‌స్పాట్‌లను గుర్తించాలి. మహిళా వైద్య సిబ్బంది విధులు నిర్వహించే ప్రదేశాలతో పాటు రాకపోకలు సాగించే మార్గాల్లో, పార్కింగ్ స్థలాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలి. రాత్రిపూట మహిళా వైద్య సిబ్బందిని ఒకరి కంటే ఎక్కువ మందిని నియమించాలి. వారికి సురక్షితమైన డ్యూటీ రూమ్‌లు ఏర్పాటు చేయాలి" అని కేంద్రం మార్గదర్శకాల్లో పేర్కొంది.

దుకాణాల బోర్డులు తమిళంలో లేకుంటే రూ.2 వేలు జరిమానా

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దుకాణాలకు తమిళంలో బోర్డులు పెట్టని యజమానులకు రూ.2 వేలు జరిమానా విధించనున్నామని తమిళనాడు ప్రభుత్వం మద్రాస్ హైకోర్టుకు నివేదించింది. దుకాణాకాలన్నింటికీ తమిళంలో బోర్డులు పెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో దాఖలైన పిల్‌కు బదులిస్తూ తమిళ ప్రభుత్వం ఈ మేరకు స్పష్టం చేసింది. గతంలో ఈ జరిమానా రూ.50 ఉండగా, ఇప్పుడు దానిని రూ.2వేలకు పెంచనున్నట్టు పేర్కొంది. ప్రతి దుకాణానికి తమిళంలో పేరు పెట్టారనే విషయాన్ని నిర్ధారించేందుకు సంబంధిత శాఖ అధికారులు ఇకపై నిరంతరం తనిఖీ చేస్తారని ప్రభుత్వం తెలిపింది.

చంద్రయాన్-4, 5 డిజైన్లు పూర్తి: ఇస్రో చైర్మన్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: చంద్రయాన్-3 విజయవంతం నేపథ్యంలో తదుపరి మిషన్ల కోసం చంద్రయాన్-4, 5 డిజైన్లు కూడా పూర్తయ్యాయని, వాటికి ప్రభుత్వ అనుమతి కోరే పనిలో ఉన్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ మంగళవారం వెల్లడించారు. చంద్రయాన్-4 మిషన్ 2028లో ఉంటుందని ఇస్రో గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, వచ్చే ఐదేళ్లలో 70 ఉపగ్రహాలు ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తుందని సోమనాథ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవ రహిత మిషన్‌ను ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభిస్తామని, ఇప్పటికే రాకెట్‌కు సంబంధించిన అన్ని దశలూ శ్రీహరికోటలోని షార్‌కు చేరుకున్నాయని సోమనాథ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, చిన్న చిన్న ఉపగ్రహాలను కక్ష్యలోకి చేరవేసేందుకు వినియోగిస్తున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్వీ) రాకెట్ల తయారీపై పదికిపైగా ప్రైవేటు కంపెనీలు ఆసక్తి కనబరిచాయని సోమనాథ్ మంగళవారం తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ'కు నిరసనగా నేడు భారత్ బంద్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నారు. 'ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి' బంద్‌కు పిలుపు ఇవ్వగా, పలు ఎస్సీ ఎస్టీ సంఘాలు, బీఎస్పీ మద్దతు పలికాయి. భారత్ బంద్‌లో తమ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొనాలని బీఎస్పీ కోరింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ విధానానికి లోబడి ఉప కులాలను వర్గీకరించే హక్కును ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు కల్పిస్తూ ఈ నెల 1వ తేదీన సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కాగా, బంద్ నుంచి అంబులెన్స్‌లు, అత్యవసర సర్వీసులు, ఆస్పత్రులు-వైద్య సేవలు, ఫార్మసీ, పోలీసు సర్వీసులకు మినహాయింపు ఇచ్చారు.

రైల్వేలో తొలిసారిగా 'మాస్టర్ క్లాక్'

న్యూఢిల్లీ, ఆగస్టు 20: భారతీయ రైల్వే తొలిసారిగా మాస్టర్ క్లాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం రైల్వేలో మాన్యువల్ టైమ్‌ను వినియోగిస్తున్నారు. దీనివల్ల వివిధ రైల్వే వ్యవస్థల్లో, యాప్‌ల్లో, జోన్లలో టైమ్ వేర్వేరుగా ఉంటోంది. దీంతో రైలు ప్రమాదాల దర్యాప్తుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ ఏడాది అక్టోబరు 2లోగా నమూనా మాస్టర్ క్లాక్ వ్యవస్థను పరిచయం చేయాలని భారతీయ రైల్వే భావిస్తోంది. రైల్వే నెట్‌వర్క్‌లోని అన్ని వ్యవస్థలు, యాప్‌ల్లో ఒకే సమయం ఉండేలా చూడడమే ఈ మాస్టర్ క్లాక్ లక్ష్యం.

తీర్పుల్లో వ్యక్తిగత అభిప్రాయాలు వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: యవ్వనంలోని బాలికలకు కలకత్తా హైకోర్టు ఇచ్చిన 'అభ్యంతరకర సలహా'లను మంగళవారం సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. తీర్పులో వ్యక్తిగత అభిప్రాయాలు ఉండకూడదని తెలిపింది. ఇటీవల లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల శిక్ష పడ్డ నిందితుడ్ని నిర్దోషిగా విడుదల చేసిన కలకత్తా హైకోర్టు.. 'లైంగిక వాంఛనలను అదుపులో ఉంచుకోవాల'ంటూ తీర్పులో బాలికలకు పలు సూచనలు చేసింది. 'రెండు నిమిషాల లైంగిక సుఖం కోసం చూసుకుంటే సమాజం దృష్టిలో ఆమె నష్టపోతుంది' అని వ్యాఖ్యానించింది. అయితే ఈ సలహా అభ్యంతరకరమైనదంటూ గత ఏడాది డిసెంబరు 8న హైకోర్టు సుమోటోగా విచారణ ప్రారంభించింది. తీర్పుల్లో ప్రవచనాలు చెప్పడం జడ్జీల పనికాదని తెలిపింది. కేవలం విషయం ఆధారంగా తీర్పు చెప్పాలే తప్ప, వ్యక్తిగత అభిప్రాయాలుగానీ, ప్రవచనాలుగానీ ఉండకూడదని ధర్మాసనం తెలిపింది.

వైద్యుల భద్రతకు టాస్క్‌ఫోర్స్!

(మొదటి పేజీ తరువాయి)



ప్రణాళికను రూపొందించాలని ఎన్‌టీఎఫ్‌కు నిర్దేశించింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగా.. పూర్తిస్థాయి నివేదికను రెండు నెలల్లోగా సమర్పించాలని ఆదేశించింది. టాస్క్‌ఫోర్స్‌కు కేంద్ర క్యాబినెట్, హోంశాఖ, ఆరోగ్యశాఖ కార్యదర్శులు.. జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది. వైద్యులపై భౌతికదాడులు, లైంగిక హింసకు సంబంధించి వైద్యసంస్థలు తమకు తాము ఎలాంటి నిబంధనలను రూపొందించుకోకపోవడం తీవ్ర ఆందోళనకరం అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యుల భద్రత కోసం చట్టాలు ఉన్నాయని.. అయితే అవి వ్యవస్థాగత సమస్య (సిస్టమెటిక్ ఇష్యూస్)లను పరిష్కరించలేవు అని వ్యాఖ్యానించింది. పనిచేసే చోట వైద్యులకు భద్రతాలేమిపై సుప్రీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందుకు మరో అత్యాచారమో.. హత్యో జరిగేదాకా ఎదురుచూడకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఆర్జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి పేర్లు, ఫొటోలు, వీడియోలను తక్షణమే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఆందోళనలను విరమించి, ఎప్పటిలాగే వైద్యసేవలు కొనసాగించాలని అప్పీలు చేసింది. వైద్యుల సమ్మెతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొంది. "వైద్యుల భద్రతపై భరోసా కల్పించేందుకు మేం ఉన్నాం.. ప్లీజ్ మమ్మల్ని నమ్మండి" అని వైద్యులను ఉద్దేశించి పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రి వైద్యులు తమ సమ్మెకు ముగింపు పలికారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించడాన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. మరోవైపు.. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపేందుకు స్వామి వివేకానంద స్టేట్ పోలీస్ అకాడమీ ఐజీ డాక్టర్ ప్రణవ్ కుమార్ సారథ్యంలో నాలుగు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

టాస్క్‌ఫోర్స్ సభ్యులు వీరే

1. సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి, ఏవీఎస్ఎం, వీఎస్ఎం, డీజీ, మెడికల్ సర్వీసెస్ (నేవీ)
2. డి.నాగేశ్వర్‌రెడ్డి, చైర్మన్, ఎండీ, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ, ఏఐజీ హాస్పిటల్స్
3. ఎం.శ్రీనివాస్, ఎయిమ్స్(ఢిల్లీ) డైరెక్టర్
4. ప్రతిమామూర్తి, నిమ్‌హాన్స్ డైరెక్టర్, బెంగళూరు
5. గోవర్ధన్ దత్ పూరి, ఎయిమ్స్(జోధ్‌పూర్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
6. సౌమిత్రా రావత్, మెంబర్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సర్ గంగారామ్ హాస్పిటల్
7. ప్రొఫెసర్ అనితా సక్సేనా, వైస్ ఛాన్సలర్, పండిట్ బీడీ శర్మ మెడికల్ యూనివర్సిటీ, రోహ్‌తక్
8. పల్లవి సప్లే, డీన్, గ్రాంట్ మెడికల్ కాలేజ్,జేజే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, ముంబై
9. పద్మా శ్రీవాస్తవ, గతంలో ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం ప్రొఫెసర్.

అరుణా షాన్‌బాగ్‌ను ప్రస్తావించిన సీజేఐ



సుప్రీం విచారణను లైవ్‌లో చూస్తున్న ఓ వైద్యురాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కోల్‌కతా హత్యాచారం అంశంపై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. అరుణా షాన్‌బాగ్ ఉదంతాన్ని ప్రస్తావించారు. 1973 నాటి ఈ ఘటన అప్పట్లో దేశంలో సంచలనం సృష్టించింది. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసే అరుణా షాన్‌బాగ్‌పై 1973 నవంబరు 27వ తేదీ రాత్రి ఆస్పత్రిలోని వార్డు బాయ్ సోహన్‌లాల్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె మెడకు.. కుక్కలను కట్టివేయటానికి ఉపయోగించే గొలుసు వేసి బిగించటంతో.. అరుణ మెదడు తీవ్రంగా దెబ్బతిన్నది. నాటి నుంచి 2015లో మరణించేవరకూ అరుణ అచేతనస్థితిలో (పర్సిస్టెంట్ వెజిటేటివ్ స్టేట్) ఉండిపోయారు. అదే ఆస్పత్రిలో పనిచేసే సందీప్ సర్దేశాయ్ అనే డాక్టర్‌తో నిశ్చితార్థం జరిగి, మరికొన్ని నెలల్లో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాల్సిన అరుణా షాన్‌బాగ్ జీవితం ఈ దారుణ ఘటనతో సర్వనాశనమైపోయింది. అయితే, ఆస్పత్రి సిబ్బంది నాలుగు దశాబ్దాలపాటు ఆమెకు సేవలు అందించి ప్రాణాలు నిలబెట్టారు. అరుణ నిమోనియాతో 2015 మే 18న మరణించారు. ఆమె జీవితాన్ని నాశనం చేసిన వార్డు బాయ్ సోహన్‌లాల్ కేవలం ఏడేళ్లపాటు జైలులో ఉండి 1980లో విడుదలయ్యాడు. ఆస్పత్రిలో జరిగే వైద్య ప్రయోగాల్లో ఉపయోగించే కుక్కల కోసం తీసుకొచ్చే ఆహారాన్ని సోహన్‌లాల్ దొంగిలిస్తుండటంతో అరుణ అతడిని మందలించి, అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. దీనిపై కక్షతో ఆమెపై సోహన్‌లాల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

లోకం తీరు



నేరస్థుడు పశువులా వ్యవహరించాడు!

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. ఇది 'అత్యంత భయానకమైన' ఘటన అని.. నేరస్థుడు 'పశువులా వ్యవహరించాడు' అని పేర్కొంది. వైద్యురాలి పట్ల జరిగిన ఘోరంతో దేశవ్యాప్తంగా వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వ్యాఖ్యానించింది. నేరం జరిగిన తర్వాత ఆర్జీ కర్ వైద్యకళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ వ్యవహరించిన తీరును కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. "నేరం ఉదయం జరిగింది. సాయంత్రం 4గంటలకు పోస్టుమార్టం పూర్తైంది. మరి.. ఆ రోజు రాత్రి 11.45 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏమిటి? కేసు నమోదులో ఇంత ఆలస్యం ఎందుకైనట్లు" అని ప్రశ్నించింది. అంత ఘోరం జరిగినా ప్రిన్సిపల్ ఆత్మహత్య ఘటనగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని తీవ్రంగా తప్పు బట్టింది. కూతురు మృతదేహాన్ని చూసేందుకు తల్లిదండ్రులను 3 గంటల పాటు నిరీక్షించేలా ఎందుకు చేశారని ప్రశ్నించింది. కేసు దర్యాప్తు ఎంత వరకొచ్చింది? అనే విషయమ్మీద గురువారం (22వ తేదీ) నివేదిక అందజేయాలేయాలని సీబీఐని ఆదేశించింది.

స్కూల్ టాయిలెట్‌లో చిన్నారులపై దారుణం

పెల్లుబికిన జనాగ్రహం

మహారాష్ట్రను కుదిపేస్తున్న బద్లాపూర్ ఘటన

8 గంటల పాటు రైల్వే ట్రాక్‌పై ఆందోళన

నిందితుడిని ఉరి తీయాలంటూ నినాదాలు



బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో పట్టాలపై నిరసనకారులు

ముంబై, ఆగస్టు 20: అన్నెం పున్నెం ఎరుగని మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులపై పాఠశాల టాయిలెట్‌లో ఓ అటెండెంట్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహారాష్ట్రను కుదిపేస్తోంది. వందలాది మంది తల్లిదండ్రులు, ప్రజలు దాదాపు ఎనిమిది గంటల పాటు థానే జిల్లా బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో పట్టాలపై బైఠాయించారు. రైళ్ల రాకపోకలను అడ్డుకోవద్దని, రైల్వే ట్రాక్‌లను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఎంత విజ్ఞప్తి చేసినా లెక్కచేయకుండా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన నిందితుడిని ఉరి తీయాల్సిందేనంటూ నినదించారు. 'హ్యాంగ్.. హ్యాంగ్' నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ ఆందోళనతో అంబర్‌నాథ్-కర్జత్ సెక్షన్‌లో లోకల్ రైళ్లు నిలిచిపోయాయి. 15 దూర ప్రాంత రైళ్లను దారి మళ్లించారు. వారిని శాంతింపజేసేందుకు మధ్యాహ్నం మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదులను తీసుకోవడంతో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేశామని, నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరసనకారుల డిమాండ్లకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రైళ్ల రద్దవ్వడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పినా ఆందోళనను విరమించలేదు. సాయంత్రం నిరసనకారులను ఖాళీ చేయించేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. ప్రతిగా నిరసనకారులు రాళ్లు రువ్వారు. ఎట్టకేలకు 6.15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌ను క్లియర్ చేయగలిగారు. దాదాపు పది గంటల తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. రైల్ రోకోకు దిగడానికి ముందు మహిళలతో సహా వందలాది మంది నిరసనకారులు ఆ పాఠశాల వద్దకు వెళ్లారు. కొందరు పాఠశాల గేట్లను బద్దలుకొట్టి లోపలికి వెళ్లి.. తలుపులు, కిటికీలు, బెంచీలను విరగ్గొట్టారు.

ఈ నెల 13న ఘటన

మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లోని ఓ పేరున్న పాఠశాలలో ఈ నెల 13న ఈ ఘోరం జరిగింది. పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న అక్షయ్ షిండే అనే వ్యక్తి అక్కడ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై టాయిలెట్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత వారిలో ఓ చిన్నారి నొప్పితో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షల్లో ఆ చిన్నారి ప్రైవేటు భాగాలకు గాయమైనట్టు తెలిసింది. అలాగే మరో చిన్నారి బడికి వెళ్లడానికి భయపడుతుండడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా ఆ స్వీపర్ అఘాయిత్యం బయటపడింది. ఈ దారుణంపై ఫిర్యాదు చేసినా పోలీసులు వెంటనే స్పందించలేదని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 17న నిందితుడిని అరెస్టు చేసి, 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేశారు. పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్‌ను, కొందరు సిబ్బందిని సస్పెండ్ చేసింది. అయితే ఆ పాఠశాలలో మహిళా అటెండెంట్లు లేకపోవడమే కాదు.. సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసుల విచారణలో తేలింది. పాఠశాల నిర్వహణలో లోపాలు బయటపడ్డాయి. పాఠశాల యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని వదిలిపెట్టకూడదని పట్టుబడుతున్నారు. ఈ ఘటనపై మహిళా ఐపీఎస్ అధికారిణి ఆర్తి సింగ్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్లు డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేసు విచారణ వేగంగా జరిగేలా.. నిందితుడికి ఉరి శిక్ష పడేలా చూస్తామని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే హామీ ఇచ్చారు.

కేంద్రంలో నేరుగా నియామకాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

నియామకాల మీద అభ్యంతరం తెలిపారు. ప్రైవేటు సెక్టారులో ఎలాగూ రిజర్వేషన్లు లేవని, ప్రభుత్వంలో ఉన్న రిజర్వేషన్లకు గండి కొడితే ఎలా అని చిరాగ్ ప్రశ్నించారు. దాంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలో కొందరు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. 2005లో కాంగ్రెస్ పాలనలోనే నేరుగా నియామకాల ప్రక్రియకు బీజం పడిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని సివిల్ సర్వీస్ సంస్కరణల కమిటీ వివిధ రంగాల నిపుణులను నేరుగా ఉన్నతోద్యోగాల్లోకి తీసుకోవాలని సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. 2013లో ఆరో వేతన సంఘం కూడా అదే చెప్పిందన్నారు. దాన్నే 2018లో మోదీ సర్కారు అమలు చేసిందని తెలిపారు. కాగా, కూటమిలో అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాని కార్యాలయం చిరాగ్ పాశ్వాన్‌తో సంప్రదింపులు జరిపింది. పీఎంవో ఆదేశాల మేరకే రద్దు నిర్ణయం వెలువడింది. కేంద్రంలోని వివిధ శాఖల్లో జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ హోదాలో 45 మందిని నేరుగా నియమించడానికి ఈ నెల 17న యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. దానిపై రాజకీయ వివాదం రాజుకోవడంతో మంగళవారం ఉదయమే సిబ్బంది శాఖ మంత్రి జితేంద్రసింగ్ సదరు ఉద్యోగ ప్రకటనను రద్దు చేయాలని కోరుతూ యూపీఎస్సీకి లేఖ రాశారు. నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ మంగళవారం యూపీఎస్సీ సర్క్యులర్ జారీ చేసింది. నేరుగా నియామకాల ప్రక్రియను పునఃపరిశీలించాలని నిర్ణయించామని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆధార్ సంస్థ యూఐడీఏఐ చైర్మన్‌గా నందన్ నీలేకనిని ఇదే పద్ధతిలో నియమించారని గుర్తు చేశారు. కేంద్రం నిర్ణయం వెలువడగానే రాహుల్‌గాంధీ.. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను రక్షించడం కోసం ఎంత వరకైనా వెళతామని ఎక్స్‌లో పోస్టు చేశారు.

పదేళ్ల గరిష్ఠానికి రిజర్వాయర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశంలోని జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ప్రస్తుత నీటి నిల్వలు పదేళ్ల సగటుతో పోల్చుకుంటే 14% పెరిగాయి. ఇది ఈ ఏడాది గణనీయమైన పెరుగుదల అని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) పేర్కొంది. తాజాగా దేశంలోని రిజర్వాయర్ల నీటిమట్టాల వివరాలను సీడబ్ల్యూసీ విడుదల చేసింది. దీని ప్రకారం.. 150 భారీ రిజర్వాయర్లలో 124 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ఇది ఆయా జలాశయాల ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో 69%. గత ఏడాది ఇదే సమయానికి 111.85 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే నిల్వ ఉండడం గమనార్హం. రిజర్వాయర్ల సాధారణ నీటి నిల్వ 108.79 బిలియన్ క్యూబిక్ మీటర్లు. దీంతో పోల్చుకుంటే.. ప్రస్తుత నిల్వలు పదేళ్ల సగటుతో పోల్చుకుంటే 14 శాతం పెరిగాయి. అయితే.. రాష్ట్రాల వారీగా నీటి నిల్వలను సమీక్షించినప్పుడు కొంత వ్యత్యాసం కనిపిస్తోందని నివేదిక వివరించింది. కాగా, దేశవ్యాప్తంగా వరి విస్తీర్ణం 6% పెరిగినట్టు కేంద్రం వెల్లడించింది. పత్తి సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే తగ్గిందని తెలిపింది.

ఎంపాక్స్ చికిత్సకు మార్గదర్శకాలు

- ఢిల్లీ ఎయిమ్స్‌లో రోగుల ఐసొలేషన్‌కు 5 పడకలు
- వ్యాక్సిన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం: సీరం



హైదరాబాద్‌లోని ఫీవర్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంపాక్స్ వార్డు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఎంపాక్స్ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించడానికి ఢిల్లీ ఎయిమ్స్ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఐసొలేషన్ వార్డులో చికిత్స కోసం ఐదు పడకలను కేటాయించింది. ఇతర రోగులు, సిబ్బందితో కాంటాక్ట్‌ను తగ్గించడానికి అనుమానిత రోగులను వెంటనే నిర్దేశిత ఐసొలేషన్ వార్డులో ఉంచాలని పేర్కొంది. ఈ వ్యాధిపై అవగాహన పెంచడం, వేగంగా గుర్తించడం, వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కఠినమైన నియంత్రణ చర్యలు అవసరమని తెలిపింది. ఎయిమ్స్ జారీ చేసిన ఎస్‌వోపీ ప్రకారం... మంకీపాక్స్ అనేది వైరల్ జూనోసిస్ వ్యాధి. ఇది మశూచి రోగుల్లో కనిపించిన లక్షణాలను పోలి ఉంటుంది. అయితే దీని తీవ్రత తక్కువ. జ్వరం, దద్దుర్లు లేదా మంకీపాక్స్ నిర్ధారణ అయిన రోగులను కలిసిన చరిత్ర ఉన్నవారిని తక్షణం గుర్తించాలి. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, చర్మంపై పొక్కులు, దద్దుర్లు తదితర లక్షణాలతో వచ్చేవారిని ఐసొలేట్ చేయడానికి ఏబీ-7 వార్డులో ఐదు పడకలు కేటాయించినట్లు తెలిపింది. అత్యవసర విభాగం చీఫ్ మెడికల్ ఆఫీసర్ సిఫారసు మేరకు ఈ పడకలను రోగులకు కేటాయిస్తారు. రోగులకు చికిత్స అందించే సమయంలో వైద్య సిబ్బంది తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ) ఉపయోగించాలని ఎయిమ్స్ స్పష్టం చేసింది. రోగులను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించడానికి ప్రత్యేక అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. కాగా, మంకీపాక్స్‌కు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, ఏడాదిలో సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు పుణెలోని సీరం ఇన్‌స్టిట్యూట్ సీఈవో అధర్ పూనావాలా మంగళవారం ప్రకటించారు.

మరో కొవిడ్ కాదు

ఎంపాక్స్‌ను కొవిడ్-19తో పోల్చలేమని, దాని వ్యాప్తిని నియంత్రించడం సాధ్యమేనని డబ్ల్యూహెచ్‌వో అధికారి ఒకరు తెలిపారు. దీని వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన చర్యలు అధికారులకు తెలుసని అన్నారు. మనందరం కలసి ఎంపాక్స్‌ను ఎదుర్కోవాలని డబ్ల్యూహెచ్‌వో యూరప్ రీజినల్ డైరెక్టర్ హాన్స్ క్లూజ్ పేర్కొన్నారు. 'ఎంపాక్స్ కట్టడికి వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటామా? లేకపోతే మరోసారి నిర్లక్ష్యం, భయం వైపు వెళ్తామా? అనేది ఇప్పుడు మనం ఎలా స్పందిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది" అని క్లూజ్ అన్నారు.

జెండాకు చైనా వస్త్రమా: సోనియా

న్యూఢిల్లీ, ఆగస్టు 20: జాతీయ జెండా విషయంలోనూ ప్రధాని మోదీ ద్వంద్వ ఎజెండాను అనుసరిస్తున్నారని కాంగ్రెస్ నేత సోనియాగాంధీ విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్‌ఘర్ తిరంగా' నినాదంతో ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీనిని ప్రస్తావిస్తూ.. "జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడంలో ఆయన(మోదీ) నైతికంగా ద్వంద్వ విధానాన్ని పాటిస్తారు. త్రివర్ణ పతాకం పొడగిట్టని సంస్థ పట్ల విధేయత చూపడం ఒకటైతే, పాలిస్టర్ సహా చైనా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి సరుకుతో రూపొందిస్తున్న జెండాలను వినియోగించడం రెండోది" అని సోనియా దుయ్యబట్టారు. ఈ మేరకు ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ది హిందూ'లో మంగళవారం ఆమె రాసిన ఓ ఆర్టికల్ రాశారు. జాతీయ జెండా రూపకల్పనకు కేవలం ఖాదీ వస్త్రాన్నే వినియోగించాలని సూచించారు. 'ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా' ప్రకారం చేతితో నేసిన వస్త్రాలను మాత్రమే పతాక రూపకల్పనకు వినియోగించాలని సోనియా సూచించారు. కానీ, దానికి 2021లో సవరణలు చేసి.. పాలిస్టర్ సహా మిషన్‌పై రూపొందించిన వస్త్రాలను కూడా జాతీయ జెండా కోసం వాడుకునేలా నిబంధనలు మార్చేశారన్నారు.

కుటుంబాలను కలిపి ఉంచుదాం

అమెరికా కొత్త పౌరసత్వ స్కీమ్ కింద దరఖాస్తుల స్వీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: 'కుటుంబాలను కలిపి ఉంచుదాం' పేరుతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగం ప్రకటించిన సరికొత్త విధాన నిర్ణయం లక్షలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతోంది. ఈ నిర్ణయంతో చట్ట విరుద్ధంగా దేశంలో నివసిస్తున్న 5 లక్షల మంది దంపతులు, 50 వేల మంది సవతి పిల్లలు లబ్ధి పొందనున్నారు. యూఎస్ పౌరసత్వానికి అర్హత రావడంతో నిన్నటి వరకూ అనిశ్చితితో నిండిన వారి జీవితాల్లో నిశ్చింత ఏర్పడనుంది. జూన్‌లో ఈ పథకాన్ని ప్రకటించారు. ఆగస్టు 19 నుంచి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. యూఎస్ పౌరుని పెళ్లి చేసుకుని, కనిష్ఠంగా పదేళ్లనుంచి అక్కడే నివాసం ఉంటున్న దంపతులు ఈ పథకానికి అర్హులు. జూన్ 17, 2024 నాటికి పదేళ్లు పూర్తయి ఉండాలన్నది నియమం. అలాగే 21 సంవత్సరాలు వయస్సు లోపల ఉన్న, అవివాహిత సవతి పిల్లలు కూడా ఈ పథకానికి అర్హులు. ఈ పథకం గురించి యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ ఉర్ జద్దొ మాట్లాడుతూ, 'యూఎస్ పౌరులను పెళ్లి చేసుకున్న ఇతర దేశస్థులు... వారిలో చాలా మంది తల్లిదండ్రులు... మా దేశపు ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలోని అనవసరపు అడ్డంకులతో నిరంతరం అనిశ్చితితో, అభద్రతతో జీవిస్తున్నారు. ఈ పథకంతో పౌరసత్వ సాధనకు ఆ అడ్డంకులు తొలగిపోతాయి' అని పేర్కొన్నారు.

రాఖీ పండుగ రోజు ఆర్టీసీకి రూ.32కోట్ల ఆదాయం

హైదరాబాద్/గజ్వేల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ రోజు(సోమవారం)న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో రికార్డు స్థాయిలో మొత్తం 63.86 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. ఇందులో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇచ్చిన జీరో టికెట్లే 41.74లక్షలు. ప్రయాణికులు పోటెత్తడంతో సోమవారం ఒక్కరోజే ఆర్టీసీకి రూ.32కోట్ల ఆదాయం సమకూరింది. జీరో టికెట్లతో రూ.17కోట్లు, పురుషుల టికెట్లతో రూ.15కోట్లు వచ్చాయి. ఆర్టీసీకి ఒక్కరోజులోనే ఇంత ఆదాయం గతంలో ఎప్పుడూ రాలేదని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రక్షాబంధన్ రోజు ఆర్టీసీ బస్సులన్నీ కలిపి 38 లక్షల కిలోమీటర్లు తిరిగాయని, ఇది సగటు కన్నా 5 లక్షల కిలోమీటర్లు ఎక్కువని చెప్పారు. రాష్ట్రంలోని 97 డిపోలకు గాను 92 డిపోల్లో 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదైందని సజ్జనార్ వివరించారు. కాగా, సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు రికార్డు స్థాయిలో రూ.25.92లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్గదర్శి కేసులో కౌంటర్‌లు దాఖలు చేయండి

» తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందన్న ఆరోపణలపై మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన కేసులో వివరణ ఇవ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒకవేళ ఎవరైనా బకాయిలు రావాల్సిన డిపాజిటర్లు ఉంటే వారందరికీ తెలిసేలా ప్రముఖ వార్తాపత్రికల్లో బహిరంగ నోటీసు ప్రచురించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. డిపాజిటర్ల సమాచారం ఎలక్ట్రానిక్ రూపంలో కావాలనుకుంటే అందుకు తగిన విధంగా దరఖాస్తు సమర్పించాలని పిటిషనర్ అయిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు సూచించింది. మార్గదర్శి చట్టవిరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందని ఆరోపిస్తూ 2008లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని మార్గదర్శి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. 2018 డిసెంబర్ 31న మార్గదర్శికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. మార్గదర్శికి వ్యతిరేకంగా ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతోపాటు, డిపాజిట్లు పూర్తిగా తిరిగి ఇచ్చినందున కేసును హైకోర్టు కొట్టేసింది. దీనిపై ఉండవల్లి సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. స్పందించిన సుప్రీంకోర్టు రిజర్వుబ్యాంకు సహా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, ఉండవల్లి, డిపాజిటర్లు ఎవరైనా ఉంటే వారితో సహా అందరి వాదనలను మళ్లీ వినాలని పేర్కొంటూ కేసును తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శికి డిపాజిట్లు సేకరించే అధికారం లేదని ఇప్పటికే ఆర్బీఐ కౌంటర్ దాఖలు చేసింది. ఆర్బీఐ దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానం ఇవ్వడానికి రెండు వారాల సమయం కావాలని పిటిషనర్ ఉండవల్లితో పాటు, మార్గదర్శి తరఫున హాజరైన న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. తెలంగాణ తరఫున పల్లె నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరైన ఉండవల్లి వాదనలు వినిపిస్తూ హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) డిపాజిట్లు సేకరించడానికి అవకాశం లేదని, అలా సేకరించడం చట్టవిరుద్ధమని ఆర్బీఐ స్పష్టం చేసిందని పేర్కొన్నారు. మార్గదర్శి 70 వేల మంది డిపాజిటర్ల వివరాలను ఏడు వాల్యూమ్స్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిందని, ఆ సమాచారాన్ని హైకోర్టుకు సైతం పెన్‌డ్రైవ్ వంటి ఎలక్ట్రానిక్ సాధనాల్లో అందజేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. మార్గదర్శి తరఫున లూథ్రా వాదనలు వినిపిస్తూ..రెండు రాష్ట్రాలు కౌంటర్ సమర్పించాల్సి ఉందని తెలిపారు.తాము ఆర్బీఐ కౌంటర్‌కు సమాధానం ఇస్తామని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. డిపాజిటర్ల సమాచారం కావాలనుకుంటే మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసుకోవాలని ఉండవల్లికి సూచించింది. డిపాజిటర్లు ఎవరైనా ఈ విచారణలో పాల్గొనాలనుకుంటే వారికి తెలిసేలా ప్రముఖ పత్రికల్లో బహిరంగ నోటీసు ప్రచురించాలని రిజిస్ట్రీకి ఆదేశాలిచ్చింది. రెండువారాల్లో కౌంటర్‌లు దాఖలు చేయాలని రెండు రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది.

కాళేశ్వరం కమిషన్‌లో నేటి నుంచి క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో భాగంగా బుధవారం నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రారంభించనున్నారు. తొలిరోజు మాజీ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్‌తో పాటు నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) మాజీ చీఫ్ ఇంజనీర్ నరేందర్‌రెడ్డిలను కమిషన్ చైర్మన్ జస్టిస్ ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. ఇప్పటికే 57 మంది అఫిడవిట్లు దాఖలు చేయగా... అందులో దాదాపు 25 మందిని కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. ఇక క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసేలోపు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఇద్దరు ప్రజాప్రతినిధులకు కబురు పంపించాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది. విచారణలో వీరి పాత్ర కీలకంగా ఉన్నట్లు కమిషన్ ఇదివరకే నిర్ణయానికి వచ్చింది. అఫిడవిట్ల రూపంలో అందించిన సమాచారంతో పాటు పలువురు ఇంజనీర్లు, మాజీ ఐఏఎస్‌లను విచారించే క్రమంలో ఈ విషయం బయటపడటంతో ఇద్దరికీ కబురు పంపించడానికి వీలుగా కసరత్తు చేస్తోంది.

బస్సులో పుట్టిన బిడ్డకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్

హైదరాబాద్/గద్వాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి రోజు గద్వాల డిపో బస్సులో జన్మించిన ఓ చిన్నారికి ఆర్టీసీ యాజమాన్యం జీవితకాలపు ఉచిత బస్‌పాస్ అందజేసింది. బస్సులో పురుడు పోసేందుకు సహకరించిన నర్సుకు ఏడాది కాలం పాటు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం చేసే వీలు కల్పించింది. గర్భిణికి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న కండక్టర్ భారతిని అభినందించి నగదు బహుమానం అందజేసింది. సమయస్ఫూర్తితో వ్యవహరించినందుకు కండక్టర్ భారతి, డ్రైవర్ అంజిలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సన్మానించారు.

ఆరేళ్లలో అమరరాజా

లిథియం అయాన్ బ్యాటరీలు!

పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభించనున్న సంస్థ

సమీక్షలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలో అమరరాజా లిథియం అయాన్ బ్యాటరీల తయారీ ప్లాంటు సిద్ధమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అమరరాజా ప్లాంట్ పురోగతిపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, అమరరాజా చైర్మన్ జయదేవ్ గల్లా, సంస్థ ప్రతినిధులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం మూడు దశల్లో 16 గిగావాట్ల సామర్థ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి జరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడితో మొదలైన ఈ కర్మాగారం మొదటి దశ ఇప్పటికే పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం 350 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన 262 ఎకరాల భూమిలో రెండు, మూడో దశ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని మంత్రి వివరించారు. 2030 నాటికి కర్మాగారం పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తుందని, మరో 3,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. అమరరాజా ప్లాంటు నుంచి జాతీయ రహదారి వరకు 3 కి.మీ. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్లాంటుకు అవసరమైన 220 కిలోవాట్ల విద్యుత్తు లైన్ నిర్మాణం సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయాలని కోరారు. ప్లాంట్ అవసరాలకు రోజుకు 5 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉండగా.. 1.5 మిలియన్ లీటర్ల నీటి సరఫరాకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మండల, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్లు

ఇక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు!

మండల, జిల్లా ప్రజాపరిషత్ సూపరింటెండెంట్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తమకు గెజిటెడ్ ఆఫీసర్ హోదా కల్పించాలంటూ అనేక సంవత్సరాలుగా కోరుతున్న సూపరింటెండెంట్లు, శాఖాధిపతుల (హెచ్‌వోడీ) విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించింది. ఈ క్రమంలో జిల్లా, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, హెచ్‌వోడీలకు గెజిటెడ్ ఆఫీసర్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇప్పటివరకు జిల్లా, మండల పరిషత్తుల్లో కొనసాగిన సూపరింటెండెంట్, హెచ్‌వోడీ పేర్లనూ తొలగించింది. వీరిని అడ్మినిస్ట్రేటివ్ అధికారులు (ఏవో)లుగా పిలుస్తారు.

'బ్రాక్'తో కలిసి పేదరికాన్ని నిర్మూలిస్తాం

» ఆ సంస్థతో పేదలకు ఉపాధి శిక్షణ: సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని రూపుమాపేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, నిరుపేదల జీవితాల్లో మార్పు తేవడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పలు దేశాల్లో పేదరిక నిర్మూలనపై పనిచేస్తున్న బ్రాక్ ఇంటర్నేషనల్ సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మధ్య మంగళవారం సచివాలయంలో మంత్రి సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. నాలుగు వేల అత్యంత పేద కుటుంబాలను గుర్తించి వారిని పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు మెరుగైన శిక్షణలు ఇప్పించి.. వారికి జీవనోపాధి కల్పించడంపై బ్రాక్ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు.



వెంకటేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఆంధ్రజ్యోతి జర్నలిస్టుకు 'మోటూరు' అవార్డు

విజయవాడ (గవర్నర్‌పేట), ఆగస్టు 20: 'ఆంధ్రజ్యోతి' నవ్య పేజీలో పలు మానవీయ కథనాలు రాసి పాఠకులను మెప్పించిన జర్నలిస్టు కె.వెంకటేష్‌కు మోటూరి హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానం జరిగింది. ప్రజాశక్తి దినపత్రిక 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మోటూరు హనుమంతరావు (ఎంహెచ్), భ మ్మారెడ్డి అవార్డుల ప్రదానోత్సవాన్ని విజయవాడలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటేష్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. భమ్మారెడ్డి ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని ప్రజాశక్తి విశాఖ బ్యూరో ఇన్‌చార్జి మధుసూదనరావు, హిందూపురం ప్రజాశక్తి విలేకరి ఎస్ షబ్బీర్‌కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి, ప్రజాశక్తి ఎడిటర్ బి. తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త బెడద

మంకీపాక్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న మన నౌకాశ్రయాలకు కూడా నిర్దిష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ వైరస్ సోకినవారిని ఐసొలేషన్‌లో ఉంచేందుకు, చికిత్స చేసేందుకు ఢిల్లీలోని రామ్‌మనోహర్‌లోహియా, సఫ్దర్‌జంగ్, లేడీ హార్డింగ్ ఆస్పత్రులను కేంద్రం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కొన్ని ఆస్పత్రులను ప్రత్యేకంగా కేటాయించాలని, మంకీపాక్స్ లక్షణాలున్న వ్యక్తులు బయట పడినప్పుడు ఆ సమాచారం తమతో పంచుకోవాలని కేంద్రం కోరింది. ప్రస్తుతానికి మన దేశంలో ఒక్కకేసూ లేకున్నా, ఆ వైరస్ పొరుగుదేశం వరకూ సమీపించడంతో మనం అప్రమత్తంగా ఉండక తప్పదు.

భారతదేశానికి సంబంధించినంతవరకూ దాని వ్యాప్తి అంత ఉధృతంగా ఉండదని ప్రస్తుతానికి అంచనాలున్నాయి. భయం అక్కరలేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. పాకిస్థాన్‌లో నాలుగుకేసులు నమోదైనప్పటికీ, వ్యాధిసోకినవారి సంఖ్య అనధికారికంగా ఇంకా ఎక్కువగా ఉండవచ్చును. కేవలం ఎంపాక్స్ కారణంగా దేశాల మధ్య రాకపోకలపై నిషేధాలు లేవు కనుక, రాబోయే రోజుల్లో విదేశాల నుంచి దిగుమతయ్యే కేసుల సంఖ్య మన దేశంలో నమోదుకావచ్చు. విమానాశ్రయాల్లోనూ, నౌకాశ్రయాల్లోనూ తనిఖీలు పెంచడం, అనుమానం ఉన్నవారిని పరీక్షించి, వేగంగా ఫలితాలు సాధించి నిర్దిష్టమైన చర్యలకు నడుం బిగించడం తక్షణ కర్తవ్యం. భారతదేశంలో గత రెండేళ్ళలో ఓ ముప్పై కేసులు నమోదుకావడంతో పాటు, మొన్న మార్చిలో కూడా కేరళలో ఓ మంకీపాక్స్ కేసు బయటపడింది.

కాంగోలో ఈ వ్యాధి వేగంగా విస్తరించి, తీవ్రమైన ప్రభావాన్ని వేయడంతో ప్రపంచ ఆరోగ్యసంస్థ అంతర్జాతీయస్థాయి ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించడంతో పాటు, స్వల్పవ్యవధిలోనే రెండుసార్లు హెచ్చరికలు చేయవలసివచ్చింది. గతంలో కాలూనని ఆఫ్రికన్ దేశాల్లోకి కూడా విస్తరిస్తూ, పదిరోజుల్లో అరడజను దేశాలకు వేగంగా వ్యాపించి, గత ఏడాదితో పోల్చితే రెట్టింపు కేసులు నమోదవుతున్నందున ఆరోగ్య సంస్థ ఆందోళన చెందుతోంది. కాంగోలో వేలాదికేసులు నమోదై, ఆరు వందల మరణాల వరకూ రికార్డు కావడం అటుంచితే, స్వీడన్ వంటి సుదూరప్రాంతాల్లో కూడా దీని ఛాయలు కనిపించడం విశేషం. రెండేళ్ళలో రెండుసార్లు ఈ వైరస్ వేగంగా వ్యాప్తిచెందుతూ ప్రపంచాన్ని భయపెట్టగలిగింది. ఇందుకు ప్రధాన కారణం ఈ తరహా వ్యాధుల విషయంలో అన్ని దేశాలూ ఏకతాటిపైకి వచ్చి వాటిపై సంఘటితంగా యుద్ధం చేయకపోవడమే. దీనితో, గతంలో కంటే మరింత శక్తిమంతమైన వేరియంట్‌తో అవి వ్యాప్తిచెందడానికి అవకాశమేర్పడుతోంది. అత్యంత ప్రమాదకరమైన కరోనా విషయంలో సైతం పేదదేశాలతో ధనికదేశాలు ఎంత అనుచితంగా వ్యవహరించాయో చూశాం. వాక్సిన్ల సరఫరాలో అగ్రరాజ్యాలు చూపిన ఆ వివక్ష సదరు వైరస్ మరికొంతకాలం ప్రపంచాన్ని వేధించడానికి కారణమైంది. ఉన్న ఒక్క ఎంపాక్స్ వాక్సిన్ ఆఫ్రికన్ దేశాలకు పూర్తిస్థాయిలో సరఫరాకాలేదు. అనుమతుల విషయంలో కాంగో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కూడా ప్రమాదాన్ని పెంచింది. వనరులు దోచుకోవడానికి తప్ప ఈ పేద దేశాల మంచి చెడులు పట్టించుకొనే తీరిక అగ్రరాజ్యాలకు ఉండదు. ఆఫ్రికన్ దేశాల పట్ల మిగతా ప్రపంచం చూపుతున్న నిర్లక్ష్యం అందరికీ చేటుచేస్తున్నది. జికా, చికున్‌గున్యా వంటి వ్యాధుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. దాదాపు ఆరుదశాబ్దాల క్రితం గుర్తించిన ఈ వ్యాధిని, నిరుపేద ఆఫ్రికన్ దేశాల సమస్యగా వదిలేయడంతో ఇప్పటికీ దానికి భయపడాల్సి వస్తున్నది. సుదీర్ఘకాలం పట్టించుకోని, పరిశోధనలు లేని కారణంగా ఇప్పుడు అది మరింత శక్తిమంతమైన వేరియంట్లతో విజృంభించగలుగుతోంది.

ఎంపాక్స్ విషయంలో ఆఫ్రికన్ దేశాలన్నీ ఏకతాటిపైకి రావాల్సి ఉంది. పరిశోధనలపై పెట్టుబడులకు మిగతా ప్రపంచం సహకరించాలి. ఎంపాక్స్ వాక్సిన్ అభివృద్ధిపరచే పనిలో ఉన్నామని, త్వరలోనే అది వెలుగుచూడవచ్చునని సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదర్ పూనావాలా మంగళవారం ఆశాభావం వ్యక్తంచేశారు. ఏటా ప్రపంచాన్ని భయపెట్టిపోతున్న ఈ వైరస్ కథ వేగంగా ముగించాల్సిన అవసరం ఉంది.

ఉపాధికై గల్ఫ్ దేశాలకు వచ్చిన ఇంజనీరింగ్ పట్టభద్రులు పలువురు తమ విద్యతో సంబంధం లేని ఇతర ఉద్యోగాలు చేసుకుంటున్నారు! వికసిత్ భారత్‌లో నైపుణ్య సమృద్ధ యువత కీలకమని మోదీ సర్కార్ గత ఐదేళ్లుగా చెబుతున్నా అందుకు తగిన కార్యాచరణ లేదు. స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఏకంగా ఒక నగరాన్ని నిర్మించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూనుకోవడం హర్షణీయమే అయినా అందుకు సరైన అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు మనముందున్న అసలు ప్రశ్న.

నైపుణ్యాల వృద్ధి–నయా నగరం

విద్యతోపాటు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి అంశాన్ని అనేక దేశాలు గుర్తించి ఆ దిశగా చురుగ్గా అడుగులు వేస్తున్నాయి. ఉపాధి వలసలను ఇతోధికంగా ప్రోత్సహిస్తోన్న భారత్ కూడా కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టింది. అయితే పురోగతి కొరవడింది. తెలుగు రాష్ట్రాలూ నైపుణ్యాల మెరుగుదలకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఒక ప్రత్యేక నగరాన్నే నెలకొల్పనున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంతోషం, అభినందనీయం. మరి క్షేత్రస్థాయి పరిస్థితులు, అవకాశాల గురించి ఏమైనా అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు అసలు ప్రశ్న.

అన్ని రకాల సాంకేతిక ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్న గల్ఫ్ దేశాలకు వృత్తి విద్య పట్టభద్రులు ఉపాధి కొరకు ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటారు. ఒక కఠోర వాస్తవమేమిటంటే ఇంజనీరింగ్ పట్టభద్రులు పలువురు తమ విద్యతో సంబంధం లేని ఇతర ఉద్యోగాలు చేసుకుంటున్నారు!. సాఫ్ట్‌వేర్‌ను మినహాయిస్తే మిగిలిన రంగాలలో మన యువత నైపుణ్యాలు అంతంత మాత్రమే.

తెలుగు రాష్ట్రాలలో ఉబెర్, రాపిడో ఇత్యాది అద్దె రవాణా బైకులను నడిపే వారిలో అనేకులు ఇంజనీరింగ్ పట్టభద్రులే సుమా! దుబాయిలోని జబల్ అలీ మందిరం వెలుపల ఎండలో చిన్న చితక గిఫ్టు సామాన్లు లేదా సెంటు బాటిళ్ళ విక్రేతలలో కూడ కొందరు వారే ఉండడం ఒక లజ్జాకర పరిస్థితికి అద్దంపట్టడం లేదూ? ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎంతో మంది చాలిచాలనీ వేతనాలతో నెట్టుకొస్తున్నారు. కారణమేమిటి? వారిలో వృత్తి నైపుణ్యాలు, భాషా కౌశలాలు కొరవడడమేనని చెప్పక తప్పదు.

గల్ఫ్ లేఖ

అరబ్ దేశాలలో ఫిలిప్పీన్స్, అమెరికాలో మెక్సికో జాతీయులకు ఉన్న సాంకేతిక నైపుణ్య పాటవాలు మన భారతీయుల వద్ద లేక పోవడం స్పష్టంగా కనపడుతుంది. తమ నైపుణ్యత ఆధారంగా అధిక వేతనంపై ఒక ఫిలిప్పీన్స్ జాతీయుడు తరచు ఉద్యోగం మారినట్లుగా ఒక భారతీయుడు మారడంలేదు, మారలేడు.

సాఫ్ట్‌వేర్‌లో పూర్తిగాను, వైద్య రంగంలో పాక్షికంగాను ఉన్నత స్థానాలలో భారతీయులు రాణిస్తున్నారు, సందేహం లేదు. అయితే క్రింది, మధ్య శ్రేణులలో మాత్రం ఇతర దేశస్థులు, ప్రత్యేకించి ఫిలిప్పీన్స్ వారితో పోటిపడలేకపోతున్నారు. ఈ వాస్తవాన్ని భారత్ అధికార వర్గాలు కూడా గుర్తించాయి. పరిశ్రమలు, భారీ నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాలలో నిపుణులను గుర్తించే నీలం రంగు హెల్మెట్‌లకు బదులుగా కార్మిక శ్రేణికి చిహ్నమైన పసుపు పచ్చ హెల్మెట్లు ఎక్కువగా ఉండడం మన స్థాయికి తగినట్లుగా లేదు. ఇంజనీర్లు లేదా మేనేజ్‌మెంట్ ప్రతినిధులుగా పని చేస్తున్న అత్యధికులకు ఆంగ్ల భాషలో ఒక నివేదిక రూపొందించడానికి నానా ప్రయాసలు పడవల్సిన పరిస్థితి!





సముద్రాల ఆవలి సీమలకు జరుగుతున్న వలసలను పక్కన పెడితే, దేశీయంగా కూడ అభివృద్ధికి అనుగుణంగా వృత్తి నిపుణులు లేకపోవడం ఎంతైనా శోచనీయం. అది అభివృద్ధికి విఘాతమవుతోంది. మహా నగరాలలో సైతం విభిన్న రంగాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా అందుబాటులో వృత్తి నిపుణులు లేరు. తెలుగునాట ఉన్నత స్థాయి నైపుణ్యత ఉన్నవారందరూ విదేశీబాట పడుతుండగా మధ్యతరగతి వృత్తులలో సైతం ఉత్తరాది రాష్ట్రాల యువత ముందుకు వస్తోంది. చివరకు కళాత్మక పనికి పెట్టింది పేరయిన ఒంగోలు తాపీ మేస్త్రీల స్థానంలో మధ్యప్రదేశ్ తాపీ మేస్త్రీలకు ఆదరణ లభిస్తోంది. అలాగే పొలాలలో వరి నాట్లు వేయడానికి బెంగాలీ కార్మికులు తెలుగునాటకు వస్తున్నారు. ఒక్క పట్టణంలో కూడ నైపుణ్యత కల్గిన ఒక ఎసి. టెక్నీషియన్ గానీ, మొబైల్ టెక్నీషియన్ గానీ లేకపోవడం గమనార్హం.

సరైన అధ్యాపక వ్యవస్థ లేని విద్యా సంస్థలు ఏటా వేలాది సంఖ్యలో అరకొర చదువుతో యువతను వీధులలోకి వదులుతున్నాయి. అనుభవపూర్వకంగా నేర్చుకునే అవకాశాలు వారికి ఏ మాత్రం లేవు. అప్రెంటిస్‌షిప్ విధానం అంతరించిపోయింది. సాంకేతిక విద్యా రంగంలో ఏళ్ళ తరబడి భారీ సంఖ్యలో ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలు ఉన్నాయి. ఒకప్పుడు జాతి నిర్మాణంలో ఐటిఐలు, పాలీటెక్నిక్‌లు ముఖ్య భూమిక వహించాయి. వీటిలో చదివి చక్కెర కర్మాగారాలలో పని చేసిన అనేక మంది ప్రపంచ అగ్రగామి పెట్రో రసాయనాల సంస్థలలో విజయవంతంగా పనిచేస్తున్నారు. మరి వారిని తీర్చిదిద్దిన ఆ పాలీటెక్నిక్‌లు ఇప్పుడు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.

ఈ పరిస్థితులలో యువతలో తార్కిక శక్తిని, వృత్తిలో సృజనాత్మక దృక్పథాన్ని పెంపొందించడం ముఖ్యమని నరేంద్ర మోదీ ప్రభుత్వం గుర్తించింది. వికసిత్ భారత్‌లో నైపుణ్య సమృద్ధ యువత కీలకమని గత ఐదేళ్లుగా చెబుతున్నది. అయితే అందుకు తగినట్లుగా కార్యాచరణ ఉన్నదా? లేదు. జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం (నాట్స్)ను పునర్వ్యవస్థీకరించి ఇంజనీరింగ్, డిప్లోమా హోల్డర్లకు మెరుగైన నైపుణ్యతను సంతరింపచేసేందుకు పెద్దపీట వేస్తున్నామని చెప్పి, నైపుణ్యాభివృద్ధిలో పైలట్ ప్రాజెక్టు క్రింద యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నౌకాశ్రయాల దిగ్గజ సంస్థ దుబాయి పోర్ట్ వరల్డ్ భాగస్వామ్యంతో వారణాసిలో నౌకాయాన, సరుకు రవాణాకు సంబంధించిన శిక్షణా సంస్థను ఏర్పాటు చేసింది. సముద్ర తీరంలోని విశాఖ, కాకినాడ, చెన్నై, కొచ్చిన్‌లలో కాకుండా పూర్తిగా భూపరివేష్టిత వారణాసిలో అటువంటి సంస్థను ఏర్పాటు చేయడంలో ఔచిత్యమున్నదా? తెలుగు రాష్ట్రాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వామ్యంతో పురోగమించడానికి ప్రయత్నించాలి.

ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఏకంగా ఒక నగరాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం ఎంతో ఆనందం కలిగించింది. అదే సమయంలో అయోమయానికీ గురి చేసింది. యువత దశ, దిశ మార్చే ఈ బృహత్తర కార్యక్రమం స్వాగతించదగ్గదే కానీ దాని కొరకు సరైన అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు మనముందున్న అసలు ప్రశ్న.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పదునెక్కుతున్న మోదీ వ్యూహప్రతివ్యూహాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కంసుడిని కృష్ణుడు హతమార్చకపోతే కృష్ణుడిని హతమార్చేందుకు కంసుడు తన ప్రయత్నాలను మానుకునేవాడు కాదని భాగవతంలో దశమస్కంధం చదివిన వారికి అర్థమవుతుంది. రాజకీయాలు కూడా అదే విధంగా ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలియనిది కాదు. లోక్‌సభలో బీజేపీ మెజారిటీ 240 సీట్లకు తగ్గిపోయినప్పటి నుంచీ కొంచెం వెనక్కు తగ్గినట్లు కనపడిన మోదీ స్వాతంత్ర్య పర్వదినం నుంచే తన ఆయుధాలు సంధించడం ప్రారంభించారు. దీనిని బట్టి ఆయన తన సహజ లక్షణాలు కోల్పోలేదన్న విషయం అర్థమవుతోంది.

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటి రోజు నుంచీ ఇండియా కూటమి తగ్గేదే లేదన్నట్లుగా కొదమసింహంలా దూకుడు ప్రదర్శిస్తూ మోదీ సేనను ఆత్మరక్షణలో పడేసేందుకు ప్రయత్నించడం ప్రారంభించింది. ఇటీవల ముగిసిన 18వ లోక్‌సభ తొలి సమావేశాల్లో రాహుల్ నేతృత్వంలో ఇండియా కూటమి అవకాశం దొరికినప్పుడల్లా ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగానికి అడుగడుగునా అడ్డుతగిలేందుకు రాహుల్ గాంధీ స్వయంగా సారథ్యం వహించారు. ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాల వ్యవహార శైలితో అనేక సందర్భాల్లో సభాపతులు నిరాశా నిస్పృహలకు గురికాగా, అధికారపక్ష పెద్దలు చేష్టలుడిగి పోయారు. చివరకు శక్తి కూడదీసుకుని అనురాగ్ ఠాకూర్, నిర్మలా సీతారామన్‌తో పాటు ఒకరిద్దరు బీజేపీ నేతలు ప్రతిపక్షంపై విరుచుకుపడకపోతే, తొలి సమావేశాల్లో ప్రతిపక్షాలకు తిరుగులేకుండా పోయేది. నీట్ ప్రశ్నపత్రాల లీక్, కుల గణన, కనీస మద్దతు ధర, మణిపూర్‌తో పాటు అనేక అంశాలు ప్రతిపక్షాలకు ఆయుధాలయ్యాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వమే సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించేందుకు ముందుకు రావడం మారిన పరిస్థితులకు నిదర్శనం.

పార్లమెంట్ సమావేశాలు ముగిశాయో లేదో, ఆగస్టు 10న అదానీ స్టాక్ మార్కెట్ వ్యవహారంలో హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన తాజా అంశాలతో ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయాయి. అదానీ గ్రూప్ సంస్థలు తమ షేర్లను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించిన విదేశీ నిధుల్లో సెబి చైర్మన్, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని వచ్చిన ఆరోపణల ఆధారంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ ఆరోపణలపై జేపీసీ ఏర్పాటుకు డిమాండ్ చేసింది. అదే సమయంలో కులజనగణన, రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మరో మూడు నెలల్లో జరగనున్న హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు కమలనాథులను చీకాకు పెట్టేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని నిర్ణయించాయి.

కాని మోదీని కూడా తక్కువ అంచనా వేయలేం. ఆగస్టు 15న ఎర్రకోట ప్రసంగంతో ఎదురుదాడి చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రసంగంలో ఆయన రెండు కీలకాంశాలను ప్రకటించారు. అవినీతిపై తాను ప్రకటించిన యుద్ధాన్ని తీవ్రతరం చేస్తానని మోదీ చేసిన వ్యాఖ్యలు గత అయిదేళ్లుగా అనేకమంది ప్రతిపక్ష నేతలపై జరుగుతున్న ఏజెన్సీల చర్యలు ఆగిపోవన్న విషయం ధ్రువీకరిస్తున్నాయి. ఇక ఇంతకాలం కొనసాగిన మతతత్వ పౌర స్మృతి బదులు లౌకిక పౌర స్మృతి దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉన్నదని మోదీ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ప్రతిపక్షాల కులజనగణన డిమాండ్‌ను అడ్డుకునేందుకు మోదీ ఈ ఆయుధాన్ని బయటకు తీసినట్లు కనబడుతోంది.

అవినీతిని ఎంత మాత్రమూ సహించేది లేదని మోదీ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన మరునాడే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై మైసూరు భూమి కుంభకోణానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ అవినీతి నిరోధక చట్టంలో బహుళ ప్రాచుర్యం పొందిన సెక్షన్ 17ఏ కింద అనుమతిని మంజూరు చేశారు. మైసూరులో సిద్ధరామయ్య సతీమణి పార్వతి ఆమె పేరున లేని భూమిని ప్రభుత్వానికి ఇచ్చినందుకు బదులుగా 14 స్థలాలు అక్రమంగా పొందారని ఆరోపణలు రాగా, ఈ నిర్ణయం తనది కాదని, బీజేపీ హయాంలోనే ఈ స్థలాలను కేటాయించారని సిద్ధరామయ్య వాదిస్తున్నారు. సిద్ధరామయ్య నిర్ణయం తీసుకోనప్పుడు ఆయనపై 17ఏ క్రింద ఎలా చర్య తీసుకుంటారన్న చర్చ జరుగుతున్నప్పటికీ కర్ణాటక గవర్నర్ నిర్ణయం దేశ వ్యాప్తంగా బీజేపీయేతర ముఖ్యమంత్రులను ఉలిక్కిపడేలా చేసిందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అప్రమత్తంగా ఉండేలా మోదీ చేయగలిగారనడంలో సందేహం లేదు. ఇప్పటికే జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు గవర్నర్లు ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంఘర్షణాయుత వైఖరిని అవలంబిస్తున్నారు. మోదీ ఎక్కడి నుంచైనా ఎదురుదాడి చేయగలరని సిద్ధరామయ్య వ్యవహారంతో ప్రతిపక్షాలకు అర్థమైంది. ఇదే సమయంలో కోల్‌కతాలో హత్యాచారానికి బలైన ఒక యువ డాక్టర్ విషాద ఉదంతాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ సహజంగానే విస్తృత యత్నాలు చేస్తోంది.

రాజకీయాల్లో అదును చూసుకుని ఎదురు దాడులు చేయడం మాత్రమే కాదు, అవసరమైనప్పుడు వెనక్కు తగ్గడం కూడా అవసరం. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మధ్య స్థాయి పోస్టుల్లో సివిల్ సర్వీసు అధికారులను కాకుండా బయటి నుంచి వ్యక్తులను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన విడుదల చేసిన మూడు రోజుల్లోనే మోదీ సర్కార్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. దాదాపు 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన చేసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీజేపీ మిత్రపక్షాలు కూడా విరుచుకుపడడం ఇందుకు కారణం. ఈ నిర్ణయం రాజ్యాంగం కల్పించిన దళితులు, ఓబీసీలు, ఆదివాసీల రిజర్వేషన్లకు వ్యతిరేకమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. బయటి వ్యక్తులను నియమించడం యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువకుల హక్కులను దోపిడీ చేయడమేనని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లభించకుండా చేసేందుకే ఈ నియామకాలు చేస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. ఎన్డీఏ మిత్రపక్షాలు జనతాదళ్ (యు), లోక్ జనశక్తి (రాంవిలాస్) కూడా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొమ్మని కోరాయి. దీనితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయానికి అనుగుణంగా నియామకాలు జరగాలని అభిలషిస్తున్నందువల్ల బయటినుంచి వ్యక్తుల నియామకానికి సంబంధించి ప్రకటన వెనక్కు తీసుకోవాలని కేంద్రమంత్రి జితేందర్ సింగ్ యుపిఎస్‌సి చైర్మన్‌కు లేఖ రాశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ బిల్లు, సాగు చట్టాలు, డేటా సంరక్షణ బిల్లు, బ్రాడ్ కాస్ట్ బిల్లుతో పాటు పలు నిర్ణయాలను వెనక్కు తీసుకోవల్సి వచ్చింది. బయటి వ్యక్తులను నియమించాలన్న విషయాన్ని కాంగ్రెస్ హయాంలో కూడా పరిశీలించారని, మోదీ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ రాహుల్‌ను విమర్శించిన రెండు రోజులకే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం గమనార్హం. త్వరలో ఎన్నికలు జరుగనున్న హర్యానాలో తమ విజయానికి ఓబీసీలు, దళితులపై పూర్తిగా ఆధారపడుతున్న బీజేపీ రాహుల్ విమర్శతో వెంటనే వెనక్కు తగ్గాల్సి వచ్చిందనడంలో సందేహం లేదు.

దేశంలో మాత్రమే కాదు, మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా సవాళ్లు ఎదుర్కోవల్సి వస్తున్నది. బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు తర్వాత ఆ దేశ ప్రధానమంత్రి హసీనాకు ఆశ్రయం కల్పించడం భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమించింది. ఆమెను ఏ దేశానికి పంపించాలో తెలియక మనం సతమతమవుతుండగా యుద్ధ నేరాల క్రింద ఆమెను విచారించేందుకు బంగ్లా తిరిగి పంపాలని ఆ దేశం నుంచి డిమాండ్ వస్తోంది. ఇక అమెరికాలో అత్యంత కీలకమైన నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న సమయంలోనే మోదీ రష్యాలో రెండు రోజులు పర్యటించి పుతిన్‌ను కౌగలించుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రధానాంశంగా నాటో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో మోదీ తన రష్యా పర్యటనను వాయిదా వేసుకోవాలని అమెరికా కోరినప్పటికీ ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. యుద్ధ సమయంలో వ్యూహాత్మక స్వతంత్రత అన్న మాటకు అర్థం లేదని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ స్పష్టంగా ప్రకటించారు. భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను తాము గౌరవిస్తామని, కాని సంక్షోభ సమయాల్లో భారత అమెరికాలు కలిసికట్టుగా, విశ్వాసపాత్రమైన స్నేహితులుగా వ్యవహరించాలని తెలుసుకోవాలని ఆయన ఒక రక్షణ సదస్సులో చెప్పారు. తమతో సంబంధ బాంధవ్యాలను అలుసుగా తీసుకోవద్దని ఆయన హెచ్చరించారు. రష్యా చైనాకు జూనియర్ భాగస్వామిగా మారుతోందని, ఆ దేశాన్ని విశ్వసనీయ భాగస్వామిగా తీసుకోవడం మంచిది కాదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సల్లివాన్ కూడా స్పష్టం చేశారు. మోదీ పుతిన్‌ను గాఢంగా కౌగలించుకున్న దృశ్యాలు విడుదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటన శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగించిందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తప్పనిసరై ఉక్రెయిన్‌తో పాటు రష్యాను బద్ధశత్రువుగా భావిస్తున్న పోలండ్‌కు కూడా వెళ్లి నాటో దేశాలను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. "మీరెవరో, మీ శత్రువెవరో తెలిస్తే వంద యుద్ధాలు జరిగినా భయపడనక్కర్లేదు. మీ గురించి మాత్రమే తెలిసి మీ శత్రువు గురించి తెలియకపోతే, గెలుపుతో పాటు ఓటమికి కూడా సిద్ధంగా ఉండాలి. మీ గురించి కానీ, మీ శత్రువు గురించి కానీ ఏమీ తెలియకపోతే ప్రతి యుద్ధంలోనూ ఓడిపోవాల్సిందే" అని చైనా సైనిక వ్యూహకర్త సున్ సు 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో రాశారు. 13 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా, 10 సంవత్సరాలకు పైగా ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్రమోదీకి ఈ విషయం బాగా తెలిసే ఉండవచ్చు.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)



ఆగస్టు 15న ఎర్రకోట నుంచి వెలువరించిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంతో ప్రతిపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎదురుదాడి ప్రారంభించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ఇండియా కూటమి దూకుడుకు వివిధ అంశాలపై వెనక్కి తగ్గినా అవినీతిపై యుద్ధాన్ని తీవ్రతరం చేస్తానని ప్రకటించడం ద్వారా బీజేపీయేతర ముఖ్యమంత్రులు ఉలిక్కిపడేలా చేశారు. విపక్షాల కులగణన డిమాండ్‌ను అడ్డుకునేందుకు లౌకిక పౌరస్మృతి అనే ఆయుధాన్ని మోదీ ప్రయోగించారు.

ఆఖరి మనిషి ఆవేదనే వర్గీకరణకు పునాది కావాలి!

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై చివరికి ఏడుగురి న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్ట్ ధర్మాసనం ఆగష్టు 1, 2024న తీర్పును వెలువరిస్తూ, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల నిర్వహణను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వవచ్చని అభిప్రాయపడింది. ఎంఆర్‌పిఎస్ నాయకుడైన కృష్ణ మాదిగ నూతన కోర్టు తీర్పుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్ల అమలులో గతంలోని ఏబీసీడీల వర్గీకరణ పద్ధతిలోనే విధివిధానాలను రూపొందించాలని కోరుతున్నారు. అంతేకాకుండా మళ్ళీ కొత్తగా ఎస్సీల జనాభా లెక్కలు చేపట్టవలసిన అవసరం లేదంటున్నారు. వారికి అందుబాటులోవున్న ఆధారాలు ఏమిటోగాని మాదిగలకు తెలంగాణాలో 11శాతం, ఆంధ్రాలో 7శాతం రిజర్వేషన్ల అవకాశాలు వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో సూత్రబద్ధంగా వర్గీకరణను స్వాగతించే మాలల నుంచి కొన్ని వాదనలు ఇలా ఉన్నాయి.

1) మాదిగల నాయకత్వ ఫిర్యాదు ప్రకారం గడిచిన కాలంలో మాలలే ఎస్సీ రిజర్వేషన్లను అనుభవించడంలో మొదటి స్థానంలో ఉన్నప్పుడు గత వర్గీకరణ నమూనా ప్రకారం వారు ఏబీసీడీ గ్రూప్‌లో చివరి స్థానంలో ఉండాలి. అలాకాకుండా వారిని 'సీ' గ్రూపుగా ఎందుకు చేర్చారు? 2) రెండు తెలుగు రాష్ట్రాలలో మొత్తంగా 59 ఎస్సీ కులాలు సమాన నిష్పత్తిలో లేనప్పుడు ఏబీసీడీల విభజన శాస్త్రీయమైనదేనా? 3) ఎస్సీ రిజర్వేషన్ల సమస్య కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకో లేదా దక్షిణ భారతదేశానికో పరిమితమైనది కాదు. మొత్తం దేశంలోని దళితులకు సంబంధించిన అంశం. కాబట్టి దేశంలోని అన్ని ఎస్సీ కులాలను సంతృప్తి పరిచే హేతుబద్ధతతో కూడిన న్యాయమైన విభజన మార్గాలను మేధావులు, ప్రభుత్వాలు అన్వేషించాలి. 4) మొత్తంగా రాష్ట్ర విభజన దృష్ట్యా ఎస్సీలలోని వివిధ కులాల వాస్తవ జనాభా శాతం ఎంతో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు శాస్త్రీయంగా తేల్చాలి. అలా చేయకుండా ప్రాథమిక అంచనాలతో తాత్కాలిక నిర్ణయాలు చేయరాదు. 5) ప్రత్యేకించి రాష్ట్ర విభజన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కల్పించిన విద్య ఉద్యోగ అవకాశాలలో, సంక్షేమ పథకాల లబ్ధిదారులలో ఏ కులంవారు ఎంత ప్రయోజనం పొందారో లెక్కలు తేల్చి విభజన చేయాలనీ కోరుతున్నారు.

అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణాలో ఎస్సీలు 52,17,684గా వున్నారు. అందులో రెల్లి గ్రూప్ కేవలం 13,452 (0.25శాతం), మాదిగ గ్రూప్ 34,06,708 (65.29 శాతం)గా ఉన్నారు. మాల గ్రూప్ 17,90,553 (34.31 శాతం)గా ఉన్నారు. ఆదిఆంధ్ర గ్రూప్ 6,716 (0.12శాతం)గా ఉన్నారు. నేటి ఆంధ్ర ప్రదేశ్‌లో మొత్తంగా ఎస్సీ జనాభా 82,82,243 ఉండగా, రెల్లి గ్రూప్ 1,90,749 (2.30 శాతం) ఉండగా, మాదిగ గ్రూప్ 35,20,165 (42.50శాతం)గా ఉన్నారు. మాల గ్రూప్ 43,64,277 (52.69శాతం)గా ఉండగా, ఆదిఆంధ్ర గ్రూప్ 2,05,394 (2.47శాతం)గా ఉన్నారు. అంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 15శాతం ఎస్సీ రేజర్వేషన్లను తెలంగాణాలో రెల్లి సమూహానికి 0.03, మాదిగలకు 9.79, మాలలకు 5.14, ఆది ఆంధ్రులకు 0.12 శాతాలుగా పంపిణీ చేయవచ్చు. అదే ఆంధ్రప్రదేశ్‌లోనైతే రెల్లి సమూహానికి 0.34, మాదిగలకు 6.37, మాలలకు 7.90, ఆదిఆంధ్రులకు 0.37 శాతంగా అవకాశాలు కల్పించవచ్చు. లెక్కలు ఇలా ఉంటే మాదిగ నాయకత్వం మాత్రం దానికి భిన్నంగా మాట్లాడుతున్నది.

ఈ వాదనలు ఇలా ఉంటే మాల, మాదిగ అనుబంధ కులాలుగా పిలువబడుతున్న (న్యాయంగానైతే ప్రతి కులం దానికి అదే ఆత్మగౌరవ అస్తిత్వసమూహమే) హోలియ దాసరి, నేతకాని మాల, మాల పంబాల, మాల జంగం, మహర్లు, గుర్రం మాల, మాల బేకరీ, మాల మస్టీలు, బైండ్ల, బేడబుడగ జంగం, డక్కలి, మోచి, చిందు వారు ఎస్సీల అభివృద్ధి, వర్గీకరణ విషయాలపై మరింత సూక్ష్మమైన సామాజిక న్యాయ సూత్రీకరణలు వినిపిస్తున్నారు.

స్వతంత్ర భారతంలో ఇప్పటికీ చాలా అనుబంధ కులాలలో ఒక్క ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారిగా ఎదిగిన దాఖలాలు లేవు. కేవలం ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయి సహాయకులుగా ఎదిగారు. తమ కుల ధ్రువీకరణ పత్రాలు పొందటానికి యువత ఆర్డీఓల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వాలు వారికి కుల ధ్రువీకరణ పత్రాలను స్థానిక ఎమ్మార్వోల ద్వారానే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. డక్కలి, చిందు, బుడగజంగాలు, గుర్రం మాల, మాల మస్టీలలో ఇప్పటికీ అక్షర జ్ఞానమే అతికష్టమైన ప్రక్రియ అయినప్పుడు ప్రభుత్వం ఉద్యోగాల్లో వారి వాటాల గురించి ఆలోచించడంలో అర్థమే లేదంటున్నారు. కొన్ని తరాలుగా వారు చేసిన వెట్టి చాకిరికి ప్రతిఫలంగా పొందిన చిన్నపాటి కుల మాన్యపు భూములను సైతం ప్రభుత్వాలే ఆక్రమిస్తున్నాయని వాపోతున్నారు. నిజానికి వర్గీకరణకు ముందు, ఆ తరువాత కూడా కొద్దిపాటి తేడాలతో మాల, మాదిగలే ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను పొందుతూ సమాజంలో ప్రభావ శక్తులుగా పని చేస్తున్నారు. అంతేకానీ అంతర్గతంగా దళిత సమూహాలలో ఉన్న కుల హెచ్చుతగ్గులను నిర్మూలించే ప్రజాస్వామిక సంస్కృతిని ఏర్పాటు చేయలేకపోయారు.

సామ్రాజ్యవాద, అగ్రకుల ఆర్థికదృక్కోణాల వలన దళిత అనుబంధ కులాల జీవనాధార వృత్తులు పూర్తిగా ధ్వంసం చేయబడ్డాయి. ఫలితంగా వారు అసంఘటిత కార్మికులుగా, వలసజీవులుగా మారుతున్న తరుణంలో కూడా మాల, మాదిగలు వారిని పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. వర్గీకరణ వాదం కన్నా ముందు ఏర్పడిన ఉమ్మడి దళితవాదం, వర్గీకరణ భావనానంతరం ఏర్పడిన మాల, మాదిగ అస్తిత్వ వాదాల సర్వజనీయత (Universality) సమూహాల ప్రాధాన్యతలు క్రమంగా క్షీణిస్తూ, చైతన్యం పొందుతున్న ప్రతి దళిత జాతి విడిగా తన అస్తిత్వాన్ని (Particularity) నిర్మించే పనిలో ఉండాలని భావిస్తున్నాయి. కొంత కటువుగా ఉన్నప్పటికీ మాల మాదిగలకు అనుబంధంగా చూపబడుతున్న దళిత కులాలు ఎంఆర్‌పీఎస్ ప్రతిపాదిస్తున్న ఏబీసీడీల గ్రూపులవారీ వర్గీకరణకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. దానికి బదులుగా అల్పసంఖ్యాక దళిత కులాలను మాల, మాదిగేతర ప్రత్యేక గ్రూపులుగా జనాభా లెక్కల ఆధారంగా గుర్తించి, రిజర్వేషన్లను పంపిణీ చేయాలని ప్రతిపాదిస్తున్నారు. అప్పుడు మాత్రమే తమకు తాము ఆశిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరుతుందని బలంగా నమ్ముతున్నారు.

దళిత అనుబంధ కులాల ప్రతిపాదనలు 21వ శతాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్తంగా ముందుకొస్తున్న బహుళ సంస్కృతుల వాదానికి, మరీ ముఖ్యంగా అల్ప సంఖ్యాక ప్రజారాశుల హక్కుల సిద్ధాంతకర్త అయిన విల్ కిమ్లికా ఆలోచనలకు దగ్గరగా ఉన్నాయని చెప్పవచ్చు. కిమ్లికా కెనడా దేశ తత్వవేత్త. ఈయన తన రచనల్లో మైనార్టీ సమూహాలు, మెజార్టీ సమూహాలతో హక్కుల కోసం తలబడుతున్నప్పుడు రాజ్యం వారికి ఎక్స్‌టర్నల్ ప్రొటెక్షన్ రైట్స్‌ను అనగా బాహ్య రక్షణ హక్కులను కల్పించాలన్నారు. అలాగే మైనార్టీ వర్గంలో సైతం చారిత్రకంగా నిక్షిప్తమైన అన్ని రకాల అంతర్గత వివక్షతలను నిర్మూలించడం కోసం ఇంటర్నల్ రిస్ట్రిక్షన్ రైట్స్ అనగా అంతర్గత పరిమిత హక్కుల భావనను అనుసరించాలని విశదీకరించాడు. అంటే ప్రతి బాధిత సమూహంలో అత్యంత వెనుకబడిన జాతికి సాధించిన అవకాశాల్లో మొదటగా స్థానం కల్పించాలని దానర్థం. అలాకాకుండా ఒక నిర్దిష్ట సమూహంలో అర్హులు లేనప్పుడు వెంటనే ఆ సమూహం యొక్క రిజర్వేషన్ల అవకాశాన్ని ఇతర సమూహానికి బదలాయించకూడదు. తద్వారా మాత్రమే పీడిత సమూహాలలో ఒక సంపూర్ణ సామాజిక న్యాయాన్నీ నెలకొల్పవచ్చని సిద్ధాంతీకరించాడు.

అందువలన కేవలం రాజ్యాంగపరమైన సాంకేతిక సంక్లిష్టతను ఆధారం చేసుకుని అవకాశాలు అందరికి అందాలనే వర్గీకరణ సూత్రాన్ని మొండిగా వ్యతిరేకించే మాల కుల సంఘాలు ఇప్పటికైనా మరింత ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆలోచించాలి. సూత్రబద్ధంగానైనా దళిత రిజర్వేషన్ల ప్రజాస్వామ్యబద్ధ పంపిణీనీ అంగీకరించాలి. అందుకు మాల బుద్ధిజీవులు, రాజకీయవేత్తలు నిజాయితీగా కృషి చేయాలి. అలాగే మాదిగ బుద్ధిజీవులు, రాజకీయ నాయకులు కూడా దళితుల్లోని అణగారిన కులాలు ప్రతిపాదిస్తున్న మరింత మెరుగైన రిజర్వేషన్ల వర్గీకరణ నమూనాలను సమధర్మ బుద్ధితో పరిగణలోకి తీసుకోవాలి. అంతేకానీ ఏబీసీడీల వాదాన్ని మరింతగా సంస్కరిస్తే గత మూడు దశాబ్దాలుగా నిర్మించిన మాదిగ దండోర ఉద్యమానికే పెను ప్రమాదమని భావించవలసిన అవసరం లేదు. అప్పుడే తిరిగి ఉమ్మడి సమస్యలైన దళితులకు ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు, భూ పంపిణీలో సమన్యాయ వాటా, సంపూర్ణ సామాజిక స్వేచ్ఛ, రాజ్యాధికారంలో నిజమైన భాగస్వామ్యం కోసం ఐక్య పోరాటాలు నిర్మించగలుగుతారు. లేదంటే ఎల్లకాలం పాలక వర్గాల రాజకీయ కుట్రల్లో విభజించబడి పాలించబడతారు.

మాల మాదిగలకు అనుబంధంగా చూపబడుతున్న దళిత కులాలు ఎంఆర్‌పీఎస్ ప్రతిపాదిస్తున్న ఏబీసీడీల గ్రూపులవారీ వర్గీకరణకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. దానికి బదులుగా అల్పసంఖ్యాక దళిత కులాలను మాల, మాదిగేతర ప్రత్యేక గ్రూపులుగా జనాభా లెక్కల ఆధారంగా గుర్తించి, రిజర్వేషన్లను పంపిణీ చేయాలని ప్రతిపాదిస్తున్నారు. అప్పుడు మాత్రమే తమకు తాము ఆశిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరుతుందని బలంగా నమ్ముతున్నారు.



• డా. నాగం కుమారస్వామి
పాలమూరు విశ్వవిద్యాలయం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 కనిష్ఠం 22.5

చిత్రపురి కాలనీలో
విల్లా కూల్చివేత

- అక్రమంగా ఏడు ఇళ్ల నిర్మాణం
- తొలి నుంచి వివాదాస్పదమే



విల్లాను కూల్చివేస్తున్న దృశ్యం

నార్సింగ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన విల్లాల కూల్చివేత ప్రారంభమైంది. మంగళవారం ఒక విల్లాను పాక్షికంగా కూల్చారు. 220 విల్లాల నిర్మాణానికి అనుమతి పొందిన చిత్రపురి హౌసింగ్ సొసైటీ.. ఏడింటిని అదనంగా నిర్మించినట్లు పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై గతంలో కోర్టు కేసు కూడా నడిచింది. అయితే కూల్చివేతల

మిగతా 8వ పేజీలో..

వాటర్‌బోర్డు ఈడీగా
మయాంక్ మిట్టల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. నారాయణపేట అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం వాటర్‌బోర్డుకు బదిలీ చేసింది. 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈడీగా ఐఏఎస్ నియామకం జరిగింది. అలాగే హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాత్సవ నియామకమయ్యారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా కొనసాగుతున్న ఆయన్ను హెచ్ఎండీఏకు బదిలీ చేశారు. ఇప్పటివరకు జాయింట్ కమిషనర్‌గా కొనసాగిన ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి హెచ్ఎండీఏ అడ్మినిస్ట్రేషన్ నిర్వహణ, ఇతర బాధ్యతలు జాయింట్ కమిషనర్ పర్యవేక్షించనున్నారు.



గాజులరామారం ఒక్షిత ఎన్‌క్లేవ్‌లో వరద తీవ్రతకు రోడ్డు ధ్వంసమై జలపాతాన్ని మరిపిస్తున్న దృశ్యం

హోరువాన.. ఈదురుగాలులు.. ఉరుములు, మెరుపులు.. పిడుగుపాటు శబ్దాలు.. మంగళవారం తెల్లవారుజామున మహానగరంలో పరిస్థితి ఇది. తెల్లారేసరికి జనజీవనం అస్తవ్యస్తమైంది. బస్తీలు, కాలనీల్లోకి వరద, మురుగునీరు చేరింది. కొన్నిచోట్ల ఇళ్లల్లోని గదుల్లో వర్షం నీరు నిలిచింది. వరదనీరు రోడ్లను ముంచేయడంతో వాహనాలు ముందుకు కదలలేదు. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో భారీవృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చీకట్లు కమ్ముకున్నాయి.



వర్ష బీభత్సం

భారీవానకు నగరం ఆగమాగం

12.5 సెంటి మీటర్లు సీజన్‌లో రికార్డుస్థాయి వర్షపాతం (యూసుఫ్‌గూడలో)

- ఉదయం 4 నుంచి 6 గంటల సమయంలో కుంభవృష్టి
- లోతట్టు ప్రాంతాలను ముంచేసిన వరద
- ఇళ్లలోకి చేరిన నీరు
- కొట్టుకుపోయిన కార్లు, ద్విచక్ర వాహనాలు
- ఈదురుగాలులకు విరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- మరో రెండురోజులు ఎల్లో అలర్ట్

హైదరాబాద్ సిటీ న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సీజన్‌లో గ్రేటర్‌లో మంగళవారం అత్యధిక స్థాయి వర్షపాతం నమోదైంది. ఉదయం 7 గంటల వరకు యూసుఫ్‌గూడలో అత్యధికంగా 12.5, ఉప్పల్‌లో 12.1, రాజేంద్రనగర్‌లో 11.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా 20కి పైగా ప్రాంతాల్లో 24 గంటల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రేటర్‌కు వాతావరణశాఖ మరో రెండురోజుల పాటు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి) ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడించారు.

వాన తెచ్చిన తంటాలు

- లష్కర్‌లోని కాలనీలు, బస్తీల్లో మోకాలి లోతు వర్షపునీరు నిలిచింది. సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్, బ్రాహ్మణబస్తీ, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, శ్రీనివాసనగర్, బ్రాహ్మణబస్తీ, బౌద్ధనగర్ డివిజన్లో న్యూ అశోక్‌నగర్, పార్శిగుట్ట సంజీవపురం, అంబానగర్, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచింది.
- మహ్మద్‌గూడ నాలా వద్ద మ్యాన్‌హోల్స్ పొంగి మురికి నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- బొల్లారంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో ఉన్న నాలా పొంగి స్థానికంగా ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరుకుంది. డౌటన్ బజార్‌లోని ఓ ఇంట్లోకి భారీగా మురికి నీరు చేరడంతో కుటుంబసభ్యులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.
- కుత్బుల్లాపూర్‌లో వాజ్‌పేయి నగర్, వెంకన్నహిల్స్, ఒక్షిత ఎన్‌క్లేవ్, శ్రీనివాస్‌నగర్, ఎంఎన్‌రెడ్డినగర్, బ్యాంక్ కాలనీ, ఫస్ట్ ఎవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల రహదారులన్నీ జలమయమయ్యాయి.
- ఉరుములు, మెరుపుల భారీ శబ్దాలకు నిజాంపేట్ కార్పొరేషన్ మధురానగర్‌కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.
- మలక్‌పేట మార్కెట్ ఎదురుగా ఉన్న న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ రోడ్డు, అక్షయ్ హోటల్ పక్క

మిగతా 8వ పేజీలో..



ఇంట్లోకి చేరిన నీటిని తోడుకుంటున్న కుటుంబసభ్యులు



వృద్ధురాలి గదిలో చేరిన వరద నీరు



ప్రభుత్వ పుస్తక ముద్రణాలయం ఆవరణలో..



పంజాగుట్ట రోడ్డుపై సాయంత్రం వర్షానికి నిలిచిన వాహనాలు

జీహెచ్ఎంసీ కంట్రోల్ రూం నంబర్ 040 2111 1111

వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ సెంటర్ నంబర్ 155313

బయటకు రావొద్దు

- పౌరులకు కమిషనర్ ఆమ్రపాలి సూచన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్
- జడ్‌సీలతో మేయర్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. పౌరులు క్యాచ్‌పిట్లు, మ్యాన్‌హోల్ మూతలు తెరవవద్దని సూచించారు. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, విజయనగర్ కాలనీ, మాసాబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. అనంతరం జోనల్, డిప్యూటీ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాన రహదారులపై వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టుల పనులు జరుగుతున్న చోట ప్రమాదాలు చోటు చేసుకోకుండా హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు పడిన సమయంలో అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి రావొద్దని, పిల్లలను బయటకు పంపవద్దని సూచించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మేయర్

జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్..

వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వరదతో ఇబ్బందులున్న వారు 040 2111 1111 నంబర్‌కు ఫోన్ చేయాలని బల్దియా ఓ ప్రకటనలో కోరింది. వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను

మిగతా 8వ పేజీలో..



తెరుచుకున్న హుస్సేన్‌సాగర్ గేటు

- ఎఫ్‌టీఎల్ దాటిన నీటిమట్టం

భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్‌లో నీటి మట్టం భారీగా పెరిగింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) దాటడంతో తూము గేటు మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. సాగర్ ఎఫ్‌టీఎల్ 513.41 మీటర్లు కాగా.. రాత్రి 9:20 గంటల వరకు 513.66 మీటర్ల మేర నీరు ఉంది. ఇన్ ఫ్లో 2500 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 2300 క్యూసెక్కులుగా ఉంది. దిగువకు ప్రవాహం పెరగడంతో సర్‌ప్లస్ నాలా పరీవాహక ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్ నీటి మట్టాన్ని డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

స్కూళ్లల్లోకి నీళ్లు

- సెలవు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు
- వర్షంలో తడుచుకుంటూ పాఠశాలలకు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నీటితో నిండాయి. తరగతి గదులు, వరండాల్లోకి నీళ్లు చేరాయి. దీంతో బడులకు వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా స్కూళ్లకు సెలవు ప్రకటిస్తారని తల్లిదండ్రులు ఉదయం 8.30 గంటల వరకు వేచి చూశారు. అయితే స్కూల్ టైం దాటుతున్నప్పటికీ విద్యాశాఖాధికారుల నుంచి ప్రకటన రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో పాఠశాలలకు పంపించారు. వర్షాల హెచ్చరిక నేపథ్యంలో పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలో విద్యాసంస్థలను బంద్ చేసినప్పటికీ.. హైదరాబాద్ జిల్లాలో మూసివేయకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు.



బండ్లగూడలోని ఓ పాఠశాల తరగతిగదిలోకి నీళ్లు



హయత్‌నగర్‌లోని విజయవాడ ప్రధాన రహదారి



నీరు నిలిచిన రోడ్డుపై ఒకరిచేయి ఒకరు పట్టుకుని వెళ్తూ..



అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో రద్దీ

కిటకిటలాడిన మెట్రోరైళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి ఉదయం 6 గంటల నుంచే ప్రధానమార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్‌బీనగర్, మలక్‌పేట , ఎంజే మార్కెట్, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్, పంజాగుట్ట, అమీర్‌పేట, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, మియాపూర్, రాయదుర్గం, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, టోలీచౌకి, మెహిదీపట్నం మార్గాల్లో వాహనాలు బారులుతీరాయి. దీంతో చాలామంది విద్యార్థులు, ఉద్యోగులతోపాటు

మిగతా 8వ పేజీలో..

జాడలేని
మాన్‌సూన్ టీంలు

- మధ్యాహ్నం 12 గంటల వరకూ రోడ్లపైనే వరద నీరు
- కాలనీలు, బస్తీల్లో పరిస్థితి అధ్వానం
- నీటి ముంపులోనే స్థానికులు
- సాయంత్రం మరోసారి దంచి కొట్టిన వాన
- అయినా.. అందుబాటులో లేని అత్యవసర బృందాలు
- క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు
- ప్రజాప్రతినిధులు, నేతలు ఫోన్లు చేస్తే కానీ కానరాని స్పందన
- జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, టీజీఎస్‌పీడీసీఎల్‌లోనూ అధికారులది అదే తీరు



అజంపురా ఆర్‌యూబీలో చెత్త పేరుకుపోవడంతో భారీగా నిలిచిన వరద నీరు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం. మంగళవారు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 6 గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకూ రహదారులపై వరద నీరు నిలిచే ఉంది. కొన్ని బస్తీలు నీటి ముంపులోనే ఉన్నాయి. దీంతో పలు మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచాయి. అయినా ఎక్కడా మాన్‌సూన్ టీంల జాడ కనిపించలేదు.

సాధారణంగా వర్షం తగ్గిన ఒకటి, రెండు గంటల్లో వరద నీరు వెళ్లిపోతుంది. కానీ మంగళవారం మాత్రం మెజార్టీ ప్రాంతాల్లో ఆ పరిస్థితి కనిపించలేదు. క్షేత్రస్థాయిలో జీహెచ్ఎంసీ, ఇతర విభాగాల మాన్‌సూన్ బృందాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడమే కారణం. క్యాచ్‌పిట్ల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం తీసే వారు లేకపోవడంతో గంటల తరబడి రోడ్లపై నీరు నిలిచింది. అజంపురా ఆర్‌యూబీ, అండర్‌పాస్‌లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో భారీగా వరద నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. బండ్లగూడలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో కూడా వరద నీటిని తొలగించలేదు. వర్షపు నీటితో పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కమిషనర్,

మిగతా 6వ పేజీలో..



కారు టైరుకు తగిలి ఆగిన విజయ్‌కుమార్ మృతదేహం

వరదనీటిలో కొట్టుకుపోయి మృతి

ముషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరదనీటిలో కొట్టుకుపోయి ముషీరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. పార్శిగుట్ట ప్రేయర్‌పవర్ చర్చి సమీపంలో ఆనంద్‌రావు కుమారుడు విజయ్ కుమార్ (43) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అతడి ఇల్లు నిర్మాణంలో ఉంది. దీంతో రాత్రుళ్లు ఇంటి ముందు ఉన్న మెట్లపై పడుకుంటాడు. ఆరోగ్యం సరిగా లేక నడవడానికి సైతం ఇబ్బంది పడేవాడు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరదనీటి ప్రవాహం పెరిగి విజయ్ కుమార్ పక్క వీధి వరకు కొట్టుకుపోయి మృతి చెందాడు. పార్కు చేసి ఉన్న కారు టైర్‌కు

మిగతా 8వ పేజీలో..

'బ్యాంక్ స్కామ్‌లో మీకు లింకుంది'

- వీడియో కాల్‌లో బెదిరింపు

8



27నుంచి హైదరాబాద్-కటక్ మార్గంలో ఎనిమిది ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-కటక్ మార్గంలో ఎనిమిది ప్రత్యేకరైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈనెల 27నుంచి సెప్టెంబర్ 17వరకు ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి కటక్‌కు, 28నుంచి సెప్టెంబర్ 18వరకు ప్రతి బుధవారం కటక్ నుంచి హైదరాబాద్‌కు ఈ ప్రత్యేకరైళ్లు నడుస్తాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. మార్గమధ్యంలో సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, బర్హంపూర్, కుర్ధా, భువనేశ్వర్ స్టేషన్లలో ఈ రైళ్లకు హాల్ట్ ఉంటుందని పేర్కొన్నారు.

పలురైళ్ల రద్దు.. కొన్ని దారి మళ్లింపు

హైదరాబాద్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్‌లలో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సెప్టెంబర్ 1నుంచి 30వ తేదీ వరకు సికింద్రాబాద్-వరంగల్ ఎంఈఎంయూ(07462) రైలు, వరంగల్-హైదరాబాద్ ఎంఈఎంయూ రైలు (07463), కాజీపేట -బల్లార్షా (17035), సెప్టెంబర్ 2నుంచి అక్టోబర్ 1వరకు బల్లార్షా-కాజీపేట (17036), సెప్టెంబర్ 1నుంచి 30వరకు సిర్పూర్‌టౌన్-కరీంనగర్ ఎంఈఎంయూ (07766), కరీంనగర్-బోధన్ ఎంఈఎంయూ(07894), నవంబర్ 2నుంచి అక్టోబర్ 1వరకు బోధన్-కరీంనగర్ ఎంఈఎంయూ (07893), కరీంనగర్-సిర్పూర్ టౌన్ (07765), నవంబర్1నుంచి 30వరకు కాచిగూడ-నడికుడి(07791), నడికుడి-కాచిగూడ (07792) రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్1నుంచి 30వరకు హెచ్.ఎస్.నాందేడ్-రాయిచూర్(17664) రైలును తాండూర్-రాయచూర్‌ల మధ్య, సెప్టెంబర్2 నుంచి అక్టోబర్ 1వరకు రాయిచూర్-పర్బని (17663) రైలును రాయిచూర్-తాండూర్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

23న కోకాపేటకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

నార్సింగ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 23న కోకాపేటకు రానున్నారు. కోకాపేట హరేరామ హరేకృష్ణ స్థలం ప్రాంగణంలో 430 అడుగుల ఎత్తుతో శ్రీకృష్ణ ఆలయం(హరేకృష్ణ హెరిటేజ్ టవర్) నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా అనంతశేషస్థాపన పూజా కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు తదితర కార్యక్రమాలు ఉంటాయని హరేరామ హరేకృష్ణ సంస్థ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మించబోయే నిర్మాణాలను ట్రస్ట్ విడుదల చేసింది.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు
24న వాక్ ఇన్ కౌన్సెలింగ్

రాజేంద్రనగర్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ సెంటర్ ఆవరణలో ఈనెల 24న ఉదయం 10:30 గంటలకు వ్యవసాయ డిప్లొమా కోర్సులలో మిగిలిన సీట్లకు వాక్ ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ 2024లో ర్యాంకులు పొందిన వారికి మొదటి ప్రాధాన్యం, 10వతరగతి పాస్ అయిన వారికి రెండో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఫీజుతో నేరుగా వాక్ ఇన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ పాలిటెక్నిక్‌లకు రూ.19,460లు, ప్రైవేటు పాలిటెక్నిక్‌లు అయితే రూ. 22,210లు ఫీజుగా తీసుకుని రావాలని సూచించారు.

25న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎల్బీ స్టేడియంలో ఈనెల 25న రాష్ట్రస్థాయి చెస్‌పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వెల్లడించారు. అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 1-1-2009 తర్వాత పుట్టిన వారే అర్హులు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 7337578899 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సెప్టెంబర్ 10న డాక్ అదాలత్

హైదరాబాద్,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న డాక్ అదాలత్‌ను నిర్వహిస్తోంది. సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆగస్టు 31లోగా పంపుకోవాలని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అధికారులు సూచించారు. తెలంగాణ రాష్ట్ర పరిధి తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలపై పరిష్కారం కోరుతూ రాతపూర్వకంగా పోస్టల్ సర్వీసెస్ సహాయ సంచాలకులు లక్ష్మీమాధవికి గడువులోగా పంపాలని తెలిపారు. ఫిర్యాదుదారులు తమ మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ తెలియజేయాలని కోరారు.

జాడలేని మాన్‌సూన్ టీంలు

(5వ పేజీ తరువాయి)

ఒకరిద్దరు జోనల్ కమిషనర్లు మినహా అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించ లేదు.

కాగితాల్లోనేనా..?

గ్రేటర్‌లో వరద నివారణకు జీహెచ్‌ఎంసీ 242 స్టాటిక్, 157 మొబైల్ టీంలను ఏర్పాటు చేసింది. సీఆర్‌ఎంపీ రహదారులపై 29, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్‌ఎఫ్) బృందాలు 30 ఉన్నాయి. వీటితోపాటు వాటర్‌బోర్డు 25.. టీజీఎస్‌పీడీసీఎల్ 41 బృందాలను రంగంలోకి దించింది. ఈ బృందాల్లో సగం టీంలు కూడా భారీ వర్షం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కనిపించలేదు. వాటర్‌బోర్డు, టీజీఎస్‌పీడీసీఎల్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. విద్యుత్ శాఖకు సంబంధించి ఎన్ని బృందాలు ఉన్నాయి..? ఒక్కో టీంలో ఎంత మంది పని చేస్తారు..? అన్న వివరాలూ గోప్యంగా ఉంచుతుండడం అనుమానాలకు తావిస్తోంది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, స్థానిక నేతలు పలుమార్లు ఫోన్ చేస్తే కానీ మాన్‌సూన్ బృందాలు రాకపోవడం గమనార్హం. ముషీరాబాద్, అంబర్‌పేట, ఉప్పల్, ఎల్‌బీనగర్, మలక్‌పేట ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు వరద నీటి తొలగింపునకు అధికారుల వెంట పడాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో క్యాచ్‌పిట్లు, మ్యాన్‌హోల్ మూతలు స్థానికులు తెరిచి వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

సాయంత్రమూ అదే దుస్థితి


మంగళవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో మళ్లీ వాన దంచి కొట్టింది. ఆ సమయంలోనూ రోడ్లపై మాన్‌సూన్ బృందాలు కనిపించిన దాఖలాలు లేవు. లక్డీకాపూల్, ఖైరతాబాద్, మసాబ్‌ట్యాంక్, పబ్లిక్ గార్డెన్, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వర్షపు నీరు నిలిచింది. చింతల్‌కుంట రోడ్డులో మోకాలిలోతు నీరు నిలవడంతో పాదచారులు ఆ మార్గంలో వెళ్లేందుకు భయాందోళనకు గురయ్యారు. ద్విచక్ర వాహనదారులూ నీటి నుంచి వెళ్లేందుకు జంకారు. కార్లు, ఆటోలు వరద నీటిలో నిలిచిపోయాయి.

















నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఆగిపోయిన అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు డివిజన్లు, బండ్లగూడ కార్పొరేషన్, నార్సింగ్, మణికొండ, శంషాబాద్ మున్సిపాలిటీలు, శంషాబాద్ మండలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శంషాబాద్ మండలంలో 111 జీవో కారణంగా నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడిందని వివరించారు. గండిపేట మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

గోషామహల్ అభివృద్ధికి చొరవ తీసుకోవాలి

- సీఎంకు దళిత పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు వినతి

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి దళితుల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం సంతోషకరమని తెలంగాణ దళిత పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ఎస్.ధన్‌రాజ్ మాదిగ అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజీ విభాగం సిబ్బంది

దోమల నివారణపై అవగాహన ఉండాలి

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంటమాలజీ అధికారులు సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, శంషీర్‌గంజ్, ఆలియాబాద్ ప్రాంతాల్లో ఎంటమాలజీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే... డ్రై డేగా చేసుకుని ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, జ్వరాలు ప్రబలే అవకాశముందన్నారు. కార్యక్రమంలో అరుణ్, సురేశ్, మధు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

నిందితులను కఠినంగా శిక్షించాలి

నార్సింగ్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతురాలు ఆత్మకు శాంతి చేకూరాలని సీబీఐటీ కాలేజీ విద్యార్థులు మంగళవారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నర్సింహులు మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులపై ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి వేగంగా నిందుతులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్‌లు విజయలక్ష్మీ, గణేశ్వర్‌రావు, సత్యవతి, జగన్నాథరావు, శివాత్మికరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజేంద్రనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన కాటేదాన్‌లోని పహల్ ఫుడ్ పరిశ్రమలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... ఉత్తరప్రదేశ్ మీర్జాపూర్‌కు చెందిని మోసిన్‌ఖాన్ నగరానికి వచ్చి కాటేదాన్ సమీపంలోని టీఎన్జీవోస్ కాలనీలో ఉంటూ పహల్ ఫుడ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం కంపెనీలో పనిచేస్తుండగా హై ఓల్టేజీ రావడంతో కరెంట్ షాక్ తగిలిన మోసిన్‌ఖాన్‌కు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 14 లక్షలు నష్ట పరిహారం ఇప్పించారు. మృతదేహాన్ని స్వగ్రామం మీర్జాపూర్ తీసుకు వెళ్లడానికి అంబులెన్స్‌కు ఖర్చు రూ.70వేలు ఇప్పించారు.

స్కూల్ బస్సు ఢీకొని యువతికి గాయాలు

రాజేంద్రనగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా స్కూల్ బస్ ఢీకొని గాయాలపాలైన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రాంరెడ్డి కుమార్తె హారికారెడ్డి(23) ఫార్మా కోర్సు పూర్తిచేసి, గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది. మంగళవారం ఉదయం 7.40 గంటలకు తండ్రి రాంరెడ్డితో అత్తాపూర్‌లోని 132 పిల్లర్ వద్దకు వచ్చింది. హారికారెడ్డిని పికప్ చేసుకోవాడానికి వాహనం రాగానే రోడ్డు దాటుతుండగా హైదర్‌గూడ వైపు నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హారికారెడ్డికి తీవ్రంగా గాయాలు కాగా, లంగర్‌హౌజ్‌లోని ప్రైవేట్ ఆస్పతిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అత్తాపూర్ పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

మదీన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడు పని మానేయమని ఒత్తిడి చేస్తుండడంతో మనస్తాపానికి గురైన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం రాత్రి బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... మహ్మద్‌నగర్ ఖుబా కాలనీకి చెందిన జరీనా బేగం(22) మెహందీ డిజైనర్. స్థానికంగా ఉంటున్న యువకుడిని ప్రేమిస్తుంది. అతడు యువతిని పనిమానేయమని ఒత్తిడి చేస్తున్నాడు. మనస్థాపానికి గురైన యువతి సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలేఖ్య చెప్పిన దాంట్లో నిజం లేదు

- భార్య, కుమారుడు అంటే నాకు ఎంతో ఇష్టం: ఉదయ్ భాస్కర్

రాజేంద్రనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భార్య, కుమారుడితో కలిసి ఉండకుండా, భార్య తరఫు బంధువులు పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టించి వేధిస్తున్నారని బీట్యూరి ఉదయ్ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం హైదర్‌గూడలోని తన నివాసం లో విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. 2014లో అలేఖ్యతో వివాహం జరుగగా, 2016లో మగపిల్లాడు (కౌశిక్) పుట్టాడు. మూడు రోజుల తర్వాత ఆరోగ్య సమస్యలు రాగా, అప్పటి నుంచి పెద్దాస్పత్రులలో చికిత్స చేయించానని తెలిపారు. రోజూ నైట్ డ్యూటీ చేసి ఉదయాన్నే ఇంటికి వచ్చి కౌశిక్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించానని అన్నారు. భార్య అలేఖ్య పుట్టింటింకి వెళ్తానని అడుగగా వద్దన్నందుకు ఇంట్లో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2018లో అలేఖ్య తనపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా కోర్టులో విచారణలో ఉంది. ఈ నెల 16న అలేఖ్య బంధువులతో కలిసి హైదగూడలోని ఇంటి వద్దకు వచ్చి గేటు, గ్రిల్స్‌ను, కిటికీ అద్దాలను ధ్వంసం చేసి తమ కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించారని వాపోయాడు. కుమారుడు కౌశిక్ అవిటి వాడు అయినందున దూరంగా పెడుతున్నారని గొడవకు దిగింది. అలేఖ్య చెప్పిన దాంట్లో నిజం లేదు. తనకు కుమారుడు కౌశిక్, భార్య అలేఖ్య అంటే ఎంతో ఇష్టమన్నారు. భార్య తరపు బంధువులు వాటని పెద్దవిగా చేసి మా కాపురంలో నిప్పులు పోస్తున్నారని అన్నారు. కొద్ది రోజుల్లో కోర్టులో తీర్పు రానుండగా, ఇలా ప్రవర్తించడం బాధాకరంగా ఉందన్నారు.



అలీనగర్ రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్



బండ్లగూడ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరిన వర్షపు నీరు

భారీ వర్షం...లోతట్టు ప్రాంతాలు జలమయం

- పాలిటెక్నిక్ కాలేజీలోకి చేరిన వర్షపు నీరు
- రహదారులపై మోకాలి లోతు నిలిచిన వరద
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- పలు చోట్ల వాహనాల మళ్లింపు

రాజేంద్రనగర్/మదీన/చార్మినార్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జూపార్కు ఎదురుగా ఉన్న కులీకుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వరదనీటిలో మునిగింది. తరగతి గదుల్లోకి వరద నీరు చేరడంతో విద్యార్థులు మురుగునీటిలోనే నడుచుకుంటూ తరగతులకు హాజరయ్యారు. బహదూర్‌పురా నుంచి కిషన్‌బాగ్ వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు నిలిచింది. దీంతో ఉదయం పనులు, కార్యాలయాలకు వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. ఛత్రినాక, కృష్ణారెడ్డి నగర్, రాజీవ్‌గాంధీనగర్, క్రాంతినగర్, గౌలిపురా హనుమాన్ నగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో స్థానికులు అవస్థలు పడ్డారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుద్వేల్ వర్మకాలనీ పక్క వెంచర్, మైలార్‌దేవుపల్లి డివిజన్ ఎన్‌టీఆర్ నగర్ బస్తీలోని లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు వచ్చి చేరడంతో స్థానికులు బయటకురాలేని పరిస్థితి నెలకొంది. మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి సహాయ చర్యలు చేపట్టారు. మైలార్‌దేవుపల్లి ఉడంగడ్డ సమీపంలోని కల్వర్ట్ నుంచి అలీనగర్ రోడ్డు చెరువును తలపించింది. రోడ్డు మధ్యలో డివైడర్‌లు నిర్మించడంతో నీరు వెళ్లడానికి అవకాశం లేక రోడ్డుపైనే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

చాంద్రాయణగుట్ట బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వరదనీరు నిల్వడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్, కార్పొరేటర్లు అక్కడ చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు. రోడ్డుపై డివైడర్‌లను పగులగొట్టి వరద నీరు అలీనగర్ గుండా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. డబీల్‌పురా దర్వాజ వద్ద కూడ భారీగా నీరు నిలిచాయి. చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, శంషాబాద్, ఆరాంఘర్ వైపునకు వెళ్లే వాహనాలను పిసల్ బండ మీదుగాపోలీసులు మళ్లించారు. దాదాపుగా గంట నుంచి రెండు గంటల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, జీహెచ్ఎంసీ అధికారులు, ఈఈ సనా ఉల్లాహ్, డీఈ భానుప్రసాద్, ఏఈ డేవిడ్, కార్పొరేటర్లు హఫీజ్ పటేల్, వహబ్, బల్దియ సిబ్బంది రోడ్లపై వరద నీరు సాఫీగా పోయేలా చర్యలు తీసుకున్నారు. చంద్రాయాణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జే శ్రీనునాయక్ తన సిబ్బందితో కలిసి శ్రీశైలం వైపు నుంచి నగరానికి వస్తున్న వాహనాలను మిధాని డిపో నుంచి బాలాపూర్ చౌరస్తా వైపు మళ్లించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



బుద్వేల్ వర్మకాలనీ వెంచర్‌లో నిలిచిన వర్షపు నీరు



బండ్లగూడ ఆర్‌టీఏ కార్యాలయం వద్ద డివైడర్‌లను పగులగొడుతున్న ట్రాఫిక్ పోలీసులు



మిధాని డిపో వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న పోలీసులు



ఎన్‌టీఆర్‌నగర్‌లో ఇళ్లలోకి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

శక్తివంతమైన వార్తకు ఫొటో కీలకం: పొన్నాల లక్ష్మయ్య



ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన వార్తా చిత్రాన్ని రూపొందించడంలో న్యూస్ ఫొటోగ్రాఫర్ పాత్ర అత్యంత కీలకమైనదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. వాస్తవికతతో లోతైన అర్థంలో ఉంటేనే గొప్ప ఛాయాచిత్రం అవుతుందని ఆయన అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన-2024ను మంగళవారం పొన్నాల లక్ష్మయ్య సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఫొటోలను ఆయన వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు తమ పత్రికల్లో పక్షపాతం లేని ఛాయాచిత్రాల ద్వారా వాస్తవికతను బహిర్గతం చేయాలన్నారు. ఫొటోగ్రఫీ మాధ్యమం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రతి ఏటా నిర్వహించే న్యూస్ ఫొటో పోటీల, ఉత్తమ ఫొటో జర్నలిస్టుల పురస్కార అందజేత నిర్వహణ బాధ్యతను పొన్నాల ఫౌండేషన్ తీసుకుంటుందన్నారు. అందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు ఫౌండేషన్ అందజేస్తుందని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి వరకాల యాదగిరి, తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, కోశాధికారి అనిల్ కుమార్ కర్ణకోటి, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, పి.మోహనచారి, సభ్యులు ఎస్.శ్రీధర్, వెంకటేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌గా లక్ష్మీప్రియ



రాజేంద్రనగర్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌గా లక్ష్మీప్రియ బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేసిన చేస్తున్న లక్ష్మీప్రియను ఉన్నతాధికారులు రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు.

ఫెడరేషన్ ఆఫ్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా దక్షిణ మండలం కార్యదర్శిగా శ్రీనివాస్



చాంద్రాయణగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా దక్షిణ మండల కార్యదర్శిగా పాతబస్తీ చందులాల్ బేలా ప్రాంతానికి చెందిన పొటేల్ శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ప్రతినిధులుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న టీపీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, చైర్మన్ మెట్టు సాయికుమార్

రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళులు

- విద్యార్థులకు బ్యాగ్‌లు, స్టేషనరీ పంపిణీ

గోషామహల్/మంగళ్‌హాట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. తెలంగాణ ఫిషరీష్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ మెట్టుసాయి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్‌లోని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి టీపీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, టీపీసీసీ సెక్రటరీలు ఎం.నిర్మల్ కుమార్ యాదవ్, సంజయ్ కుమార్ యాదవ్, జనరల్ సెక్రటరీ నిరంజన్, సెక్రటరీ మనీలాల్ షా తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షి, మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశంలో పలు విప్లవాత్మక, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని దేశానికి ముందుకు నడిపారన్నారు.

మారిన బండ్లగూడ తహసీల్దార్ ఫోన్ నంబర్

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ తహసీల్దార్ ఫోన్ నంబర్ మారింది. ప్రజలు గమనించాలని తహసీల్దార్ మందుల జయమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాలు, కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం, ఇతర ఏ సమస్యలున్నా 90634 23984 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



మందకృష్ణ మాదిగను సత్కరిస్తున్న గోషామహల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు గోషామహల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానసభ ఏర్పాటు చేశారు. గోషామహల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు పి.రవి మాదిగ, ఎం.శివ మాదిగ, ఎస్.కె.శ్రీనివాస్ తదితరు లు మందకృష్ణ మాదిగకు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డాకుల లక్ష్మణ్ మాదిగ, ఏ.వి జయ్‌కుమార్, వై.శ్రీనివాస్, విష్ణు మాదిగ, అనుష మాదిగ, కిశోర్ మాదిగ, విజయ్ మాదిగ పాల్గొన్నారు.

ఐదేళ్లు పూర్తయిన ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీజీయూఈఈయూ నాయకులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఐదేళ్లు పూర్తయిన ఆర్టిజన్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలని టీజీయూఈఈయూ డిమాండ్ చేసింది. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(టీజీయూఈఈయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టిజన్లు ఖైరతాబాద్ దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతకు ముందు మింట్‌కాంపౌండ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా మింట్‌కాంపౌండ్ చౌరస్తా నుంచి దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కార్మికులను పై గ్రేడ్‌కు ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో ఆర్టిజన్లు పాల్గొన్నారు.



అభయ్ పాటిల్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఇన్‌చార్జి అభయ్ పాటిల్‌కు స్వాగతం

రాజేంద్రనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నియమితులైన అభయ్ పాటిల్ మంగళవారం సాయంత్రం శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌లో దిగారు. అయనకు బీజేపీ రాష్ట్ర ప్రోటోకాల్ సహ ఇన్‌చార్జి మధుసూదన్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యదర్శి ఎం.కొమురయ్య, భాస్కర్ స్వాగతం పలికారు,



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి మంగళవారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఖాతాదారులకు బ్యాంక్ సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నగర పర్యటనలో భాగంగా ఐదు నూతన ఎస్‌బీఐ బ్రాంచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ గ్రూపునకు సారథ్యం వహించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్, ప్రకాశ్ చంద్ర బరోర్, రవి కుమార్ వర్మ, శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)



అభివాదం చేస్తున్న ఎంపీ ఈటల, ప్రవీణ్‌కుమార్ తదితరులు

'ప్రైవేట్ టీచర్లపై సీఎం వ్యాఖ్యలు తగవు'

పంజాగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రైవేట్ టీచర్లను కించపర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పలువురు అన్నారు. 'ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యాభివృద్ధి-ప్రైవేట్ టీచర్ల పాత్ర' అన్న అంశంపై మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఫోరం అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొ.మురళీ మనోహర్, బక్కా జడ్సన్, వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడిపించే వారు ఆచితూచి మాట్లాడాలని.. ప్రజలు గమనిస్తున్నారన్న విజ్ఞత ఉండాలని సూచించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమాతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో 25 శాతం వెయిటేజీ కల్పించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రైవేటు టీచర్లను కూడా ఎంపిక చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి శ్రీనివాస్, నిరుపమ సంజయ్, వివిధ సంఘాల నాయకులు సిద్దేశ్వర్, భాస్కర్, శివరాజ్, సైదా ఆఫ్షాన్ అఫ్రిన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బెలూన్ దోమ.. జాగ్రత్త సుమ



వానాకాలం నేపథ్యంలో దోమ కాటుతో జ్వరాలు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేసేలా జీహెచ్‌ఎంసీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఉప్పల్ రింగురోడ్డులో ఏర్పాటు చేసిన బెలూన్ దోమ బొమ్మ ఆలోచింపజేస్తోంది. ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, ఉప్పల్ డీసీ అంజనేయులు దీన్ని ఆవిష్కరించారు.
-ఉప్పల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)

సప్తముఖ.. పనులు చకచకా



ఖైరతాబాద్ సప్తముఖ మహా గణపతి శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాడు. వినాయక చవితి సమీపిస్తుండడంతో మట్టి విగ్రహ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వందలాది మంది సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.

నిరసన ర్యాలీ



కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఐమాక్స్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నిమ్స్ రెసిడెంట్ అసోసియేషన్ వైద్యులు, ఈఎస్ఐ, ఉస్మానియా, గాంధీ జూనియర్ డాక్టర్లు. -బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

గొప్ప సామాజికవేత్త నారాయణ గురు

● ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్



'నారాయణ గురు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మానవులందరికీ ఒకే కులం, మతం, దేవుడు అన్న భావనను కల్పించేందుకు కృషి చేసిన సంఘ సంస్కర్తల్లో సామాజిక తత్త్వవేత్త నారాయణ గురు ఆద్యుడని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. నారాయణ గురు జయంతి సందర్భంగా అంబేడ్కర్, జాషువా, ఫూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సత్యబాయి శివరాజ్, ప్రభాకర్‌రావు రూపొందించిన 'సామాజిక తత్త్వవేత్త నారాయణ గురు' పుస్తకావిష్కరణ జరిగింది. జర్నలిస్టు, కవి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌రావు, వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జయసుధ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకుడు గీతా రామస్వామి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీమంత్రి డొక్కా మాట్లాడుతూ.. సంఘ సంస్కరణల కోసం ఒక ఆలోచనతోపాటు యాక్షన్‌ప్లాన్‌తో ముందుకు సాగిన వ్యక్తి నారాయణ గురు అని ప్రశంసించారు 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణ గురు సామాజిక సిద్ధాంతంపైనే తన జీవితకాలం పనిచేశారని గుర్తుచేశారు. అగ్రకులాల ఆలయాలకు పోటీగా 40 నుంచి 50 దేవాలయాలను అట్టడుగు వర్గాల వారి కోసం నిర్మించడమే కాకుండా పూజారులుగా, ఆ దేవాలయాలను విద్యాలయాలుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. సామాజిక దురాచారాలను తీవ్రంగా ప్రశ్నించారని అన్నారు. వెనుకబడిన కులాలకు విద్య, వైద్యం, అభివృద్ధి కోసం ఆయన పనిచేశారని ఈ సందర్భంగా వివరించారు. నారాయణ గురును బీజేపీ సొంతం చేసుకునే యత్నం చేస్తోందని, హిందూమతానికి ఆయన వ్యతిరేకి కాదన్నారు. కేరళలో అన్ని వర్గాలు నారాయణ గురుని దేవుడిగా భావిస్తాయని పేరం శివనాగేశ్వరరావు పేర్కొన్నారు.

సాహిత్య పరిశోధకుడు ముత్యం కన్నుమూత



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య పరిశోధకుడు, శాతవాహన యూనివర్సిటీ విశ్రాంత బోధకుడు కె.ముత్యం (66) మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఆయన స్వస్థలం నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం బాచినపల్లి. ఓయూలో ఉన్నతాభ్యాసం చేసిన ఆయన విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, పీడీఎస్‌యూ నాయకుడిగా పనిచేశారు. ఉత్తర తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పల్లె సంస్కృతి తదితర రచనలకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ కళాకారిణి చిందు ఎల్లమ్మ జీవితాన్ని అక్షరీకరిస్తూ 'నేను చిందు ఎల్లమ్మను', 'చిందు ఎల్లమ్మ యాదిలో' తదితర పుస్తకాలు రాశారు. ఆయన నలభై ఏళ్ల పరిశోధనా జీవితంలో ఇలా కాలం విస్మరించిన మహనీయులను, త్యాగధనులెందరినో సాహిత్య చరిత్రలో నిక్షిప్తం చేస్తూ, వారి జీవిత గాథలను అక్షరబద్ధం చేశారు. ముత్యం ఆకస్మిక మృతి పట్ల జూలూరు గౌరీశంకర్, తిర్మల్, గుర్రం సీతారాములు, ఒమ్మి రమేష్‌బాబుల తోపాటు పలువురు కవులు, రచయితలు సంతాపం తెలిపారు.

ఉద్యోగాల భర్తీకి రేపు జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 22న ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన తెలిపారు. మల్లేపల్లిలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే ఈ మేళాకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత, ఆసక్తి కలిగిన 20 ఏళ్ల పైబడిన నిరుద్యోగ యువత హాజరుకావాలని సూచించారు. జే-గ్రూప్ కంపెనీలో 80 ఖాళీలు ఉన్నాయని, ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు వేతనం ఇస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు 8328428933 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యువతితో ఉబర్ బైక్ రైడర్ అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉబర్ బైక్ రైడర్ యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన హసీరాయ్ బంజారాహిల్స్ రోడ్డు నం.11లో నివాసమంటూ ఓ కంపెనీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నారు. ఈనెల 19న జీవీకే మాల్‌కు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికెళ్లేందుకు ఉబర్ బైక్ బుక్ చేశారు. వాహనం ఎక్కాక డ్రైవర్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గట్టిగా కేకలు వేశారు. వెంటనే ఉబర్ డ్రైవర్ పరారు కాగా, బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గ్లెండేల్ అకాడమీలో 'ఎల్లీ' సందడి

● ఆసక్తిగా ఏనుగు కథను ఆలకించిన విద్యార్థులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బంజ్లగూడలోని గ్లెండేల్ అకాడమీలో మంగళవారం మెకానికల్ ఏనుగు 'ఎల్లీ' సందడి చేసింది. బాలీవుడ్ నటి దియా మీర్జా గొంతుతో ఎల్లీ తన చిన్నతనంలో తల్లి నుంచి విడిపోయిన బాధ, సర్కస్‌లో అనుభవించిన వేధింపులు, చివరకు తనను రక్షించిన తరువాత అభయారణ్యంలో గడిపిన సంతోషకరమైన జీవితం గురించి వివరించింది. ఎల్లీ కథను విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. గ్లెండేల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ మిను సలూజా మాట్లాడుతూ జంతువుల పట్ల దయ, శ్రద్ధను పెంపొందించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పెటా ఇండియా సీనియర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ మీనాక్షి నారంగ్ పాల్గొన్నారు.

ఆలిండియా కె పాప్ పోటీల విజేతల వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కె పాప్ పోటీ-2024 మూడో ఎడిషన్ ప్రాంతీయ రౌండ్ విజేతలను ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎల్‌జీ వెల్లడించింది. హైదరాబాద్ ప్రాంతీయ రౌండ్ విజేతలుగా షైలీ ప్రీతమ్ (వోకల్స్), సెజల్ దుబే(డాన్స్) నిలిచారు.

టీహబ్‌లో అవార్డుల ప్రదానం

రాయదుర్గం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీ హబ్‌లో మంగళవారం ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఎస్‌డీజీ లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విప్‌మీడియా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో హైదరాబాద్ అభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా రాపిడో, డీ-హబ్ ఇంక్యుబెటర్‌తో సంయుక్త భాగస్వామ్యం కోసం ఒప్పందం కుదుర్చుకున్నారు.

'రాజీవ్ విగ్రహాన్ని పెట్టొద్దనే అర్హత కేటీఆర్‌కు లేదు'

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ఎదుట పెట్టొద్దనే అర్హత మాజీమంత్రి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి రవీంద్రనాథ్ నాయుడు పేర్కొన్నారు. దేశం, రాష్ట్రం కోసం రాజీవ్‌గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని, సోనియా చొరవ వల్లే తెలంగాణ వచ్చిందన్న విషయాన్ని కేసీఆర్ కుటుంబం గుర్తుంచుకోవాలని సూచించారు.

కేటీఆర్ రాజకీయ అజ్ఞాని : గౌరి సతీశ్

అఫ్జల్‌గంజ్ : దేశంలో ఎన్నో విప్లవాలు, మార్పులకు నాంది పలికిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ఎదుట ఏర్పాటు చేస్తే తప్పేంటని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. నాంపల్లి గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాజకీయ అజ్ఞానిగా కేటీఆర్ మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని సతీశ్ ధ్వజమెత్తారు.

వర్ష బీభత్సం



వర్షానికి కొట్టుకుపోయిన చిలుకానగర్ బ్రహ్మంగారి గుడి రోడ్డు

(5వ పేజీ తరువాయి)

బ్యాంక్ కాలనీ, ఫస్ట్ ఎవెన్యూకాలనీ తదితర ప్రాంతాల రహదారులన్నీ జలమయమయ్యాయి.

- భారీ ఉరుములు, మెరుపుల శబ్దాలకు నిజాంపేట కార్పొరేషన్ మధురానగర్‌కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.
- మలక్‌పేట మార్కెట్ ఎదురుగా ఉన్న న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ రోడ్డు, అక్షయ్ హోటల్ పక్క వీధిలో వరద ముంచెత్తింది.
- చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను వరద ప్రవాహం ముంచెత్తింది. వరద నీరు లోనికి రావడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు బకెట్లతో ఎత్తి బయటకు పోశారు.
- హయత్‌నగర్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.
- భారీ వర్షానికి బీఎన్‌రెడ్డి నగర్, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి.
- ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ సమీపంలో మోకాలి లోతు వరకు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నీట మునిగిన అండర్‌పాస్‌లు..

- భారీ వర్షానికి బేగంపేట నుంచి ఫతేనగర్‌కు వెళ్లే బల్కంపేట లింక్ రోడ్డులో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలోకి వరద చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. బ్రిడ్జి మొత్తం మునిగిపోవడంతో వాహనదారులు గంటలపాటు నిరీక్షించారు. విషయం తెలుసుకున్న అధికారులు ట్రాఫిక్‌ను అమీర్‌పేట గ్రీన్‌ల్యాండ్ మీదుగా మళ్లించారు.
- చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డులో భారీగా వరద చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలు మినహా చిన్న వాహనాలు వెళ్లేందుకు వీలులేని విధంగా మారింది.



స్కూల్లోకి నీళ్లు రావడంతో కమ్యూనిటీహాల్‌లో ఉన్న ఉపాధ్యాయులు

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

- భారీ వర్షానికి ఎల్‌బీ స్టేడియంలోని సీసీఎస్ పాత కార్యాలయానికి ఆనుకుని స్కేటింగ్ కోర్టు పక్కనే ఉన్న ప్రహరీ కూలిపోయింది. అలాగే భారీ వృక్షం కూలి పార్కింగ్ చేసిన పోలీసు వాహనాలపై పడింది. దీంతో ఒక వాహనం పూర్తిగా ధ్వంసం కాగా.. మరో మూడు పాక్షికంగా దెబ్బతిన్నాయి.
- బన్సీలాల్‌పేట వెంకటాపురం కాలనీ రోడ్డులో భారీ వర్షానికి చెట్టు కూలి పక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడింది. చెట్టు బరువుకు సమీపంలోని విద్యుత్ స్తంభం రోడ్డుపై పార్కు చేసిన కారుపై ఒరగడంతో పాక్షికంగా దెబ్బతిన్నది.



భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన వరద

- ఈదురుగాలులకు పద్మారావునగర్ వెంకటాపురం కాలనీ రోడ్డులో నాలుగు విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. మెట్రోజోన్ పరిధిలో విద్యుత్‌సమస్యలపై 4 వేలకు పైగా ఫిర్యాదులు అందాయి.

ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాలు

- బేగంపేటలోని బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మయూరిమార్గ్‌లోని అల్లం తోటబావి, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. సామగ్రి, ఇతర నిత్యావసరాలు తడిచిపోయాయి.

పిడుగుపాటు..

- పంజాగుట్ట కాలనీలోని సుక్‌నివాస్ అపార్ట్‌మెంట్ రెయిలింగ్‌పై పిడుగు పడింది. దీంతో రెయిలింగ్‌తో పాటూ కారు, కారుషెడ్డూ పాక్షికంగా ధ్వంసమయ్యాయి.
- అంజయ్యనగర్‌లో రోడ్ నంబర్ 24లో పిడుగుపడి ఓ ఇంటి పిట్టగోడ పాక్షికంగా ధ్వంసమైంది. ఇంట్లోని విద్యుత్ స్విచ్‌బోర్డులు, విద్యుత్ వైర్లు అగ్నికి ఆహుతయ్యాయి.

బస్సుల రాకపోకలపై ఎఫెక్ట్..

మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షంతో మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని నెమ్మదిగా ముందుకు కదిలాయి. ట్రాఫిక్ జాంతో సిటీ బస్సుల ట్రిప్పులు తగ్గాయి.



సాయంత్రం మళ్లీ దంచికొట్టిన వాన

● ఖైరతాబాద్‌లో అత్యధికంగా 6.0 సెం.మీ

మంగళవారం తెల్లవారు జామున కురిసిన కుండపోత వర్షం నుంచి పూర్తిగా తేరుకోకముందే సాయంత్రం మరోసారి గ్రేటర్‌లో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి 10 గంటల వరకు ఖైరతాబాద్‌లో అత్యధికంగా 6.0, అమీర్‌పేట మైత్రీవనంలో 5.5 సెం.మీ వర్షం నమోదైంది. భారీవర్షంతో అమీర్‌పేట, ఖైరతాబాద్, లకిడీకాపూల్, ఎర్రగడ్డ, బాలానగర్, కూకట్‌పల్లి, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి.

హరీశ్.. నీ మీద నేనే పోటీ చేస్తా

● ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా
● లేకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటావా ?
● సిద్దిపేట ఎవరి అబ్బ సొత్తు కాదు: మైనంపల్లి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 20: 'ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలి. సిద్దిపేటలో నీ మీద నేనే పోటీ చేస్తా. నేను ఓడిపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా. ఓడిపోతే నువ్వు కూడా తప్పుకుంటావా' అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పొన్నాల వద్ద రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మైనంపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిద్దిపేట పాత బస్టాండ్ వరకు వాహనాలతో ర్యాలీగా వెళ్లి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'మైనంపల్లి పీడ పోవాలంటే హరీశ్‌రావు రాజీనామా చేయాల్సిందే. మీ జోలికి వస్తే కారం, రాళ్లతో కొట్టాలని చెబుతారా? మా కార్యకర్తల జోలికొస్తే మేమూ ప్రతిదాడులు చేస్తాం. తెలంగాణ, సిద్దిపేట ఎవరబ్బ సొత్తు కాదు. పదేళ్లు అధికారంలో ఉండి లక్షల కోట్లు దోచుకున్నారు. వియమల్ని జైలుకు పంపే వరకు సీఎం రేవంత్‌రెడ్డి నిద్రపోరు. బీఆర్‌ఎస్‌ను నమ్మి నాలాగా ఎంతోమంది మోసపోయారు. కల్వకుంట్ల కుటుంబం 1200 మంది అమరుల కుటుంబాల ఉసురు తీసుకున్నది' అని ధ్వజమెత్తారు.

కిటకిటలాడిన మెట్రోరైళ్లు

(5వ పేజీ తరువాయి)

సాధారణ ప్రయాణికులు తమ ఇంటి సమీపంలోని మెట్రోస్టేషన్లకు వెళ్లడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు రాయదుర్గం, అమీర్‌పేట, బేగంపేట, సికింద్రాబాద్ ఈస్ట్, ఉప్పల్, నాగోల్, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ స్టేషన్లతోపాటు రైళ్లలో ప్రయాణికులు కిటకిటలాడారు. 4 నుంచి 6 నిమిషాలకోసారి రైలు రావడం, వచ్చిన వెంటనే బోగీల్లో కిక్కిరిసి వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. టికెట్ కౌంటర్ల వద్ద జనం భారీగా క్యూ కట్టారు. ఎల్‌బీనగర్, రాయదుర్గం, అమీర్‌పేట్ స్టేషన్లలో డిజిటల్ టికెట్లు సకాలంలో అందకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. ఇదిలా ఉండగా, మంగళవారం 5 లక్షలకు పైగా మంది రాకపోకలు సాగించినట్లు మెట్రో వర్గాలు చెబుతున్నాయి. రోజువారీ ప్యాసింజర్లతోపాటు రాఖీ పండుగకు వెళ్లిన మహిళలు సైతం మెట్రో రైళ్లను ఆశ్రయించారు.

వరదనీటిలో కొట్టుకుపోయి మృతి

(5వ పేజీ తరువాయి)

అతడి బాడీ తగిలి ఆగిపోయింది. పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. నాలాలో పూడికను తీయకపోవడం వల్లే వరదనీటి ఉధృతి పెరిగి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ముషీరాబాద్ వరద నీటిలో కొట్టుకొచ్చిన కారు

కొట్టుకుపోయిన కారు, డ్రైవర్, ప్రయాణికుడు

పార్శిగుట్ట చౌరస్తా నుంచి రాంనగర్ వైపు వెళ్తున్న కారు వరద నీటిలో కొట్టుకు పోయింది. అందులో డ్రైవర్, ప్రయాణికుడు ఉన్నారు. స్థానికులు గమనించి కారును ఆపారు. అందులో ఉన్నవారిని దించి కారు కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టేశారు. మరోకారు సైతం వరద నీటిలో కొట్టుకుపోయింది.

బయటకు రావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో వెంటనే ఆమె అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ముందస్తు చర్యలు : కలెక్టర్

కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో భారీ వర్షాలపై రెవెన్యూ, విద్యా, వైద్య, అగ్నిమాపక శాఖ అధికారులతో మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న ఐదు రోజుల్లో నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున లోతట్టు ప్రాంతాల వద్ద ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లోని పాఠశాలలకు ముందస్తు సెలవు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా ఆఫీసర్ వీరబ్రహ్మచారి, సీపీఓ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట్, జిల్లా ఇంటర్ విద్యాధికారి వడ్డెన్న, డీఈఓ రోహిణి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలి

ముంపు ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వీలైన చోట్ల క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేయాలని, కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రాంతాల్లో.. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. మ్యాన్‌హోళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని నగర పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలుంటే.. వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ సెంటర్ నంబర్ 155313కి ఫోన్ చేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. మంగళవారం వాటర్‌బోర్డు ఉన్నతాధికారులతో పాటు జీఎం, డీజీఎం, మేనేజర్‌లతో ఎండీ అశోక్‌రెడ్డి అత్యవసరంగా సమావేశమయ్యారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో.. జలమండలి ఉద్యోగులు, సిబ్బందికి సెలవులను రద్దు చేశారు.

'బ్యాంక్ స్కామ్‌లో మీకు లింకుంది'

● వీడియో కాల్‌లో బెదిరింపు ● రూ.5 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లేకున్నా బిల్లు కట్టాలని బెదిరించాడు. ఇంకో వ్యక్తితో వీడియో కాల్‌లో మాట్లాడించి బ్యాంక్‌స్కామ్‌లో మీ పాత్ర ఉన్నదని భయపెట్టి ఓ యువకుడి నుంచి రూ.5 లక్షలు దోచేశారు. నగరానికి చెందిన ఓ యువకుడి (28)కి ఈనెల 19న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'మీ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు బిల్లు రూ.95 వేలు ఎప్పుడు చెల్లిస్తారు' అని ప్రశ్నించారు. తనకు క్రెడిట్ కార్డే లేదని, బిల్లు ఎక్కడిదని ప్రశ్నించారు. దీంతో రూట్ మార్చిన ఆ వ్యక్తి ఒక నంబర్‌కు వీడియో కాల్ చేసి మాట్లాడమని సూచించాడు. నిజమని నమ్మిన ఆ యువకుడు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. 'రూ.2.5 కోట్ల కెనరా బ్యాంకు కుంభకోణంలో మీకు లింకు ఉన్నట్లు ఆధారాలు లభించాయి. మీపై క్రిమినల్ కేసు నమోదైంది. అరెస్టు వారెంట్ కూడా జారీ అయ్యింది. ఈ స్కామ్‌లో మీ పాత్ర లేదని నిరూపించుకోవాలంటే మీ ఖాతాలో నిల్వలను బదిలీ చేయండి' అని బెదిరించాడు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ యువకుడు తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 5 లక్షలను బదిలీ చేశాడు. ఆ తర్వాత ఎవరూ స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

చిత్రపురి కాలనీలో విల్లా కూల్చివేత

(5వ పేజీ తరువాయి)

సందర్భంగా చిత్రపురి హౌసింగ్ సొసైటీ, మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది.

ఆది నుంచి వివాదమే

చిత్రపురి కాలనీలో హెచ్ఐజీ, ఎంఐజీతోపాటు రోహౌజెస్ కూడా నిర్మించారు. ఈ రోహౌజెస్‌లో అక్రమాలు జరిగాయని, సినీ కార్మికులకు కాకుండా బయట వ్యక్తులకు స్థలాలు కేటాయించారని ఫిర్యాదులొచ్చాయి. రోహౌజెస్‌ను పూర్తిగా తొలగించి ఫ్లాట్లు నిర్మిస్తే 3 వేల మంది కార్మికులకు ఇళ్లు లభిస్తాయని సినీ కార్మికులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. కాగా, ఈ కూల్చివేతలపై చిత్రపురి హౌసింగ్ సొసైటీ నాయకులు మాట్లాడుతూ.. నిర్మాణాలకు మున్సిపాలిటీ అనుమతి ఇచ్చిందని, ఇప్పుడు అనుమతి లేదంటే ఎలాగని ప్రశ్నించారు.

ఫ్యాషన్



జీన్స్.. జాలీగా..

జీన్స్ డ్రస్సుల్లో ఉండే సౌకర్యం అంతా ఇంతా కాదు. ఎంచుకోడానికి వీలున్నన్ని మోడల్స్ జీన్స్‌లో ఉంటాయి. అలాగని కంటికి నచ్చింది కొనేసుకోకుండా, ట్రెండ్‌కు తగిన జీన్స్ డ్రెస్ ఎంచుకోవడం మీద దృష్టి పెట్టాలి.

జబర్దస్త్ జీన్స్ ప్యాంట్స్

టాంపర్డ్ జీన్స్: వెలసిపోయినట్టుండే జీన్స్ డైలీ వేర్‌గా బాగుంటాయి. వీటి మీదకు కార్డిగాన్స్ లేదా లాంగ్ టీష ర్టలను ధరించాలి. బూట్స్, స్పోర్ట్స్ షూస్, చేతికి పెద్ద డయల్ వాచ్ అందంగా ఉంటాయి. సెంటర్ ఆఫ్ ఎట్రా క్షన్ కావాలనుకుంటే హాజరయ్యే ప్రదేశాన్ని బట్టి జీన్స్ ఎంచుకోవాలి. జీన్స్ షర్ట్, టీ షర్ట్, క్రాప్ టాప్స్‌తో జీన్స్‌ను మ్యాచ్ చేయవచ్చు. అందమైన శరీరాకృతి కలిగి ఉండే అమ్మాయిలకు పెన్సిల్ కట్ జీన్స్ బాగుంటాయి. అయితే కురచగా కనిపించే అమ్మాయిలు బూట్‌కట్ జీన్స్‌ను ఎంచుకోకపోవడమే మేలు. బూట్‌కట్ జీన్స్‌కు స్కిన్ ఫిట్టింగ్ టాప్స్ బాగుంటాయి. ఈ జీన్స్‌కు మ్యాచింగ్‌గా పెన్సిల్ హీల్స్ ధరించాలి. సాదాసీదాగా కనిపించాలను కుంటే స్ట్రెయిట్ కట్ జీన్స్ ఎంచుకోవాలి. కాటన్ టాప్స్ మొదలు ఎలాంటి టాప్స్‌తోనైనా ఈ రకం జీన్స్‌ను మ్యాచ్ చేయవచ్చు. కాస్త ట్రెండీగా కనిపించాలనుకుంటే కలర్‌ఫుల్ స్టోల్ ధరించాలి. బిగుతుగా ఉండే జీన్స్‌ను ఇష్టపడని వాళ్ల కోసం ఉద్దేశించినవే బాయ్‌ఫ్రెండ్ జీన్స్. వీటిని బూట్స్, హీల్స్‌తో మ్యాచ్ చేయవచ్చు.

జీన్స్ స్కర్ట్

ట్రెండీగా, మోడర్న్‌గా కనిపించాలనుకునే అమ్మాయిలు జీన్స్ స్కర్ట్స్‌ను ఎంచుకోవచ్చు. నీ లెంగ్త్, షార్ట్ లెంగ్త్ స్కర్టుల్లో పొడవుగా ఉండే అమ్మాయిలు షార్ట్ లెంగ్త్, కురచగా ఉండే అమ్మాయిలు నీ లెంగ్త్ స్కర్ట్స్ వేసుకోవచ్చు. అలాగే ఎంబ్రాయిడరీ, సెక్విన్స్ కుట్టిన స్కర్ట్స్ ఈవినింగ్ పార్టీలకు బాగుంటాయి. ఈ రకం స్కర్ట్స్‌కు జోడీగా బూట్స్, స్పోర్ట్స్ షూస్ ధరించవచ్చు. చేతికి పెద్ద డయల్ వాచ్ బాగుంటుంది.



జీన్స్ టాప్స్

జీన్స్ మెటీరియల్‌తో తయారయ్యే టాప్స్, టైట్ ఫ్రాక్స్ ట్రెండీగా, స్టైలిష్‌గా ఉంటాయి. షికార్లకూ, సరదాలకూ తగినట్టు సౌకర్యంగా కూడా ఉంటాయి. ఫుల్ హ్యాండ్ టాప్ లేదా షర్ట్‌ను జీన్ ప్యాంట్‌తో, స్కర్ట్‌తో మ్యాచ్ చేయవచ్చు. ఫ్రాక్‌కు పెన్సిల్ హీల్ షూలు, బూట్స్ చక్కగా మ్యాచ్ అవుతాయి. సింపుల్ జ్యువెలరీ, యాక్సెసరీస్ ఈ రకం డ్రస్సులకు చాలా బాగా నప్పుతాయి.

వినూత్నం



భవనాలు కళాత్మకంగా..

భారతీయ చారిత్రక నిర్మాణాలకు కళాత్మక జీవం పోస్తోంది తెలంగాణాకు చెందిన మసూమా రిజ్వీ. రాష్ట్రపతి భవనం నుంచి తాజాగా అయోధ్యలో ప్రారంభమైన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం వరకూ ఎన్నో సుప్రసిద్ధ కట్టడాలకు ఇంటీరియర్ డెకరేషన్ చేసిన మసూమా గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు.

ప్రదేశాలకు కొత్త కళను తెచ్చిపెట్టగలిగే నైపుణ్యం తనకుందని మసూమా రిజ్వీకి చిన్నప్పుడే తెలుసు. బాల్యంలో తన డాల్ హౌస్‌తో ఆడుకోకుండా, దాని గోడలను కత్తిరించి, దాన్లోని ఫర్నిచర్‌ను సర్ది, కంటికింపుగా అలంకరిస్తూ ఉండేది. అదే మక్కువ ఆమెతో పాటే పెరిగి, ఆమెను ఆర్కిటెక్ట్, ఆర్టిస్ట్, మ్యూజియాలజిస్ట్, వ్యాపారవేత్తగా భారతీయ చారిత్రక నిర్మాణాలను ఆకట్టుకునేలా అలంకరించే స్థాయికి ఎదిగేలా చేసింది. ఆమె కళాత్మకత.. మానెక్ షా సెంటర్‌లోని కొత్త పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవనంతో పాటు తాజాగా ప్రారంభమైన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం ఇంటీరియర్‌లో సైతం ప్రతిబింబిస్తోంది. ఈ 55 ఏళ్ల వ్యాపారవేత్త బెలీటా డిజైన్స్ పేరుతో తన కళాత్మక వృత్తిని పెంపొందించుకుని దేశం గుర్తించే స్థాయికి చేరుకోవడం విశేషం.

మూలాలు బాల్యంలోనే...

తండ్రి ఆర్మీ అధికారి కావడంతో, తెలంగాణాకు చెందిన మసూమా రిజ్వీ కుటుంబం దేశమంతా విస్తృతంగా పర్యటించింది. అమెరికాలో ఉండే తన తాతయ్య దగ్గర రిజ్వీ ఎక్కువ కాలం పెరిగింది. "మేమెప్పుడూ దూర ప్రాంతాలు ప్రయాణిస్తూనే ఉండేవాళ్లం. కాబట్టి నేను కొత్త ప్రదేశాలకు, ప్రజలకూ తేలికగా అలవాటు పడిపోతూ ఉంటాను. ఆ స్వభావం నాకెంతో ప్రయోజనకరంగా మారింది. చిన్నప్పటి ఆసక్తి, కొత్త ప్రదేశాలు, సంస్కృతుల ప్రత్యేకతలు నాలోని కళాత్మకతకు దన్నుగా మారాయి. అందమైన కళాకృతులను సృష్టించాలనే తపన నాతో పాటే పెరిగింది. దాంతో నేను ఆర్టిస్టుగా స్థిరపడాలని నిర్ణయించుకుని ఆ విషయాన్ని నా తల్లితండ్రులతో చెప్పాను. అప్పుడు వాళ్లు, నువ్వు చదువులో రాణిస్తున్నావు కాబట్టి సైన్స్‌లో ఉన్నత చదువులు చదువు. కళాకారిణిగా స్థిరపడడమెందుకు? అని నన్ను ఎదురు ప్రశ్నించారు. వాళ్ల మాటలతో నాకొక విషయం స్పష్టమైపోయింది. మంచి విద్యార్థిగా రాణిస్తే, తప్పనిసరిగా ఏ డాక్టరో, ఇంజనీరో అయి తీరాలి అని నాకు అర్థమైపోయింది. కానీ నా ఆలోచన వేరు. జీవితంలో మనం అనుకున్నవి అనుకున్న సమయానికి జరగకపోవచ్చు. కానీ మన కలలు నిజమయ్యే సమయం భవిష్యత్తులో మన కోసం వేచి ఉంటుందనడానికి నా జీవితమే ఒక ఉదాహరణ.

కలామ్ మన్ననలతో....

రాష్ట్రపతి భవనం లాంటి ప్రతిష్ఠాత్మక నిర్మాణాల అలంకరణ గురించి ప్రస్తావిస్తూ... "నేను రాష్ట్రపతి భవన్ కోసం పని చేస్తున్న సమయంలో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఉండేవారు. ఆయన ఆ భవనంలో ఒక వెదురిల్లు నిర్మించడం కోసం కళాకారుల నుండి డిజైన్లను ఆహ్వానించారు. కానీ అందర్లోకీ నేను రూపొందించిన అత్యంత సరళమైన డిజైన్ ఆయనను ఆకట్టుకుంది. అలా ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ కట్టడాలను డిజైన్ చేసే నా ప్రయాణం మొదలైంది. కలామ్ గారి అభీష్టం మేరకు ఈశాన్య భారతదేశం నుంచి కళాకారులను పిలిపించి, పర్యావరణ హితమైన వెదురింటిని నిర్మించి, రంగులతో ఆకర్షణీయంగా మలిచాను. ఆ వెదురిల్లు కలామ్ గారికి ఎంతో బాగా నచ్చింది. అప్పటి నుంచి నాకు హైప్రొఫైల్ ఆఫర్లు రావడం మొదలుపెట్టాయి" అంటూ కలామ్‌తో తన పరిచయం గురించిన విశేషాలను పంచుకుంది రిజ్వీ.



అందర్నీ మెప్పించి...

అప్పుడు నాకు 18 ఏళ్లు. ఆ వయసులో నేను ప్రేమలో పడ్డాను. అంత చిన్న వయసులోనే పెళ్లి కూడా చేసేసుకున్నాను. అప్పుడు మా అమ్మ, ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటానని నా చేత ప్రమాణం చేయించుకుంది. దాంతో నేను అయిష్టంగానే సైన్స్‌ను స్వీకరించక తప్పలేదు. కానీ నా భవిష్యత్తు ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్‌లో ఉందని నా మనసుకు తెలుసు. చివరకు ఎలాగైతేనేం నాకు నచ్చిన ఆర్కిటెక్చర్‌లోకి అడుగు పెట్టాను. కానీ ఈ రంగంలో మహిళలకు అవకాశాలు తక్కువ. వృత్తిలోకి అడుగు పెట్టిన కొత్తలో, 'ప్రధాన ఆర్కిటెక్ట్ ఎక్కడ?' అని అడిగినప్పుడు, "అది నేనే" అని అనడం, వచ్చిన వాళ్లు నిరాశగా, నిరాసక్తంగా నన్ను చూడడం, చివరకు ప్రెజెంటేషన్ ఇచ్చేటప్పుడు కూడా, నేను వివరిస్తున్నది వాళ్లకు అర్థం కాకపోవడం లాంటివి జరిగాయి. అయితే నా కెరీర్‌కు ఇవేవీ అవరోధాలు కాకుండా జాగ్రత్తపడ్డాను" అంటూ తన అనుభవాల గురించి వివరిస్తోంది రిజ్వీ. తండ్రి, భర్తలతో కలిసి ఆర్మీ ఆఫీసులకూ, ప్రభుత్వ భవనాలకూ వెళ్లినప్పుడు, ఆకర్షణ లోపించిన ఆ నిర్మాణాలను, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయేది. "ఆ ప్రదేశాలను చూడగానే, వాటిని అందంగా తీర్చిదిద్దాలని అనిపించేది. అలా నేను ఆర్మీ మెస్సులు, మ్యూజియంలకు మెరుగులు దిద్దడంతో నా కెరీర్‌ను ప్రారంభించాను. క్రమేపీ నా పనికి గుర్తింపు పెరిగింది. ప్రస్తుతం నా కళాత్మకతకు కాన్వాసులుగా మారి, కొత్త రూపాలను సంతరించుకున్న నిర్మాణాల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయింది" అంటూ తన కళాత్మక ప్రయాణం గురించి వివరించింది రిజ్వీ.

బాల్య జ్ఞాపకాలే దన్నుగా...

బాల్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజియాలెన్నిటినో రిజ్వీ సందర్శించింది. సందర్శకులను కట్టిపడేసే అక్కడి డిజైన్లు, సాంకేతికతలు రిజ్వీని కూడా ఆకట్టుకున్నాయి. ఆర్ట్ క్యూరేటర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టిన కొత్తలో, చిన్ననాటి జ్ఞాపకాలన్నిటినీ ఆమె తన పనిలో ప్రదర్శించడం మొదలుపెట్టింది. "భారత ప్రభుత్వం, ప్రతి ప్రభుత్వం నిర్మాణంలో ఒక్క శాతం కళాకృతులను తప్పనిసరి చేయడం హర్షణీయం. ఈ మార్పు కోసం నేనెంతో కాలంగా పోరాడుతున్నాను. సందర్శకులు ఆసక్తి కోల్పోకుండా ఉండడం కోసం మ్యూజియాలు, వారసత్వ సంపదలు, స్మారక స్థూపాలు, చిహ్నాలకు సరికొత్త సాంకేతికత సహాయంతో కొత్త హంగులు జోడించడం అవసరం. అందు కోసం కృత్రిమ మేధస్సు, సైన్స్‌లను ఉపయోగించుకోవాలి" అంటూ చెప్పుకొచ్చిన రిజ్వీ ప్రస్తుతం దాదాపు 300 సంప్రదాయ హస్త కళాకారులతో కలిసి పని చేస్తూ, సంప్రదాయ హస్తకళల పరిరక్షణ కోసం కృషి చేస్తోంది.

మార్పు ఛాంపియన్

అడుగడుగునా ఆంక్షలతో, నిషేధాలతో... ఇంటికే పరిమితమైన మారుమూల గ్రామీణ బాలికలను క్రీడా మైదానాల్లోకి తీసుకురావడానికి పెద్ద పోరాటమే చేశారు దియా మజుందార్. ఆమె ప్రయత్నం ఆ పిల్లల జీవితాల్లోనే కాదు, పెద్దల ఆలోచనల్లోనూ మార్పునకు నాంది పలికింది. దియా ప్రోత్సాహంతో ఇప్పుడు ఎందరో పిల్లలు వాలీబాల్‌లో రాణిస్తున్నారు, ఛాంపియన్లుగా నిలుస్తున్నారు.



"మహిళలు ఎన్నో రంగాల్లో అత్యున్నత స్థాయికి చేరుకుంటున్నా, గొప్ప విజయాలు సాధిస్తున్నా... వారి పట్ల సమాజం కనబరిచే ధోరణిల్లో ఇప్పటికీ పెద్దగా మార్పు లేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో అమ్మాయిలు ఎన్నో ఆంక్షల మధ్య బతకాల్సి వస్తోంది. క్రీడల్లో ఆడపిల్లలకు కనీస ప్రోత్సాహమైనా ఉండదు. ఒక క్రీడాకారిణిగా, కోచ్‌గా ఒడిశాలోని ధెంకనల్ జిల్లాలోని గ్రామాల పరిస్థితి నన్ను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. నేను పుట్టింది, పెరిగింది పశ్చిమబెంగాల్‌లోని బంకురా సిటీలో. చిన్న వయసు నుంచి ఆటలంటే ఇష్టం. హైస్కూల్లో చదువుతున్నప్పుడు వాలీబాల్ మీద ఆసక్తి ఏర్పడింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. కోచ్‌గా శిక్షణ పొంది... 'వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' నుంచి సర్టిఫికెట్ పొందాను. కోచ్‌గా కెరీర్ ప్రారంభించాలనుకుంటున్న సమయంలో... ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన అశుతోష్ పాత్రాతో నా వివాహం జరిగింది. నాలుగేళ్ల క్రితం... 2020లో నా భర్తకు గిరిజన ప్రాంతమైన ధెంకనల్‌కు బదిలీ అయింది.

'అది జరగని పని' అన్నారు...

క్రీడాకారిణిగా... ఫిట్‌నెస్‌కు నేను ఎంతో ప్రాధాన్యత ఇస్తాను. మా ఇంటి ఆవరణలో రోజూ వ్యాయామంతో పాటు వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేదాన్ని. చుట్టుపక్కల ఉన్న పిల్లలు నన్ను విచిత్రంగా చూసేవారు.



దానికి కారణం స్థానికంగా పాతుకుపోయిన కట్టుబాట్లే. అక్కడ ఆడపిల్లల జీవితాలు ఇంటి నాలుగు గోడలకే పరిమితం. బడికి వెళ్లేవారి సంఖ్య కూడా తక్కువే. అమ్మాయిలు వీధుల్లోకి వచ్చి ఆటలు ఆడడం అనేది ఊహించలేని విషయం. మారుతున్న ప్రపంచానికి ఎంతో దూరంగా ఉన్న ఆ పిల్లల జీవితాల్లో క్రీడల ద్వారా మార్పు తేవాలని అనుకున్నాను. స్థానిక పాఠశాలలోని టీచర్‌తో నా ఆలోచనలు పంచుకున్నాను. "మీరేం మాట్లాడుతున్నారో అర్థం అవుతోందా? ఈ పల్లెటూరి అమ్మాయిలను వాలీబాల్ కోర్టుకు తీసుకురావడమా? అది జరగని పని. ఇక్కడ ప్రజలు కట్టుబాట్ల కోసం ప్రాణాలైనా ఇస్తారు. ఒక వయసు వచ్చాక ఆడపిల్లలను స్కూలుకు పంపడానికే ఇష్టపడరు" అన్నారావిడ. "ఆ పిల్లల తల్లితండ్రులను ఎలాగైనా ఒప్పిస్తాను. అయితే నాకు ఒడియా అంతగా రాదు. అందుకు మీ సాయం కావాలి" అని అడిగాను. ఆ టీచర్ కాస్త అయిష్టంగానే 'సరే'నన్నారు.

ఎంతో శ్రమపడ్డా...

ముందుగా ఆ స్కూల్‌లో చదివే అమ్మాయిలతో మాట్లాడాను. చాలామంది "క్రీడలంటే మాకు ఇష్టమే. కానీ మా ఇంట్లో ఒప్పుకోరు" అని చెప్పారు. దాంతో ఆ పిల్లల ఇళ్లకు నేను, ఆ టీచర్ వెళ్లాం. తల్లితండ్రులతో మాట్లాడాం. దాదాపు అందరూ ఎగతాళి చేశారు. "మీరు ఎక్కడి నుంచో వచ్చారు. ఇక్కడి పరిస్థితులు మీకు తెలియవు. మీ పని మీరు చూసుకుంటే మంచిది" అన్నారు. ఇతర పాఠశాలల అమ్మాయిల కుటుంబాలను కూడా కలుసుకున్నాను. ప్రతిచోటా స్పందన ఒకేలా ఉంది. అయినా నేను పట్టువదలలేదు. రెండు నెలల పాటు అదే పనిగా ప్రయత్నించాను. చదువుతోపాటు క్రీడల ప్రాధాన్యత గురించి, శారీరకంగా, మానసికంగా బాలికల ఎదుగుదలలో వాటి పాత్ర గురించి ఓపికగా వివరించాను. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తానని భరోసా ఇచ్చాను. చివరకు కొందరు తల్లితండ్రులు అంగీకరించారు. అలా... మూడేళ్ల కిందట అయిదారుగురికి శిక్షణ ప్రారంభించాను. రోజూ వారి తల్లితండ్రులు కూడా మైదానానికి వచ్చేవారు. క్రమంగా వారికి నా మీద నమ్మకం కుదిరింది. శిక్షణకు వచ్చే పిల్లల సంఖ్య కూడా పెరిగింది. కానీ హాఫ్ ప్యాంట్ వేసుకోవడానికి సిగ్గుపడేవారు. సల్వార్ కమీజ్ వేసుకొనేవారు. ప్రాక్టీస్ సమయంలో ఇబ్బందిపడేవారు. క్రీడలకు అనుకూలంగా ఉండేలా దుస్తులు వేసుకోవాలని పిల్లలను, వారి కుటుంబ సభ్యులను ఒప్పించడానికి ఎంతో శ్రమపడ్డాను.

బలమైన ఆ జట్టును ఓడించి...

నా దగ్గర శిక్షణ తీసుకున్న తొలి బృందం పాఠశాల స్థాయి పోటీల్లో గెలవడం, వారి గురించి పత్రికల్లో రావడంతో... తమ పిల్లలను కూడా వాలీబాల్ శిక్షణకు పంపించాలన్న ఆలోచన ఇతరులలోనూ కలిగింది. క్రమంగా పిల్లల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకూ ధెంకనల్ జిల్లాలోని పలు గ్రామాల్లో 130 మందికి పైగా బాలికలు నా దగ్గర శిక్షణ పొందారు. అందరికీ ఉచితంగానే శిక్షణ ఇస్తున్నాను. ఒకప్పుడు వాలీబాల్ అంటే తెలియని ఆ జిల్లా... 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో రాష్ట్రంలోనే ఛాంపియన్‌గా నిలిచింది. అది కూడా అత్యంత బలమైన కేంద్రపడ జిల్లా జట్టును 2-0 తేడాతో ఓడించింది. నా దగ్గర శిక్షణ పొందిన వారిలో 45 మంది రాష్ట్ర స్థాయి మ్యాచుల్లో రాణించారు. ఏడుగురు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ముఖ్యంగా ఆ పిల్లలందరిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రపంచాన్ని చూసే దృక్పథం మారింది. బిడియంగా ఉండే ఆ అమ్మాయిలు ఇప్పుడు వాలీబాల్ కోర్టులో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్నారు. తమ తల్లితండ్రులకు గర్వకారణంగా నిలుస్తున్నారు. కుమార్తెలను ఇంటి పనులకే పరిమితం చేస్తున్న ఎన్నో కుటుంబాలకు ఈ పిల్లల విజయాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశిస్తున్నాను. వాలీబాల్‌లో ఆడపిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలన్నది నా కల. అది నెరవేరడానికి నా భర్త అశుతోష్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు."



వివాహం విజయవంతమవ్వాలంటే..

విజయవంతమైన వైవాహిక సంబంధానికి అవసరమైన పాళ్లేవిటి? చాలా మంది జంటలకు ఎదురయ్యే ప్రశ్న ఇది. మానసిక శాస్త్రవేత్తలు వివరిస్తున్న ఈ పాళ్లేమిటో చూద్దాం..

1 ఆరోగ్యకరమైన సరిహద్దులు..

ప్రతి వ్యక్తికి కొన్ని వ్యక్తిగతమైన విషయాలు.. ఆలోచనలు ఉంటాయి. ఆ విషయాలలోకి చొచ్చుకురానంత వరకు ఎటువంటి సమస్యలు రావు. ప్రతి వ్యక్తి తన భాగస్వామికి సంబంధించిన ప్రైవసీని గౌరవించాలి. ఆ ప్రైవసీ హద్దులను దాటకూడదు. దాటితే సమస్యలు ఎదురవుతాయి.

2 ఆలంబన

ఆడ, మగ అనే తేడా లేకుండా అందరికీ జీవితంలో ఎదగాలనే ఆశ ఉంటుంది. కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఆ లక్ష్యాలను చేరుకోవటానికి సాయపడే వారి కోసం వారు ఎదురుచూస్తూ ఉంటారు. తన భాగస్వామికి ఏం కావాలో తెలుసుకొని- ఆ లక్ష్యాన్ని చేరుకోవటంలో వారికి సాయపడినప్పుడు మంచి అనుబంధం ఏర్పడుతుంది.

3 అభిప్రాయాల కలయిక..

ఏ ఇద్దరు ఒకలా ఉండరు. అభిప్రాయాలు కూడా వేర్వేరుగా ఉండవచ్చు. కానీ వైవాహిక జీవితం ఆనందంగా ఉండాలంటే- ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవాలి. హాబీలను పంచుకోవాలి. ఇలా కొద్ది కాలం ప్రయాణం చేస్తే- ఒకరిపై మరొకరికి భరోసా ఏర్పడుతుంది. ఆనందంగా జీవించగలుగుతారు.

4 విలువల పందిరి

రెండు కుటుంబాల నుంచి వచ్చిన వారికి వేర్వేరు విలువలు.. జీవన శైలి ఉండే అవకాశముంది. అయితే మౌలిక భావనలు ఒకటే అయినప్పుడు వాటిని గుర్తించి ఆచరిస్తే- అనుబంధం బలపడుతుంది.

5 మార్పు అవసరం

ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవటం.. వాటిని గౌరవించటం చాలా కష్టమైన విషయం. వివాహ బంధంలో - ఒకరి అభిప్రాయాలు మరొకరికి నచ్చకపోవచ్చు. కానీ తమ అవసరమైన తమ అభిప్రాయాన్ని మార్చుకొనే పరిణితి ఉండాలి. అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు వాటిని అధిగమించటానికి ప్రయత్నించాలి. మొత్తం వివాహబంధాన్నే వదిలేసి పారిపోకూడదు.

6 సుఖాలే కాదు కష్టాలు కూడా

వివాహబంధంలో నవ్వులే కాదు.. విషాదాలు ఉంటాయి. సరదాలే కాదు. సమస్యలు ఉంటాయి. సమస్యలు ఎదురయినప్పుడు- వాటిని అధిగమించటానికి ఒకరితో మరొకరు మనసు విప్పి మాట్లాడుకోగలగాలి. ఆ స్వేచ్ఛ ఉన్నప్పుడే వివాహబంధం బలోపేతమవుతుంది.

7 స్నేహితులుగా మారండి..

భార్య, భర్తలనగానే కుటుంబం పట్ల.. సమాజం పట్ల తమకు ఉన్న బాధ్యతలు గుర్తుకు వస్తాయి. ఈ బాధ్యతల ఒత్తిడిలో సమస్యలే ఎక్కువగా కనిపిస్తూ ఉండచ్చు. అందువల్ల భార్యభర్తలు ముందు ఒకరితో మరొకరు అన్నీ పంచుకొనే స్నేహితులుగా మారాలి. ఆ తర్వాతే సహచరులు అవ్వాలి.

8 ప్రాధమ్యాలు..

ఆధునిక జీవితంలో అందరూ చాలా బిజీగా ఉండారు. అలాంటి బిజీ షెడ్యూల్స్‌లో కూడా భాగస్వామికి తగిన సమయం కేటాయించాలి. పనితో పాటుగా వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే వివాహబంధం బలపడుతుంది.

దిక్సూచి
DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రప్రభుత్వం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబీ కులాలను వర్గీకరించి వారికి విద్య ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి. చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది.



ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6ః1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్రప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.

రాష్ట్రప్రభుత్వాల కోర్టులో బంతి

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నాయి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బతీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/fcECAv0లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు



ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.

అందరికీ ధన్యవాదాలు



తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటకు రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

● షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.

● ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం... అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.

● షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటీ స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

● కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.

● అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.

ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలి

రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకొని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు రూ.కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవ కుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. ఆమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!



పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!

నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.

అసూయతో వచ్చిన మాటలవి





ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ, 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..

విడుదల తేదీ మారింది



వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తనకంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మాట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.



ఒకే ఓవర్‌లో 39 పరుగులు

సమోవా బ్యాటర్ విస్సెర్ అరుదైన రికార్డు

ఏపియా (సమోవా): ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లతో 36 పరుగులు అంటే వావ్.. అనుకుంటాం. కానీ ఏకంగా 39 పరుగులు సాధిస్తే. సంచలనమే కదా! టీ20 వరల్డ్ కప్ 2026 క్వాలిఫయర్ (ఈస్ట్ ఆసియా-పసిఫిక్ సబ్ రీజియన్)లో భాగంగా సమోవా-వనువాటు జట్ల మధ్య మ్యాచ్‌లో ఈ వరల్డ్ రికార్డు నమోదైంది. సమోవా బ్యాటర్ డేరియస్ విస్సెర్ తమ ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి 6, 6, 6, నోబ్, 6, 0, నోబ్, నోబ్+6, 6తో అదరగొట్టాడు. దీంతో ఇప్పటి దాకా టీ20ల్లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగుల (36) రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో విస్సెర్ 5 ఫోర్లు, 14 సిక్సర్లతో 132 (62 బంతుల్లో) పరుగులు సాధించి జట్టు విజయానికి కూడా కారణమయ్యాడు. మ్యాచ్‌లో సమోవా జట్టు 10 పరుగుల తేడాతో గెలిచింది. మొదట సమోవా.. డేరియస్ సూపర్ ఇన్నింగ్స్‌తో 20 ఓవర్లలో 174 పరుగులు చేయగా.. వనువాటు జట్టు 20 ఓవర్లలో 164/9 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. ఇక, సమోవా తరపున తొలి టీ20 సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచాడు. మరోవైపు గతంలో ఐదుసార్లు ఒకే ఓవర్‌లో 36 పరుగుల రికార్డు నమోదైంది. 2007 టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌పై యువరాజ్ వరుసగా ఆరు సిక్సర్లతో తొలిసారి ఈ సూపర్ ఫీట్ సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పొలార్డ్, దీపేంద్ర సింగ్ (నేపాల్) కూడా ఇలాగే ఆరు సిక్సర్లతో ఈ ఫీట్ నమోదు చేశారు. ఇక నికోలస్ పూరన్‌తో పాటు రోహిత్, రింకూ కలిసి ఒకే ఓవర్‌లో మొత్తంగా ఇన్నేసి పరుగులు సాధించిన జాబితాలో ఉన్నారు.



జాక్‌పాట్

ఐపీఎల్‌తో రూ.5,210 కోట్లు

గతేడాది బీసీసీఐ లాభం ఇది

2022తో పోలిస్తే 116 శాతం పెరుగుదల

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్న బోర్డుగా కొనసాగుతున్న భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ఖజానా.. ఐపీఎల్‌తో మరింత కళకళలాడుతోంది. ఇతర దేశాల బోర్డులకు కన్ను కుట్టే రీతిలో 2023 సీజన్‌కుగాను బీసీసీఐకి ఏకంగా రూ. 5,210 కోట్ల లాభాన్ని ఐపీఎల్ అందించింది. ఇది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వార్షిక ఆదాయంకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ కావడం విశేషం. అలాగే 2022 సీజన్‌తో పోలిస్తే ఈసారి 116 శాతం పెరుగుదల కనిపించిందని బోర్డు తమ వార్షిక నివేదికలో పేర్కొంది. దీనిప్రకారం ఐపీఎల్ 2023 సీజన్‌లో మొత్తంగా రూ. 11,769 కోట్ల ఆదాయం రాగా.. 2022తో పోలిస్తే ఇది 78శాతం అధికం కావడం విశేషం. మరోవైపు ఖర్చులు కూడా 68 శాతం పెరుగుదలతో రూ. 6,648 కోట్లకు చేరాయి. ఇక, 2023-27 కాలానికి బోర్డు రూ. 48,390 కోట్లతో మీడియా హక్కుల ఒప్పందం కుదుర్చుకోవడం కూడా ఈ అధిక లాభాలకు కారణంగా చెప్పవచ్చు. ఇందులో డిస్నీ స్టార్ గ్రూప్ రూ. 23,575 కోట్లతో టీవీ రైట్స్ తీసుకోగా, జియో సినిమా రూ. 23,758 కోట్లతో డిజిటల్ హక్కులను కొనుగోలు చేసింది. అలాగే ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను టాటా సన్స్ రూ. 2500 కోట్లకు తీసుకోవడం గమనార్హం. గతేడాది ఆరంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ కూడా బీసీసీఐకి రూ. 377 కోట్ల మిగులు సంపాదనను తీసుకువచ్చింది. ఇలా, లీగ్‌లతో బీసీసీఐ తన ఆదాయాన్ని రోజురోజుకూ పెంచుకుంటూ ముందుకెళుతోంది.

నెలాఖరులోగా రిటెన్షన్ రూల్‌పై స్పష్టత

వచ్చే ఏడాది ఐపీఎల్ మెగా వేలం జరుగబోతోంది. దీనికంటే ముందే ఫ్రాంచైజీలన్నీ ఆటగాళ్ల రిటెన్షన్ పాలసీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. ఈనెలాఖరులోగా బీసీసీఐ ఈ విషయంలో స్పష్టతనిచ్చే అవకాశం ఉందని సమాచారం. అయితే లీగ్‌లోని ప్రతీ జట్టు రైట్ టు మ్యాచ్ ఆప్షన్‌తో కలిపి ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు అనుమతించే ఆలోచనలో ఉంది. వేలానికి ముందే ఆయా జట్లు తమ ఆటగాళ్లను మార్చుకోవడాన్ని రైట్ టు మ్యాచ్ అని పిలుస్తుంటారు. కొన్ని ఫ్రాంచైజీలు అసలు మెగా వేలమే వద్దని బోర్డును కోరినట్టు తెలుస్తోంది. అయితే ఇందుకు బీసీసీఐ మాత్రం సుముఖంగా లేదు.



హోటల్‌లో సర్వర్‌గా ఒలింపిక్ పతక విజేత!

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన తర్వాత పోడియంపై నిల్చొని అమాయకంగా పతకాన్ని ముద్దాడిన వీడియోతో వైరల్ అయిన 18 ఏళ్ల చైనా జిమ్నాస్ట్ ఝౌ యాకిన్.. మరోసారి నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. తాజాగా ఒలింపిక్ యూనిఫాంలో ఓ రెస్టారెంట్‌లో సర్వ్ చేస్తున్న ఆమె వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. హెంగ్‌యాంగ్ సిటీలో 'ఫ్యాట్ బ్రదర్' పేరుతో యాకిన్ తల్లిదండ్రులు రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో విశ్వక్రీడలు ముగిసిన తర్వాత ఇంటి చేరుకున్న యాకిన్ తల్లిదండ్రులకు సహాయంగా కస్టమర్లకు సర్వ్ చేస్తోంది. ఇలా.. ఆటను, కుటుంబ బాధ్యతలను చక్కగా బ్యాలెన్స్ చేస్తోన్న యాకిన్‌పై నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది. పారిస్ క్రీడల్లో బ్యాలెన్సింగ్ బీమ్‌లో దిగ్గజం సిమోన్ బైల్స్ లాంటి వారితో పోటీపడి యాకిన్ రెండో స్థానంలో నిలిచింది. పతక ప్రదానం సందర్భంగా స్వర్ణం, కాంస్యం గెలిచిన ఇటలీ జిమ్నాస్ట్‌లు అలీస్ డిమాంటో, మనీలా ఎస్పోసిటోలు పతకాన్ని కొరికి సందడి చేస్తుంటే.. ఆశ్చర్యంగా వారివైపు చూసిన యాకిన్, పతక విజేతలు ఇలాగే చేయాలేమో అనుకొని పతకం నోటి దగ్గర పెట్టుకొని ఫొటోలకు ఫోజులివ్వడం అందరినీ ఆకట్టుకుంది.

బంగ్లా నుంచి యూఏఈకి

మహిళల టీ20 ప్రపంచ కప్ వేదిక మార్పు

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ వేదికపై సందిగ్ధతకు తెరపడింది. ఈ మెగా ఈవెంట్‌ను బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి తరలిస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 3 నుంచి 20 వరకు వరల్డ్ కప్ బంగ్లాదేశ్‌లో జరగాలి. కానీ, అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో వేదిక తరలింపుపై కొన్నిరోజులుగా ఐసీసీ మల్లగుల్లాలు పడుతున్న సంగతి తెలిసిందే. ఓ దశలో టోర్నీ నిర్వహణ కోసం భారత్‌ను ఐసీసీ సంప్రదించినా, బీసీసీఐ అందుకు ఒప్పుకోలేదు. ఇక, ఆతిథ్యానికి తాము సిద్ధమంటూ జింబాబ్వే క్రికెట్ బోర్డు ముందుకొచ్చినా, ఐసీసీ మాత్రం చివరకు యూఏఈనే ఎంపిక చేసింది.

ఆసియా బ్యాడ్మింటన్ సారథిగా జ్ఞానదత్తు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఐదుగురు తెలంగాణ, ఇద్దరు ఆంధ్ర షట్లర్లు అర్హత సాధించారు. చైనాలో గురువారం నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనే భారత బృందానికి తెలంగాణ షట్లర్ జ్ఞానదత్తు సారథ్యం వహించనున్నాడు. బాలుర సింగిల్స్ అండర్-17లో జ్ఞానదత్తు, అండర్-15లో శశాంక్, అండర్-15 డబుల్స్‌లో రాహుల్ (ఆంధ్ర), బాలికల అండర్-17లో తన్వీ రెడ్డి, దుర్గ (ఆంధ్ర), మిక్స్‌డ్ అండర్-17లో శౌర్య కిరణ్-కీర్తి బరిలోకి దిగనున్నారు.

రాజకీయాల్లోకి వినేశ్?

సోదరి బబితపై పోటీ!



చండీగఢ్: అధిక బరువు కారణంగా ఒలింపిక్స్ పతకానికి దూరమైన రెజ్లర్ వినేశ్ ఫొగట్ దృష్టి ఇప్పుడు రాజకీయాలపై పడిందనే కథనాలు వినిపిస్తున్నాయి. అనర్హతకు గురైన వెంటనే వినేశ్ ఆటకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. త్వరలో జరుగబోయే హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె బరిలోకి దిగే అవకాశం లేకపోలేదని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా వరుసకు తన సోదరైన మాజీ రెజ్లర్ బబితా ఫొగట్‌పై పోటీకి దిగనుందనే వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి. 'రాజకీయాల్లోకి వినేశ్ ఎందుకు రాకూడదు? కొన్ని పార్టీలు ఇప్పటికే ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ పార్టీలో చేరనుందనే విషయంలో ప్రస్తుతానికి స్పష్టత లేదు. అయితే, హరియాణా ఎన్నికల్లో వినేశ్ వర్సెస్ బబితా పోటీ కూడా ఉండవచ్చు' అని వినేశ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరోవైపు వినేశ్ భారత్‌కు చేరుకున్న సమయంలో ఎయిర్‌పోర్ట్ వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా అంతా తానై స్వాగత ఏర్పాట్లు చేశాడు. ఇక బబితా ఫొగట్ బీజేపీ తరపున 2019లో దాద్రి స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయింది.

గుకేష్, ప్రజ్ఞానందకు డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యూఫీల్డ్ చెస్ కప్‌ను భారత యువ గ్రాండ్ మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద డ్రాలతో ఆరంభించారు. తొలి రౌండ్‌లో వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో గుకేష్.. నోడిర్‌బెక్ అబ్దుస్తరోవక్ (ఉజ్బెకిస్థాన్)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నారు.



'పికిల్‌బాల్'లో సమంత

చెన్నై జట్టును దక్కించుకున్న నటి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ (డబ్ల్యూపీబీఎల్)లో పోటీపడే చెన్నై జట్టును టాలీవుడ్ నటి సమంత దక్కించుకుంది. సోమవారం ముంబైలో జరిగిన వేలంలో సమంత చెన్నై జట్టును సొంతం చేసుకున్నట్టు డబ్ల్యూపీబీఎల్ ప్రకటించింది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. పికిల్‌బాల్ ఆటను చూసిన తొలిసారే దాంతో ప్రేమలో పడ్డానని చెప్పింది. 'దేశీయ క్రీడారంగంలో ఎక్కువ మంది మహిళలను భాగం చేయాలనేది నా లక్ష్యం. ఇందుకోసం డబ్ల్యూపీబీఎల్‌తో కలిసి పనిచేస్తా' అని సమంత తెలిపింది.



రేసింగ్ లీగ్ కౌంట్‌డౌన్ షురూ

24 నుంచి చెన్నైలో ఐఆర్‌ఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎఫ్ఐఏ ఫార్ములా-4 ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్)కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. వచ్చే శనివారం నుంచి చెన్నై వేదికగా ఈ రేసింగ్ పోటీలు జరగనున్నాయి. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ సహా మొత్తం ఆరు దేశీయ జట్లు ఇందులో తలపడనున్నాయి. హైదరాబాద్ జట్టు యజమాని, టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య లీగ్ ప్రారంభ వేడుకల్లో పాల్గొననున్నాడు. చైతూతో పాటు ఇతరజట్ల యజమానులైన టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ, బాలీవుడ్ నటులు అర్జున్ కపూర్, జాన్ అబ్రహం వేడుకలకు హాజరవనున్నారు.



సిన్నర్ డోపింగ్‌లో దొరికినా..!

కాలిఫోర్నియా (అమెరికా): ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ ఆటగాడు, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత జానిక్ సిన్నర్ (ఇటలీ) రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడ్డాడు. కానీ, అతడిపై ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత మార్చిలో ఇండియన్ వెల్స్ టోర్నీ సందర్భంగా సిన్నర్ శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం క్లోస్టబోల్ ఆనవాళ్లు కనిపించాయి. అయితే, సిన్నర్ ఉద్దేశపూర్వకంగా డ్రగ్స్ తీసుకోలేదని స్వతంత్ర ట్రిబ్యునల్ పేర్కొనడంతో అతడిపై సస్పెన్షన్ విధించలేదు. అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) మంగళవారం ఈ కేసు వివరాలను బహిర్గతం చేసింది. టాన్సిల్స్‌తో బాధపడుతున్న సిన్నర్ చికిత్సలో భాగంగా స్వల్పస్థాయిలో ఆ ఉత్ప్రేరకాన్ని వాడినట్టు తెలిపింది. మరోసారి అవుటాఫ్ కాంపిటీషన్ టెస్ట్‌లో కూడా పాజిటివ్‌గా రావడంతో తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. కానీ, ఈనెల 15న విచారణలో గాయంపై స్ప్రేచేసే క్రమంలో ఆ డ్రగ్ అతడి బాడీలోకి ప్రవేశించిందనే వివరణపై సంతృప్తి చెందిన ఐటీఐఏ అతడిపై నిషేధాన్ని ఎత్తివేసింది.

కాంస్యపోరుకు రోనక్, సాయినాథ్

అమ్మాన్ (జోర్డాన్): భారత యువ రెజ్లర్లు రోనక్ దహియా (110 కిలోలు), పార్థీ సాయినాథ్ (51 కిలోలు) అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక పోరులో నిలిచారు. సెమీస్‌లో రోనక్ 0-2తో జొల్టాన్ జాకో చేతిలో ఓడాడు. దీంతో రోనక్ కాంస్య పతక పోరులో ఎమురుల్లాతో తలపడతాడు. తొలిరౌండ్లో సాయినాథ్ 1-5తో తుషాన్ చేతిలో ఓడాడు. తుషాన్ ఫైనల్ చేరడంతో సాయినాథ్‌కు రెపిచేజ్ రౌండ్ చాన్స్ దక్కింది. దీంతో కాంస్యంకోసం డొమినిక్‌తో సాయినాథ్ పోటీపడనున్నాడు.

బిజినెస్

ఫ్రెషర్లకు రూ.9.5 లక్షల ప్యాకేజీ!

పవర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్ ప్రాంగణ నియామకాల (క్యాంపస్ ప్లేస్‌మెంట్) ప్రక్రియలో భాగంగా పవర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపిక చేసిన కాలేజీల నుంచి నియమించుకునే ఫ్రెషర్లకు రూ.9 లక్షల వరకు వార్షిక పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నట్టు తెలిసింది. సాధారణంగా కంపెనీ ఫ్రెషర్లకు ఆఫర్ చేసే రూ.3-3.5 లక్షల వార్షిక ప్యాకేజీతో పోలిస్తే చాలా అధికమిది. పవర్ ప్రోగ్రామ్‌లో ఫ్రెషర్లకు సాఫ్ట్‌వేర్ కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. గత ఏడాది కాలంలో హైరింగ్‌ను బాగా తగ్గించిన ఇన్ఫోసిస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా 15,000-20,000 మంది గ్రాడ్యుయేట్లను చేర్చుకోనున్నట్లు జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడించింది.

ఐడీబీఐ బ్యాంక్ డిపాజిట్ రేటు పెంపు

న్యూఢిల్లీ: ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఐడీబీఐ బ్యాంక్ దానిపై వడ్డీ రేటు పెంచింది. దీని కింద 444 రోజుల డిపాజిట్‌కు గరిష్ఠంగా 7.85 శాతం వడ్డీ చెల్లిస్తారు. ఇది పరిమిత కాల ఆఫర్. 375 రోజుల డిపాజిట్‌పై 7.75 శాతం వడ్డీ చెల్లిస్తారు. ఈ ఆఫర్ సెప్టెంబరు 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని బ్యాంక్ ప్రకటించింది. ఉత్సవ్ డిపాజిట్ స్కీమ్ కింద 700 రోజుల డిపాజిట్‌కు 7.70 శాతం, 300 రోజుల డిపాజిట్‌కు 7.55 శాతం వడ్డీ ఇస్తున్నట్టు కూడా బ్యాంక్ తెలిపింది.

ఎఫ్‌డీలపై 8.5% వరకు వడ్డీ రేటు

బంధన్ బ్యాంక్

ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) కోసం బంధన్ బ్యాంక్ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తోంది. ఒక ఏడాది తొమ్మిది నెలల కాలపరిమితి ఉండే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం, ఇతరులకు 8 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఒక సంవత్సరం తొమ్మిది నెలలకు మించి, ఐదేళ్ల లోపు ఉండే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, ఇతరులకు 7.25 శాతం చొప్పున వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది.

టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి ప్రపంచంలోని టాప్ సెంట్రల్ బ్యాంకర్లలో ఒకరిగా ఎంపికయ్యారు. అమెరికా కేంద్రంగా పనిచేసే గ్లోబల్ ఫైనాన్స్ పత్రిక ఈ ఎంపిక చేసింది. దాస్ టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా ఎంపికవడం వరుసగా ఇది రెండోసారి. గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్- 2024 పేరుతో గ్లోబల్ ఫైనాన్స్ పత్రిక ఒక జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో పాటు డెన్మార్క్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ క్రిస్టియన్ కెట్టెల్ థామ్సన్, స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ థామస్ జోర్డాన్‌లకు అత్యుత్తమ ఏ+ రేటింగ్ లభించింది.

మార్కెట్ సంపదలో రూ.2.5 లక్షల కోట్ల వృద్ధి

రూ.456.7 లక్షల కోట్లకు మార్కెట్ క్యాప్



సెన్సెక్స్ 378 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం మళ్లీ లాభాల బాట పట్టాయి. ఒక దశలో 518 పాయింట్లు ఎగబాకి 81,000 స్థాయికి చేరువైన సెన్సెక్స్.. చివరికి 378.18 పాయింట్ల లాభంతో 80,802.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126.20 పాయింట్ల వృద్ధితో 24,698.85 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పాటు ముడి చమురు ధరల తగ్గుదల కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. మార్కెట్ ర్యాలీలో ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.46 లక్షల కోట్లు పెరిగి రూ.456.7 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 లాభపడ్డాయి.

సరస్వతి శారీ డిపో బంపర్ లిస్టింగ్

గతవారం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను పూర్తి చేసుకున్న సరస్వతి శారీ డిపో లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.160తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 25 శాతం ప్రీమియంతో రూ.200 వద్ద లిస్టయింది. ఆ తర్వాత మరింత పుంజుకుని 31.21 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.209.95కు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.831.40 కోట్లుగా నమోదైంది.

సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటా విక్రయం

రూ.860 కోట్లు సమీకరించే అవకాశం

తన అనుబంధ విభాగమైన సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటాను ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని హైదరాబాద్‌కు చెందిన ఐటీ కంపెనీ సైయెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం వెల్లడించింది. సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటాకు సమానమైన 1.149 కోట్ల షేర్లను ఈ నెల 21న (బుధవారం) విక్రయించనున్నట్లు తెలిపింది. ఒక్కో షేరు కనీస ధరను రూ.748.65గా నిర్ణయించింది. తద్వారా సైయెంట్‌కు రూ.860.9 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. ఈ నిధులతో రుణ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు నిర్వహణ మూలధన అవసరాలకు వినియోగించుకోనున్నట్లు స్పష్టం చేసింది. ఈ బ్లాక్ డీల్ అనంతరం సైయెంట్ డీఎల్ఎంలో సైయెంట్ వాటా 66.66 శాతం నుంచి 52.16 శాతానికి తగ్గనుంది.

పసిడి హైజంప్

- ఒక్కరోజే రూ.1,400 పెరుగుదల
- తులం రూ.74,150కి చేరిక
- రూ.3,150 పెరిగిన కిలో వెండి

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు గడిచిన నెల రోజుల్లో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం రూ.1,400 పెరుగుదలతో రూ.74,150కి చేరుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,150 ఎగబాకి రూ.87,150 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు సరికొత్త రికార్డు స్థాయికి చేరడం ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 2,560 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 30.19 డాలర్ల వద్ద ట్రేడైంది.

కిమ్స్ హాస్పిటల్‌లో ఎస్‌బీఐ లైఫ్‌కు మరో 0.97% వాటా

హైదరాబాద్‌కు చెందిన కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్)లో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అదనంగా మరో 7,75,758 లక్షల షేర్లను రూ.184.11 కోట్లకు కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 0.97 శాతానికి సమానమైన ఈ షేర్లను కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ బ్లాక్ డీల్ డేటా వెల్లడించింది. ఒక్కో షేరును రూ.2,373.30 సగటు ధరతో ఎస్‌బీఐ లైఫ్ కొనుగోలు చేసింది. కాగా ఐసీఐసీఐ వెంచర్స్‌కు చెందిన ఇండియా అడ్వాంటేజ్ ఫండ్ ఎస్4-1, డైనమిక్ ఇండియా ఫండ్ ఎస్4 యూఎస్-1.. ఇదే ధరకు కిమ్స్ షేర్లను విక్రయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌బీఐ లైఫ్.. రూ.239 కోట్లతో కిమ్స్‌లో 1.4 శాతం వాటాను కొనుగోలు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▼	66,600 ▼	92,000 ▲
ముంబై	71,945 ▲	65,902 ▲	85,321 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	480
వరంగల్	452	గోదావరి	480
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

ఓఎన్‌జీసీకి మరో అధునాతన రిగ్

మేఘా ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్స్ మార్కెట్లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి మరో అధునాతన ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్‌ను సరఫరా చేసింది. అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఫుల్లీ ఆటోమేటెడ్, హైడ్రాలిక్ 2000 హెచ్‌పీ రిగ్‌ను ఓఎన్‌జీసీ రాజమండ్రి ప్రాంతంలో చమురు, సహజ వాయువు అన్వేషణకు ఉపయోగించనుంది. తీవ్రమైన ఒత్తిడి, ఉష్ణోగ్రతల్లోనూ ఈ డ్రిల్లింగ్ రిగ్ సాయంతో 6,000 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయవచ్చు. చమురు, సహజవాయువు కోసం డ్రిల్లింగ్ చేసేటప్పుడు ఏర్పడే బ్లోఅవుట్స్‌ను అదుపు చేసేందుకూ ఈ రిగ్‌లో ప్రత్యేక ఏర్పాటు ఉందని ఎంఈఐఎల్ తెలిపింది. కేవలం ఇద్దరి సహాయంతో ఈ రిగ్‌ను ఆపరేట్ చేయడం మరో ప్రత్యేకత. ఆత్మనిర్భర్ భారత్ కింద ఎంఈఐఎల్ ఈ అధునాతన రిగ్‌లను తయారు చేస్తోంది. అంతర్జాతీయ పోటీని తట్టుకుని ఓఎన్‌జీసీకి మొత్తం 47 డ్రిల్లింగ్ రిగ్‌లు సరఫరా చేసే కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకుంది.

హైదరాబాద్‌లో ఫ్లట్టర్ గ్లోబల్ కెపాసిటీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆన్‌లైన్ క్రీడల బెట్టింగ్, ఐ గేమింగ్ కంపెనీ ఫ్లట్టర్ ఇండియా మంగళవారం హైదరాబాద్‌లో కొత్త గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభించింది. 35 లక్షల డాలర్ల (రూ.29 కోట్లు) వ్యయంతో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌లో ఇప్పటికే 700 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. సృజనాత్మకతను ప్రోత్సహించడం, భారత ఉపాధి, నైపుణ్యాల మార్కెట్లో తమ అస్తిత్వాన్ని శక్తివంతం చేసుకోవడం, వృద్ధి సాధన ఈ సెంటర్ ఏర్పాటు చేయడం వెనుక లక్ష్యాలని ఫ్లట్టర్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఓఓ ఫిల్ బిషప్ తెలిపారు. డేటా అనలిటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో నియామకాలు చేపట్టాలనుకుంటున్నామని, ఈ ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 900కి పెంచాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.

మరింత సులభంగా రైట్స్ ఇష్యూలు!

సెబీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ కోసం కంపెనీలు జారీ చేసే రైట్స్ ఇష్యూలను మరింత సులభతరం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. దీనికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలతో ఒక చర్చాపత్రం విడుదల చేసింది. సంబంధిత పార్టీలన్నీ ఈ ప్రతిపాదనలపై తమ అభిప్రాయాలను వచ్చే నెల 10వ తేదీలోగా తనకు పంపాలని కోరింది. సెబీ ప్రతిపాదనలు ఇవే..

- రైట్స్ ఇష్యూల్లో మర్చంట్ బ్యాంకర్ల అవసరాన్ని తొలగించి ఆ బాధ్యతను రిజిస్ట్రార్లు లేదా స్టాక్ ఎక్స్ఛేంజీలకు అప్పగించడం
- రైట్స్ ఇష్యూల ద్వారా సమీకరించిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ ఏజెన్సీ ఏర్పాటు
- రైట్స్ ఇష్యూ సమయానికి ఆ కంపెనీ షేర్ల ట్రేడింగ్‌పై నిషేధం ఉంటే రైట్స్ ఇష్యూని అనుమతించకూడదు.
- లెటర్ ఆఫ్ ఆఫర్‌లో రైట్స్ ఇష్యూకి సంబంధించిన వివరాలు మాత్రమే వెల్లడించేలా నిబంధనల హేతుబద్ధీకరణ
- కంపెనీల బోర్డు ఆమోదించిన తర్వాత రైట్స్ ఇష్యూల గడువును టీ+20 వర్కింగ్ డేస్‌కు కుదించడం
- రైట్స్ ఇష్యూకి వచ్చిన దరఖాస్తుల వ్యాలిడిటీ, షేర్ల కేటాయింపు ప్రాతిపదికను నిర్ణయించే విషయం రిజిస్ట్రార్లతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీ సంస్థలకు అప్పగించడం

ఒక్కో షేరుకు రూ.19 డివిడెండ్

హిందుస్థాన్ జింక్

వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్) మరోసారి వాటాదారులకు తీపి కబురు చెప్పింది. ఒక్కో షేరుకు రూ.19 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రూ.2 ముఖ విలువతో కూడిన హెచ్‌జెడ్‌ఎల్ ఈక్విటీ షేర్లపై ఇది 950 శాతానికి సమానం. మంగళవారం జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్‌జెడ్‌ఎల్ మధ్యంతర డివిడెండ్ ప్రకటించడం ఇది రెండోసారి. ఈ డివిడెండ్ చెల్లింపునకు మొత్తం రూ.8,028.11 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కాగా సెరెంటికా రెన్యువబుల్స్ నుంచి 180 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా ప్రారంభమైందని తెలిపింది.

10 లక్షల టన్నుల హెచ్‌ఆర్ కాయిల్స్ ఉత్పత్తి

ఎన్‌ఎండీసీ స్టీల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌ఎండీసీ అనుబంధ సంస్థ ఎన్‌ఎండీసీ స్టీల్ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోంది. మంగళవారానికి 10 లక్షల టన్నుల హెచ్‌ఆర్ కాయిల్స్ ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించింది. కంపెనీలో హెచ్‌ఆర్ కాయిల్స్ ఉత్పత్తి ప్రారంభించి ఏడాది పూర్తి కావడానికి నాలుగు రోజుల ముందే ఎన్‌ఎండీసీ స్టీల్ ఈ రికార్డు సృష్టించడం విశేషం. రూ.22,900 కోట్ల పెట్టుబడితో ఎన్‌ఎండీసీ ఈ ప్లాంట్ ఏర్పాటు చేసింది.

రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేసే దమ్ముందా?

కేటీఆర్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలి: మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 20: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు ఏర్పాటు చేస్తామంటే.. కూలుస్తామని మాట్లాడుతున్న కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలన్నారు. మంగళవారం హుస్నాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేటీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయే కానీ, బీఆర్ఎస్ పదేళ్లలో రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు.

కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమా?

» కవులు, కళాకారులకు పలు ప్రశ్నలతో తెలంగాణ జేఏసీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టొద్దని లేఖ రాసిన కవులు, కళాకారులకు పలు ప్రశ్నలు సంధిస్తూ తెలంగాణ జేఏసీ మంగళవారం లేఖ రాసింది. మేధావులుగా భావించి తిరిగే వారికి తెలంగాణ ప్రయోజనాలు కంటే కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమా అని జేఏసీ చైర్మన్ ఇటికాల పురుషోత్తం లేఖ ద్వారా ప్రశ్నించారు. పదేళ్లపాటు తెలంగాణ ధ్వంసమయితే ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ఎందుకు నోరు మెదపలేకపోయారని, ఉద్యమకాలంలో ఉపయోగించిన టీజీని టీఎస్‌గా మార్చినా, రాష్ట్ర గీతం పెట్టకపోయినా, గద్దర్‌ను గంటల తరబడి ప్రగతిభవన్ వద్ద నిలబెట్టినా.. ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఇన్ని రోజులూ పదవుల కోసం పెదవులు మూసుకున్న మేధావులకు ఇప్పుడే జ్ఞానోదయం అయిందా అని నిలదీశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని కూల్చివేస్తానంటూ కేటీఆర్ విద్రోహశక్తిలా మాట్లాడుతున్నారని జేఏసీ చైర్మన్ లేఖలో పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ పాటించేలా చూస్తాం

» ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగకు భట్టి భరోసా

ఉద్యోగ పోటీ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసే సందర్భంలో సంబంధిత అధికారులు 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'ను పాటించేలా చూస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఇతర నేతలు ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎంను కలిసి రిజర్వేషన్ల నియమాలను అధికారులు పాటించడం లేదని వివరించారు. రిజర్వేషన్‌ను పాటించేలా అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించేలా చూస్తామని డిప్యూటీ సీఎం వారికి భరోసా ఇచ్చారు.

రుణమాఫీపై ఏది నిజం?

» పూర్తయిందంటూ సీఎం డబ్బా

» పొంగులేటి, ఉత్తమ్ కాలేదంటున్నారు: హరీశ్ రావు

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తిచేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు డబ్బా కొడుతుంటే.. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో మాఫీ కాలేదంటూ పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మొన్న ఖమ్మం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.18వేల కోట్లతో రుణమాఫీ పూర్తి చేసినట్లు ప్రకటిస్తే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణ మాఫీ పూర్తికాలేదని, ఇంకా రూ.12 వేలకోట్లు చేయాలని చెప్పారు. మరోమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంకా 17లక్షలమంది రైతులకు మాఫీ కాలేదంటున్నారు. మంగళవారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.31వేల కోట్లు రుణమాఫీ చేసినట్లు ప్రకటించారు. ఇందులో ఏది నిజం.. ఎవరి మాటలు నమ్మాలో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తికాలేదన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి ఒప్పుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, అమెరికాకు చెందిన స్వచ్ఛ్ బయో కంపెనీతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఈడీకి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని ఈడీ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ ఆయన వ్యాపారానికి లబ్ధి చేకూర్చుకునేందుకు సోదరుడితో కలిసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేవలం 15 రోజుల ముందు స్వచ్ఛ్ బయో కంపెనీ రిజిస్టర్ అయిందన్నారు. ఇది క్విడ్ ప్రోకోలో భాగమని ఆరోపించారు. జూబ్లీహిల్స్ అడ్రస్‌తో కంపెనీని రిజిస్ట్రేషన్ చేశారని, అమెరికాలో ఆ కంపెనీని ప్రకటించడం వెనక ఉద్దేశం ఏంటని, అందులో విదేశీ నిధుల ప్రమేయం ఉందా? మనీలాండరింగ్‌తో ఏదైనా సంబంధం ఉందా? అని అనుమానాలు వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌పై పీఎస్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు

పంజాగుట్ట, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితరులు పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌కు మంగళవారం రాత్రి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలో మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు.

ట్రైబ్యునల్ పంచేదాకా సీతారామకు అనుమతులొద్దు

» గోదావరి బోర్డులో ఏపీ వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాల పంపిణీ కోసం కొత్తగా ట్రైబ్యునల్ వేసి, నీటి పంపిణీ చేపట్టే దాకా తెలంగాణ దాఖలు చేసిన ఏ డీపీఆర్‌కు, ముఖ్యంగా సీతారామ ఎత్తిపోతల పథకానికి అనుమతి ఇవ్వరాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నదీ యాజమాన్య బోర్డును కోరింది. నీటి పంపిణీ కోసం ట్రైబ్యునల్ వేయాలని కేంద్రాన్ని కోరామని, ట్రైబ్యునల్ నీటిని పంచేదాకా డీపీఆర్‌లను పక్కనపెట్టాలని విజ్ఞప్తి చేసింది. మంగళవారం గోదావరి బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో అన్ని పరిశీలనలు పూర్తి చేసుకున్న సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుపై చర్చించడానికి వీలుగా ఈ భేటీ నిర్వహించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌పై ఆంధ్రప్రదేశ్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. తెలంగాణ నుంచి నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈఎన్‌సీ(జనరల్) వెంకటేశ్వరరావు, మరో ఇద్దరు అధికారులు హాజరయ్యారు. గోదావరి జలాలను 968 టీఎంసీలు తెలంగాణ, 531 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ వాడుకోవడానికి రెండు రాష్ట్రాల మధ్య అంగీకారం ఉందని, సీడబ్ల్యూసీలోని అన్ని విభాగాలు క్లియరెన్స్ ఇచ్చినందున డీపీఆర్‌ను తదుపరి అనుమతి కోసం సాంకేతిక సలహా కమిటీకి పంపాలని తెలంగాణ కోరింది. దీనికి ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపింది. గోదావరి జలాల పంపిణీ కోసం ఇప్పటిదాకా ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పింది. ఎగువన ఉన్న తెలంగాణ ప్రాజెక్టులు కట్టుకుంటే దిగువన ఏపీకి ఇబ్బందులువస్తాయని తెలిపింది. 2021 జూలై 15న ప్రాజెక్టులపై కేంద్రం గెజిట్ జారీ చేసిందని, ఆ గెజిట్ ప్రకారం అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్‌లను ఆర్నెల్లలోపు సమర్పించి, వాటికి అనుమతి తీసుకోవాల్సి ఉందని, గెజిట్ ప్రకారం డీపీఆర్‌లను దాఖలు చేయడం జరిగిందని, ఏపీ అభ్యంతరాలు ఏమన్నా ఉంటే వాటిని కూడా జతచేసి, డీపీఆర్ తదుపరి పరిశీలన కోసం సాంకేతిక సలహా కమిటీకి పంపాలని తెలంగాణ కోరింది.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీలు కోదండరాం, అమెర్‌అలీఖాన్

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన కోదండరాం, అమెర్ అలీఖాన్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలోని ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు వారు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నారు.

కవిత కోసం కాంగ్రెస్-బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

» ఢిల్లీ పెద్దలతో కేసీఆర్ మంతనాలు

» 70% రుణమాఫీ కాలేదు: సంజయ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇప్పించడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకుని ఒక్కటవుతున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కవిత బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన అభిషేక్ సింఘ్వీని ఇప్పుడు రాజ్యసభకు పోటీ చేయిస్తున్నదే కేసీఆర్ అని ఆరోపించారు. కూతురి బెయిల్ కోసం కేసీఆర్ ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారన్నాని చెప్పారు. వారికి కావాల్సినంత ముట్టజెప్పుతున్నారని.. దీంతో ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం వంటి కేసులన్నింటి నుంచి కేసీఆర్‌కు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటీలోని రావిరాలలో మంగళవారం జరిగిన సూర్యగిరి ఎల్లమ్మ బోనాల వేడుకలకు సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మరోవైపు, కరీంనగర్‌లోనూ సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని బీజేపీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని.. అందులో భాగంగానే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ అంతా బోగస్ అని, ప్రభుత్వం దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 70% మంది రైతులకు రుణమాఫీ కాలేదని సంజయ్ అన్నారు.

సీఎం పీఠంపై పొంగులేటి కన్ను: ఏలేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎం పీఠంపై కన్నేశారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.



ఇతర పార్టీల ఎమ్మెల్యేల కొనుగోలులో, రూ.వేల కోట్ల కాంట్రాక్టుల్లో ముందంజలో ఉన్న ఆయన.. ఇంకా పెద్ద పదవి(సీఎం)పై కన్నేసినట్లుగా అనిపిస్తోందన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర మంత్రి ఒకరు తనతో చెప్పారని ఏలేటి పేర్కొన్నారు. మంగళవారం బీజేఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాగా, హెచ్ఎండీఏ పరిధిలో గత 30 ఏళ్లలో జరిగిన అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఇళ్ల అనుమతుల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం మానేసి హైడ్రా పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏంటని నిలదీశారు. రైతు రుణమాఫీ ఓ నంబర్ గేమ్ అని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో, బొంరాస్‌పేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై సర్కారు శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జులుగా రాంమాధవ్, కిషన్‌రెడ్డి

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జులుగా పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా నియమించారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

అడ్డగోలుగా ఎన్‌వోసీలు!

నీటిపారుదల శాఖ పరిధి కాకపోయినా జారీ.. కలెక్టర్లకు తెలియకుండానే ఇచ్చిన అధికారులు!

» ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు అనుమతులపై హైడ్రా ఆరా

» రెవెన్యూ అధికారులతో హైడ్రా కమిషనర్ భేటీ

» ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఎన్‌వోసీల వివరాల సేకరణ

» నిర్మాణదారులు, అధికారుల్లో కలవరం!



గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జలవనరుల సమీపంలో వెలసిన అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా.. దీనిపై మరింత లోతుగా వెళుతోంది. జలవనరులు కనుమరుగవకుండా సంరక్షించాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడటంపై రెవెన్యూ శాఖ నుంచి వివరాలు సేకరిస్తోంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ మంగళవారం రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఎఫ్‌టీఎల్‌పై ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలేంటి? నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీల) జారీలో రెవెన్యూ పాత్ర ఎంత ఉందనేదానిపై ఆరా తీశారు. ఎఫ్‌టీఎల్ విషయంలో గత ఐదేళ్లలో జరిగిన తప్పిదాలకు నీటి పారుదల శాఖ బాధ్యత ఎంత ఉంది? రెవెన్యూ శాఖ పాత్ర ఏంటి? అనే విషయాలను తెలుసుకున్నారు. చెరువులు, నాలాలు, కుంటలను ఆక్రమించి నిర్మించిన భవనాలకు ఏ నిబంధనల ప్రకారం నీటిపారుదల శాఖ అనుమతి ఇచ్చింది, ఇందులో కలెక్టర్ల పాత్ర ఎంత ఉంది, అసలు కలెక్టర్లకు తెలియకుండా నీటి పారుదల శాఖ అధికారులే అన్నీ తామై ఎఫ్‌టీఎల్‌పై నిరభ్యంతర పత్రాలు ఇవ్వడం చట్టబద్ధమేనా? అనే కోణంలో రెవెన్యూ అధికారులతో ఆయన చర్చించినట్లు తెలిసింది. కాగా, దీనిపై కలెక్టర్‌కే పూర్తి హక్కులున్నాయని అధికారులు వివరించినట్లు సమాచారం. ఇక ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి తొలుత (2012 ఏప్రిల్ 7న) విడుదలైన జీవో 168 ఏం చెప్పింది, ఆ తరువాత నీటి పారుదల శాఖ విడుదల చేసిన మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయనే అంశంపైనా రెవెన్యూ ఉన్నతాధికారులతో హైడ్రా కమిషనర్ చర్చించినట్లు తెలిసింది. వీటితో పాటు వాల్టా చట్టం, జాతీయ హరిత ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు, కోర్టు కేసుల సమయంలో ప్రభుత్వం చేసిన పలు సవరణల పైనా చర్చించినట్లు సమాచారం.

ఉమ్మడి ఏపీలో 168 జీవో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. నదులు, కాలువలు, చెరువులు, కుంటల సమీపంలో నిర్మాణాలపై కొన్ని ఆంక్షలు విధిస్తూ జీవో 168ను జారీ చేసింది. జలవనరుల సమీపంలో రీక్రియేషన్ కార్యక్రమాలు, గ్రీన్ బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి భవనాల నిర్మాణం చేపట్టకూడదని జీవోలో పేర్కొంది. ఈ మేరకు నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, హెచ్ఎండీఏ, యూడీఏ పరిధిలో నదులు, చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్‌ను ఎలా లెక్కించాలనే దానిపై స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. కానీ, నీటి పారుదల శాఖ అధికారులు వాటిని బహిర్గతం కానివ్వలేదని, తమకు తోచినట్లు చెరువులు, కుంటలను కుదించి ఎఫ్‌టీఎల్ అనుమతులు జారీ చేశారని హైడ్రా గుర్తించింది. వాస్తవానికి ఎఫ్‌టీఎల్ మీద తహసీల్దారు, సర్వేయర్, నీటిపారుదల శాఖ ఏఈ.. మునిసిపల్, అటవీ శాఖ సిబ్బంది నేతృత్వంలో క్షేత్రస్థాయి పర్యటన తరువాత నివేదిక మాత్రమే ఇవ్వాలి. కానీ, ఏకంగా ఎన్‌వోసీలు జారీ చేస్తూ వచ్చారు. దీంతో ఇక్కడే అవకతవకలు జరిగాయన్న అనుమానాలు ఉన్నాయి. ఈ మేరకు ఇప్పటివరకు ఇరిగేషన్ అధికారులు ఎన్ని ఎన్‌వోసీలు జారీ చేశారనే లెక్కలను హైడ్రా అధికారులు సేకరిస్తున్నారు.

రికార్డుల్లోనే కనిపిస్తున్న చెరువులు..

హైదరాబాద్ పరిధిలో 28 చెరువులు, రంగారెడ్డి జిల్లాలో 1078, మేడ్చల్‌లో 620, మెదక్‌లో 589, సంగారెడ్డిలో 603, సిద్దిపేటలో 347, యాదాద్రి జిల్లాలో 267 చెరువులు కలిపి మొత్తం 3,532 చెరువులు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ, వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పుడు మిగిలిన చెరువులు 185 మాత్రమేనని, ఓఆర్ఆర్ లోపల 404 చెరువులు ఉన్నాయని పురపాలక శాఖ అధికారుల సమాచారం. ఈ లెక్కలపై హైడ్రా దృష్టి సారించడంతో నిర్మాణదారులు, అధికారుల్లో కలవరం మొదలైంది.

కవితకు మళ్లీ నిరాశే

» బెయిల్ పిటిషన్ విచారణను 27కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మళ్లీ నిరాశే మిగిలింది. ఆమె బెయిలు పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, విక్రమ్ చౌదరి, ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, జోహెబ్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ కేసులో సీబీఐ కౌంటర్ అఫిడవిట్ ఇప్పటికే సమర్పించామని, ఈడీ అఫిడవిట్ పురోగతిలో ఉందని ఎస్వీ రాజు తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. ఈడీ, సీబీఐ కేసులను కలిపి విచారిస్తామని గతంలోనే నిర్ణయించినా ఎందుకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదని ఈడీని అడిగింది. రాజు వాదనలు వినిపిస్తూ.. తమకు నోటీసులు ఇచ్చాక తొలిసారి కేసు ఇక్కడ విచారణకు వచ్చిందని, సవివరంగా కోర్టుకు వివరాలు అందిస్తామని తెలిపారు. కాగా, మహిళ అయిన కవితకు పీఎంఎల్ఏలోని సెక్షన్ 45 వర్తించదని, ఆమెకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ముకుల్ రోహత్గి వాదించారు. సీబీఐ కౌంటర్‌పైన అయినా విచారణ చేపట్టాలని కోరారు. అయితే రెండు కౌంటర్లపై ఒకేసారి విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. గురువారంలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. కాగా, కవిత బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు ఈడీ గడువు కోరడం పట్ల బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, బిగాల గణేష్ గుప్తా మంగళవారం సుప్రీంకోర్టుకు వచ్చారు. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 27న కవితకు బెయిల్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త కోణాలు ఉన్నాయ్

» వాటిపైనా దర్యాప్తు చేస్తున్నాం

» విదేశాల్లో ఉన్నవారిని తీసుకొస్తాం

» కౌంటర్ దాఖలు చేసిన హోం శాఖ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయని, వాటన్నింటిపై దర్యాప్తు కొనసాగిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. తప్పించుకొని తిరుగుతూ విదేశాల్లో ఉంటున్న నిందితులను పట్టుకుంటామని పేర్కొంది. నిందితులు తమ వ్యక్తిగత ఎజెండాలను అమలు చేసుకోవడంతో పాటు, అప్పటి అధికార పార్టీ అయిన బీఆర్ఎస్‌కు సహాయం చేయడానికి ఈ అక్రమాలకు పాల్పడినట్లు తెలిపింది. వీటన్నంటి సమాచారంతో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తామని పేర్కొంది. న్యాయమూర్తుల ఫోన్‌లను సైతం ట్యాపింగ్ చేశారంటూ పత్రికల్లో కథనాలు రావడంతో ఈ అంశంపై హైకోర్టు సుమోటోగా విచారణ జరుపుతోంది. మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి. వినోద్‌కుమార్‌ల ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఇప్పటికే ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కౌంటర్ దాఖలు చేయగా తాజాగా హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్త కౌంటర్ దాఖలు చేశారు. "ఫోన్‌ట్యాపింగ్ కేసు ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదిని దెబ్బతీసేలా జరిగిన తీవ్రనేరం. ఈ నేరంలో ప్రమేయం ఉన్న సీనియర్ పోలీస్ అధికారులను కూడా వదిలిపెట్టకుండా చట్ట ప్రకారం విచారణ కొనసాగిస్తున్నాం. ట్రయల్ కోర్టులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశాం. ఏ-1 ప్రభాకర్ రావు సహా నిందితులందరూ తమ వ్యక్తిగత ఎజెండాలను అమలు చేయడంతోపాటు అప్పటి అధికారపార్టీ బీఆర్ఎస్ లక్ష్యాలను సాధించడానికి పనిచేశారు. ట్యాపింగ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు గుర్తింపుపొందిన అధికారిగా ఉన్న ప్రభాకర్‌రావు వామపక్ష తీవ్రవాదంపై నిఘా అన్న సాకుతో ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారం వ్యవహరించారు. తప్పుడు సమాచారంతో అనుమతులు పొందారు. హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేశారు. ఏ-1 ప్రభాకర్ రావు, ఏ-6 శ్రవణ్‌కుమార్ రావులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏ2 ప్రణీత్‌రావు అధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేశారు. బీఆర్ఎస్‌కు సహాయం చేయడం కోసం టి. ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులు తమ చట్టబద్ధమైన విధులను ఉల్లంఘించడంతోపాటు ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించడం, మోసాలకు పాల్పడటం ద్వారా అనుమతులు పొందడం వంటి క్రిమినల్ చర్యలకు పాల్పడ్డారు" అని ఆ కౌంటర్‌లో వివరించారు.

మాతో సంప్రదింపులు జరపలేదు: కేంద్రం

కేంద్ర ప్రభుత్వం కూడా కౌంటర్ సమర్పించింది. టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం చట్టబద్ధంగా ఇంటర్‌సెప్షన్ ఆదేశాలు ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన అధికారాలున్నాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని, కేసు దర్యాప్తుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం ఇప్పటివరకు అందలేదని పేర్కొంది. తదుపరి విచారణ సెప్టెంబర్ 8కి వాయిదా పడింది.

బీసీ కోటాకు మధ్యేమార్గం!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. కాగా, బీసీ కుల గణన చేసి, రిజర్వేషన్లను అమలు చేసేందుకు కొన్ని పీటముడులున్నాయి. బీసీ ఓటర్ల గణన చేస్తే రెండు నెలల్లో కసరత్తు పూర్తి చేయొచ్చు. కులాలవారీ గణనకు కనీసం ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏడాది చివరికల్లా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలనుకుంటోంది. ఆలస్యమైతే ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు సమస్య వస్తుంది. ప్రత్యేకాధికారుల పాలన వల్ల గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతాయి. అయితే, కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ పలుసార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ అమలు ఎలాగనే చర్చ విస్తృతంగా సాగుతోంది.

బీసీ ఓటర్ల గణన ఒక మార్గం..

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. దానిప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు కుల గణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లను 23 నుంచి 42 శాతానికి పెంచుతామని పేర్కొంది. కాగా, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే, అవి కోర్టులో నిలవవని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కాగా, బిహార్ ప్రభుత్వం రెండేళ్ల కిందట బీసీలకు 54 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు జరపాలనుకుంది. దీనిని పాట్నా హైకోర్టు తప్పుబట్టి.. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని స్పష్టం చేసింది. చివరకు 50 శాతానికి పరిమితమై ఎన్నికలు నిర్వహించిన సంగతిని ఉదహరిస్తున్నారు. తెలంగాణలో కూడా ప్రస్తుతానికి బీసీ ఓటర్ల జాబితా తయారుచేసి.. దాని ప్రకారం రాజ్యాంగం నిర్ణయించిన పరిమితి లోబడి ఎన్నికలు నిర్వహించడమే ఉత్తమమని చెబుతున్నారు. బీసీ ఓటర్ల శాతం నిర్ధారణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రామాణిక ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం తెప్పించుకోవాలి. దాని ఆధారంగా సర్వే చేసి ఓటర్ల జాబితాను బీసీ కమిషన్‌కు అందజేయాలి. కమిషన్ ఆ జాబితా మేరకు బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలో నిర్ణయిస్తుంది. సుప్రీం తీర్పు ప్రకారం పూర్తిస్థాయి ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ నిర్ణయించిన రిజర్వేషన్లు మాత్రమే చెల్లుతాయి. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయిస్తే చెల్లుబాటు కావని, రాజ్యాంగం ప్రకారం ఎస్సీ ఎస్టీలకు ఇచ్చే రిజర్వేషన్లు మినహా మిగతావన్నీ జనరల్ విభాగం కిందకే వస్తాయని అంటున్నారు. బీసీ కమిషన్ బీసీలకు రిజర్వేషన్ నిర్ధారించేటపుడు ఎస్సీ, ఎస్టీల కోటా పోను మిగతా శాతాన్ని కలుపుకుంటే 50 శాతం వింఛొద్దనే నిబంధన ఉంది. ఈ ప్రకారం ఎన్నికలకు వెళ్తే మొత్తం వ్యవహారాన్ని రెండు నెలల్లో పూర్తి చేయొచ్చని చెబుతున్నారు. ఆ వెంటనే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. ఈ పద్ధతిలో కులగణన చేసినా సుప్రీం నిర్దేశించిన ట్రిపుల్ టి నిబంధన పాటించినట్లే అవుతుంది.

కులాల వారీ గణనకు ఎక్కువ సమయం

బీసీ ఓటర్ల సర్వేకు బదులు కులాల వారీగా సర్వే చేయాలనుకుంటే.. చాలా సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సర్వేలో బీసీలే కాకుండా అన్ని కులాల వారి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దాంతోనే అసలు లెక్కలు తేలుతాయని బీసీ సంఘాల డిమాండ్‌గా ఉంది. న్యాయ చిక్కులు లేకుండా ఈ పద్ధతిలో వ్యవహారాన్ని పూర్తి చేయాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. జనాభా లెక్కల అధికారుల పర్యవేక్షణలో సుశిక్షితులైన ఎన్యుమరేటర్లతో సర్వే చేయించాల్సి ఉంటుంది. సాధారణంగా ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది ఎన్యుమరేటర్లుగా ఉంటారు. ఇతర సిబ్బందికి సర్వేలో తగినంత అనుభవం ఉండదు. సెలవుల్లో తప్ప సాధారణ రోజుల్లో సర్వే సాధ్యమా అన్న సందేహం వ్యక్తం అవుతోంది. ఈ సర్వే అన్ని కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో ఉన్న అసమానతలను అంచనా వేస్తుంది. వచ్చిన డేటాను పూర్తిగా విశ్లేషించి, ఒక నిర్ధారణకు వచ్చి సమగ్ర నివేదికను ప్రకటించాలంటే సమయం పడుతుంది. డేటాను క్షేత్ర స్థాయిలో పరిశీలించుకోవాల్సి ఉంటుంది. యుద్ధప్రాతిపదికన చేసినా 6 నెలలు పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ రెండు పద్ధతుల్లో దేన్ని చేపట్టినా 50 శాతం పరిమితి ఉండనే ఉంది. అందుకే ఏ పద్ధతిలో సర్వే చేసినా ప్రస్తుతానికి 23 శాతం అమలు పరుస్తూ మిగిలిన 19 శాతాన్ని పార్టీపరంగా కేటాయించడం మంచిదని సర్కారు భావిస్తోంది.

డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీపై 5 వేల అభ్యంతరాలు!

ముగిసిన గడువు.. వారంలో తుది కీ

వచ్చే నెల మొదటి వారంలో ఫలితాలు

18 ప్రశ్నలు పునరావృతం.. అభ్యర్థులకు నష్టం లేదంటున్న అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీపై సుమారు 5వేల అభ్యంతరాలు నమోదయ్యాయి. వీటిని నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం తుది కీని విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ కోసం గత నెల 18 నుంచి ఈ నెల 5వ తేదీల మధ్య డీఎస్సీ పరీక్షలను నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన ప్రాథమిక కీని విడుదల చేసి, అభ్యంతరాలను 20వ తేదీ వరకు స్వీకరించారు. కాగా వారం రోజుల్లో ఈ తుది కీ ప్రకటించి.. సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాలను వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా నియామక ప్రక్రియను అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. కాగా, డీఎస్సీ పరీక్షల నిర్వహణలో కొన్ని పొరపాట్లు దొర్లినట్టు తాజాగా వెలుగులోకొచ్చింది. ముఖ్యంగా ఎస్జీటీ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలో కొన్ని ప్రశ్నలు పునరావృత మయ్యాయి. జూలై 19న నిర్వహించిన పరీక్షల్లో సాంఘిక శాస్త్రానికి సంబంధించి 18 ప్రశ్నలు తిరిగి 23వ తేదీన నిర్వహించిన పరీక్షలోనూ వచ్చాయి. జూలై 30న జరిగిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలో ఆరు ప్రశ్నల్లో కొన్ని పొరపాట్లు దొర్లాయి. ఈ ప్రశ్నలకు కీలో ఇంగ్లిష్ మీడియంలో ఒక మాదిరి జవాబులు, తెలుగు మీడియంలో మరో మాదిరి జవాబులు ఇవ్వడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. కాగా డీఎస్సీ పరీక్షల్లో కొన్ని ప్రశ్నలు పునరావృతమైన విషయం వాస్తవమేనని, వాటి వల్ల అభ్యర్థులకు ఇబ్బంది ఉండదని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. డీఎస్సీ పరీక్షల కోసం మొత్తం 18 సెట్లను రూపొందించామని, ఏలాంటి పొరపాట్లు లేకుండా వీటిని పూర్తి చేసినట్లు చెప్పారు. పేపర్ లీకైనట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, దీనిపై ఎలాంటి ఫిర్యాదులు కూడా రాలేదన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్సు తీసుకురావాలి

మాజీమంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు



బేగంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దేశానికి 1947 ఆగస్టులో స్వాతంత్ర్యం వస్తే మాదిగలకు 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు ద్వారా స్వాతంత్ర్యం వచ్చిందని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. అమీర్‌పేట లీలానగర్‌లోని తన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలన్నారు. వర్గీకరణను అమలు చేస్తే తెలంగాణలోని మాదిగలందరూ రేవంత్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే స్పందించిన సీఎం ఎస్సీ వర్గీకరణ అమలుకు కృషి చేస్తానని చెప్పడంతో పాటు అవసరమైతే గ్రూప్ 1, 2 ఉద్యోగ నియామకాల్లో అమలుకు ఆర్డినెన్సు తెస్తానని చెప్పినందుకు మాదిగల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన సీజేఐ చంద్రచూడ్, ఇతర న్యాయమూర్తులకు మాదిగల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



భట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు

విద్యుత్ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించాలి

» ఆర్థికంగా ఇబ్బందులున్నా పదోన్నతులిచ్చాం: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించాలని, ఇందుకోసం ఉద్యోగులు బాధ్యతగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఉద్యోగుల ప్రయోజనం, సంక్షేమం కోణంలో పదోన్నతులు ఇచ్చామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రిని ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్) పరిధిలో పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు ఏడేళ్ల తర్వాత పదోన్నతులు ఇవ్వడంపై విద్యుత్ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా విద్యుత్ రంగ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, వాటిని తిరిగి లాభాల్లోకి తీసుకురావడానికి అందరం సమష్టిగా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాణవాయువులాంటిదే విద్యుత్ అని, రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చూడాలని ఉద్యోగులను కోరారు. కాగా, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ నివాళి అర్పించారు.

ధరణి దరఖాస్తులను.. పది రోజుల్లో పరిష్కరించండి:పొంగులేటి



హైదరాబాద్/ఖమ్మం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ధరణి సమస్యలపై గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులతోపాటు ఇటీవలి కాలంలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. దరఖాస్తులను తిరస్కరిస్తే సహేతుకమైన కారణాలు చూపాలని స్పష్టం చేశారు. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ధరణి పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్నాయని, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ దృష్టిసారించాలని ఆదేశించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి పొంగులేటి, సచివాలయం నుంచి సీఎస్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న కొత్త ఆర్వోఆర్-2024 ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ, చర్చ విస్తృతంగా జరగాలని.. ఇందు కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ఆయా జిల్లాల్లో మేధావులతో వర్క్‌షాప్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిశీలనను మూడు నెలల్లో పూర్తిచేయాలని చెప్పారు. ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద తొలుత వంద దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. అందులో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పోచారం

» డెయిరీ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పరిగె(పోచారం) శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ రంగ సలహాదారు(క్యాబినెట్ హోదా)గా నియమితులయ్యారు. అలాగే, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అమిత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సభ్యుడిగా ప్రభుత్వం చేరుస్తూ సర్కారు ఉత్తర్వులిచ్చింది.

ఎల్ఆర్ఎస్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

మున్సిపల్ శాఖ జారీ చేసిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. భూమి విలువ ఆధారంగా రెగ్యులరైజేషన్ చార్జీలు వసూలు చేసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ప్రాసెస్ చేస్తామని, అప్లికేషన్లను పరిష్కరిస్తామని పేర్కొంటూ మున్సిపల్ శాఖ జూలై 30న జారీచేసిన మెమోను సవాల్ చేస్తూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన జువ్వాడి సాగర్ రావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడం తెలంగాణ అర్బన్ ఏరియాస్ డెవలప్‌మెంట్ యాక్ట్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ యాక్ట్, తెలంగాణ టౌన్‌ప్లానింగ్ యాక్ట్ తదితర చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావుల ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

వైద్య కళాశాలల నుంచి టీవీవీపీ వైద్యుల బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):నూతన వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో పనిచేస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) డాక్టర్లను అక్కడి నుంచి బదిలీ చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏ జిల్లాలోని డాక్టర్లను, అదే జిల్లాలోని ఆస్పత్రుల్లో సర్దుబాటు చేయనున్నారు. ఈ బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించారు.

దేశంలోనే తొలి సైబర్‌క్రైం బ్యూరో తెలంగాణలో

» డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 : దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో సైబర్‌క్రైం బ్యూరోను ఏర్పాటు చేసి ఆ నేరాల కట్టడికి చర్యలు చేపట్టామని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో మంగళవారం కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పోలీసు అధికారులతో ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న 85 కోట్ల రూపాయలను రికవరీ చేసి తిరిగి ఇప్పించామన్నారు. తెలంగాణలో గంజాయి పంట సాగు లేదని, ఏవోబీ నుంచి రాష్ట్రానికి గంజాయి రవాణా అవుతోందని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదని, వారు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారని తెలిపారు.

రుణ మాఫీతో రేవంత్ సరికొత్త చరిత్ర

» రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

» సీఎంను కలిసిన నీలం మధు ముదిరాజ్



పటాన్‌చెరు, ఆగస్టు 20: రైతులకు రుణ విముక్తి కల్పించి సీఎం రేవంత్‌రెడ్డి సరి కొత్త చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసిన మధు.. రైతుల పక్షాన రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని మధు పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి యావత్ రైతాంగం కృతజ్ఞతలు తెలుపుతోందని చెప్పారు. ఇక, పటాన్‌చెరు వరకు మెట్రో రైలును విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

మాఫీ తర్వాత రైతులకు మీరిచ్చింది 7,500 కోట్లే!

» మేం రూ.18 వేల కోట్లు జమ చేశాం

» కొత్త రుణాలివ్వడంలో జాప్యమేల?

» బ్యాంకర్లపై డిప్యూటీ సీఎం అసంతృప్తి

» బ్యాంకర్ల సమావేశంలో సూచనలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రుణమాఫీ పూర్తయిన రైతులకు వెంటనే పంట రుణాలు అందజేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బ్యాంకర్లకు సూచించారు. రుణమాఫీ పథకం కింద ప్రభుత్వం రూ.18 వేల కోట్లను బ్యాంకులకు జమ చేస్తే.. ఇప్పటి వరకు రైతులకు మాఫీ తర్వాత కొత్తగా ఇచ్చిన పంట రుణాలు మాత్రం రూ.7,500 కోట్లేనని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త రుణాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, ఇది సరి కాదని అన్నారు. రుణాల అందజేతలో వేగం పెంచాలని చెప్పారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లెక్కలు చెప్పడం కాదని, రుణాల అందజేతలో బ్యాంకర్లు మానవీయ కోణంలో వ్యవహరించాలని సూచించారు. రుణాల అందజేతలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని, రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నామని, ఇలాంటి చర్యలన్నీ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేస్తాయని వివరించారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని ప్రభుత్వం మరో ప్రాధాన్య అంశంగా పరిగణిస్తుందన్నారు. నవీన విధానాలతో ముందుకు వెళుతున్నామని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటించి రూ.36 వేల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నారని చెప్పారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని, అలాంటి పరిశ్రమల వారికి విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లకు సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అలాంటి సంఘాలకు కూడా సహకరించి పారిశ్రామికాభివృద్ధికి దోహదపడాలని చెప్పారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను సాధించడానికి బ్యాంకర్లు కృషి చేయాలని కోరారు. కాగా, ప్రస్తుత ఖరీఫ్ త్రైమాసికంలో ఇప్పటివరకు రూ.17,300 కోట్ల కొత్త రుణాలిచ్చామని బ్యాంకర్లు తెలిపారు.

తప్పులు సరిదిద్దండి: తుమ్మల

రైతుల రుణ ఖాతాల్లో ఉండే తప్పులను సరిదిద్దడానికి బ్యాంకర్లు చొరవ తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు కింది స్థాయిలో పనిచేసే బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి, రుణమాఫీని సంపూర్ణం చేయడానికి సహకరించాలన్నారు. ఈసారి పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయని, అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని ఆశిస్తున్నామని చెప్పారు. మూడు నెలలకోసారి బ్యాంకర్ల సదస్సులను నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదని, రైతులకు రుణాలిస్తేనే సార్థకత ఉంటుందన్నారు. రైతులు, ఇతర లక్షిత వర్గాలకు ఆర్థిక ఫలాలు అందేట్లు చూడాలని చెప్పారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని పదేళ్లలో పెట్టలేదేం?

(మొదటి పేజీ తరువాయి)



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ప్రకటించారు. మంగళవారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సోమాజిగూడలోని ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో 'రాజీవ్ సద్భావన రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, "ఒకాయన మళ్లీ అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తానంటున్నడు! ఎవడైనా చేతనైతే వచ్చి విగ్రహం మీద చెయ్యి వేయండి.. వీపు చింతపండు అవుతుంది. అధికారం పోయినా.. బలుపు తగ్గలేదు. నీ బలుపును కాంగ్రెస్ కార్యకర్తలు అణగదీస్తరు. అక్కడ మీ నాయన విగ్రహం పెట్టాలని దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తీస్తావా? కలలో కూడా నీకు అధికారం రాదు" అని కేటీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు.

యువతకు స్ఫూర్తి రాజీవ్‌గాంధీ..

రాజీవ్‌గాంధీ దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన నేత అని, యువతకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ అన్నారు. కంప్యూటర్ విప్లవంతో కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని 19వ దశకంలోనే కంప్యూటర్‌ను, సాంకేతిక నైపుణ్యాన్ని, టెలికం రంగాన్ని పరిచయం చేసిన స్ఫూర్తిదాత అని కొనియాడారు. రాజీవ్ కుటుంబం దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి, దేశం కోసం రెండు తరాలు ప్రాణాలిచ్చిన కుటుంబమని, రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కుటుంబమని అన్నారు. సచివాలయం ముందు కోట్లాది మందికి స్ఫూర్తిగా అమరవీరుల విగ్రహం పక్కన దేశం కోసం అమరుడైన రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సముచితమన్నారు. త్వరలోనే పండుగ వాతావరణంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. "ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని, రూ.వేల కోట్లు సంపాదించుకొని, వందలాది ఎకరాల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్నవారి విగ్రహం సచివాలయం ముందు పెడతారా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన అసహనంతో విచక్షణా రహితంగా మాట్లాడితే తెలంగాణ సమాజం నుంచి బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశం ప్రభావం చూపలేకపోయిందని, దక్షిణ కొరియా లాంటి చిన్న దేశానికి 32 పతకాలు వచ్చాయని సీఎం రేవంత్ అన్నారు. దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీలాగే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తామని తెలిపారు.

4గోడల మధ్యకూర్చుంటే పెట్టుబడులు రావు

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కానీ, ఒకాయన ఇక్కడ కూర్చొని ఏదో కంపెనీతో ఎంవోయూ చేసుకొని వచ్చారంటున్నారని విమర్శించారు. "మీలాగా నాలుగు గోడల మధ్య కూర్చుంటే పెట్టుబడులు రావు. కంపెనీలతో ఎంవోయూలు చేసుకుంటేనే పెట్టుబడులు వస్తాయి. మీకు, మాకు తేడా ఇదే" అని డిప్యూటీ సీఎం అన్నారు. చెరువులు, కుంటల్లో ఆక్రమణలు తొలగించేందుకు హైడ్రాను తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇచ్చామని తెలిపారు. రూ.31 వేల కోట్లతో రైతు రుణమాఫీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు. పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయనివారు.. పది రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పిన ప్రతీ గ్యారంటీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అనిల్‌కుమార్‌యాదవ్ ఫిర్యాదు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రిని 'చీప్ మినిస్టర్' అని సంబోధిస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్టు చేశారని, అంతేకాకుండా 'ఢిల్లీ గులామ్' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ మేరకు కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సైఫాబాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనిల్‌కుమార్ యాదవ్ కోరారు.



జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా శ్రీవత్స

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండీగా సర్ఫరాజ్

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దానకిశోర్‌కు అదనపు బాధ్యతలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పూర్తిస్థాయి కమిషనర్‌గా ఆమ్రపాలి కాట నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. దీంతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న ఆమెను రెగ్యులర్ కమిషనర్‌గా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏ జేసీగా ఆమె స్థానంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ కోట శ్రీవత్సను నియమించింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్‌కు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు ఈ రెండు పోస్టుల్లో ఆమ్రపాలి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. నారాయణపేట్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మయాంక్ మిట్టల్‌ను హైదరాబాద్ వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది.

క్రైమ్.. లూజ్ లీడర్లకు సరైన మొగుడు రేవంత్‌రెడ్డే!

రాజీవ్ విగ్రహాన్ని తీసేస్తా అనేందుకు కేటీఆర్ ఎవ్వడు? .. ఇదేమైనా ఆయన అయ్య జాగీరా?

» రాజీవ్ తెచ్చిన టెక్నాలజీతోనే కదా.. కేటీఆర్ ఉద్యోగం తెచ్చుకున్నది

» బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం కలే

» కేటీఆర్‌పై తూర్పు జగ్గారెడ్డి ఫైర్

» ఐటీకి ఆద్యుడు రాజీవ్‌గాంధీనేనంటూ కేసీఆర్ మాట్లాడిన వీడియో ప్రదర్శన



హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రాజకీయాల్లో క్రైమ్.. లూజ్ లీడర్లకు సరైన మొగుడు రేవంత్‌రెడ్డేనని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తీసేస్తానని ప్రకటించేందుకు కేటీఆర్ ఎవ్వడన్నారు. తెలంగాణ ఏమైనా కేటీఆర్.. లేకుంటే ఆయన అయ్య జాగీరా అంటూ నిలదీశారు. రాజీవ్ విగ్రహాన్ని ఆయన తీసేస్తుంటే తాము చూస్తూ ఊరుకుంటామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. అయినా బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ అధికారం రావడం కలేనని, ఇంక రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం పేరు ఎలా మారుస్తారని నిలదీశారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడైనా రాజకీయ శిక్షణ కేంద్రం ఉంటే.. అందులో కేటీఆర్ శిక్షణ తీసుకుంటే మంచిదని సూచన చేశారు. ఆయనకు ఏం మాట్లాడాలో, ఎలాంటి విషయాలు మాట్లాడాలో తోచట్లేదని, పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. "దేశ ప్రజల కోసం బలిదానం అయిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ముందు పెడతామంటే తీసేస్తానంటడా? కేసీఆర్ గారూ.. మీ అబ్బాయి కేటీఆర్‌కు కొద్దిగా రాజకీయ శిక్షణను ఇప్పించండి" అని సూచించారు. కేటీఆర్ అమెరికాలో ఐటీ ఉద్యోగం చేశానంటున్నారని, ఆ ఐటీని దేశంలోకి తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనన్నారు. తెలంగాణలో ఐటీకి మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేశారన్నారు. రాజీవ్ తీసుకువచ్చిన టెక్నాలజీతో అమెరికాలో ఉద్యోగం తెచ్చుకున్న కేటీఆర్.. ఆ రాజీవ్‌గాంధీనే తిడితే ఆయన్ను ఏమనాలని ప్రశ్నించారు. "నువ్వు రాజీవ్ విగ్రహం తీసేస్తానంటే మేము చూస్తూ ఉరుకుంటామనుకుంటున్నవా? ప్రజలు మాకు అయిదేళ్లు అధికారం ఇచ్చినరు. వచ్చే నాలుగేళ్లూ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టుకునే దమ్ము, ధైర్యం నీకు లేదు. మళ్లీ అయిదేళ్లూ ప్రజలు నీకు అధికారం ఇవ్వరు. తెలంగాణలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే. నీకు నో చాన్స్!" అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిని.. చీప్ మినిస్టర్ అంటూ కేటీఆర్ సంబోధించడంపై స్పందిస్తూ.. కేటీఆర్ మాటలు చీప్ లిక్కర్ తాగినోడి మాటల లెక్కన ఉన్నాయని విమర్శించారు. సోనియా, రాహుల్‌గాంధీలకు తాము నీతిగా గులాం గిరీ చేస్తామని, కేటీఆర్ లెక్కన తాము మోసం చేసేవాళ్లం కాదన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఇంటికి కేసీఆర్ కుటుంబం మొత్తం వెళ్లి ఆమె కాళ్లమీద పడ్డారని గుర్తు చేశారు. అప్పుడు వారు కూడా గులాంగిరీ చేసినట్లేనా అని నిలదీశారు. అల్లం నారాయణ మేధావి కాదని, ఆయన కేసీఆర్‌కు బంట్రోతు అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆయన ఎప్పుడైనా జర్నలిస్టుల కష్టాలు, ఇళ్ల స్థలాల గురించి కేసీఆర్‌ను అడిగాడా అని నిలదీశారు. అల్లం నారాయణ ఓ జోకర్ అంటూ వ్యాఖ్యానించారు.

తల్లి గుండెల్లో ఉండాలి.. తెలంగాణ తల్లి విగ్రహం సచివాలయం లోపల ఉండాలి

తల్లి గుండెల్లో ఉండాలని, అందుకే తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం లోపల తాము ప్రతిష్ఠించబోతున్నామని జగ్గారెడ్డి చెప్పారు. సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం ఎందుకు పెట్టవద్దని, అదేమైనా కేటీఆర్ అయ్య జాగీరా అని ప్రశ్నించారు. "కేటీఆర్ కుస్తీకి వస్తే మేమూ సిద్ధం! రాజీవ్ విగ్రహం మీద చెయ్యి వేస్తే చెప్పుతో కొడతామంటూ సీఎం మాటలకు మద్దతు ఇస్తున్న. ప్రస్తుత రాజకీయాల్లో క్రైమ్.. లూజ్ లీడర్లకు మొగుడు రేవంత్‌రెడ్డే..!" అన్నారు. ఇదిలా ఉంటే.. ఐటీకి ఆద్యుడు రాజీవ్‌గాంధీనేనంటూ కేసీఆర్ గతంలో మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను జగ్గారెడ్డి మీడియా ముందు ప్రదర్శించారు.

మరో రియల్ బూమ్ రాబోతోంది

నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలకు అండగా ఉంటాం

హైదరాబాద్ దక్షిణంవైపూ అభివృద్ధికి ఫ్యూచర్ సిటీ

'క్రెడాయ్ స్టేట్‌కాన్'లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



క్రెడాయ్ స్టేట్‌కాన్-2024లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, క్రెడాయ్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని మరోస్థాయికి తీసుకెళుతుందని, దేశంతో కాకుండా ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతామని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. క్రెడాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం నిర్వహించి స్టేట్‌కాన్-2024ను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ తాము తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో మరో బూమ్ రాబోతోందన్నారు. నిర్మాణ రంగంలోనూ గణనీయమైన వృద్ధి కనిపిస్తోందన్నారు. ముచ్చెర్ల వద్ద ఫ్యూచర్ సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, మెట్రో రైల్ విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో పట్టణీకరణ వేగవంతంగా జరుగుతోందని, ఇప్పటికే 45 శాతం పట్టణ ప్రాంతాలుగా మారాయన్నారు. వ్యాపార వృద్ధికి తోడ్పడటానికి ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడుతూ పారదర్శక పాలన, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అందిస్తుందన్నారు. 8 నెలల్లో తమ ప్రభుత్వ పనితీరుతో రాష్ట్రంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ 'గ్లోబల్ డెస్టినేషన్'గా మారుతుందన్నారు. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చెయ్యకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హైటెక్ సిటీని చంద్రబాబు తీసుకొస్తే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట విస్తరణకు వైఎస్సార్ కారణమన్నారు. హైదరాబాద్ చుట్టూ అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఓఆర్ఆర్ నిర్మించామని, త్వరలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు పునాది వేస్తామన్నారు. హైదరాబాద్ దక్షిణంవైపు కూడా అభివృద్ధి చేసేందుకు ఫ్యూచర్ సిటీ రాబోతోందని, అహ్మదాబాద్ తరహాలో పెద్ద క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో రాజు, యువరాజులదే అధికారమని, అప్పటి మంత్రులకు అధికారం లేదన్నారు. క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీకృష్ణా రెడ్డి, అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. సీబీఆర్ఇ భాగస్వామ్యంతో 'తెలంగాణ- గోయింగ్ గ్లోబల్' నివేదికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, క్రెడాయ్ కార్యదర్శి రాంరెడ్డి, రామచంద్రారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుంచుకో.. చీ(ఫ్)ప్ మినిస్టర్

» మేం వచ్చాక సచివాలయ పరిసరాల్లో చెత్తను తొలగిస్తాం

» చిన్నపిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడతారా?

» రుణమాఫీపై ఈనెల 22న బీఆర్ఎస్ ధర్నాలు: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): "నామాటలు గుర్తుంచుకో.. చీ(ఫ్)ప్ మినిస్టర్.. మేం అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. "నీలాంటి ఢిల్లీ గులాం (బానిస) తెలంగాణ ఆత్మ గౌరవాన్ని అర్థం చేసుకోలేరు. చిన్నపిల్లల ముందు చెత్తమాటలు మాట్లాడిన రేవంత్ నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుంది. నీ మానసిక రుగ్మతనుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా" అంటూ సీఎంను ఉద్దేశించి కేటీఆర్ పేర్కొన్నారు. అదేవిధంగా సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదానికి కారణమైన సంస్థను బ్లాక్ లిస్టులో చేర్చాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదని, అదే సంస్థకు కొడంగల్ లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టును అప్పజెప్పాలని చూస్తోందని, దీనివెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అలాగే.. ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ తరపున ధర్నాలు నిర్వహించనున్నట్లు కేటీఆర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 9లోపు రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మాట తప్పారని, ఇప్పుడు అడ్డగోలు ఆంక్షలు పెట్టి 40% మంది రైతులకు మాఫీ చేయకుండా ఎగ్గొట్టారన్నారు. లక్షలాది మంది రైతన్నలకు అండగా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే.. మరోవైపు మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని చెబుతున్నారన్నారు. రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

గ్రూప్ 1 స్పోర్ట్స్ కోటాలో ఇద్దరే అభ్యర్థులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 మెయిన్స్‌కు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు టీజీపీఎస్సీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రూపు-1 పోస్టుల భర్తీలో భాగంగా ఇప్పటికే ప్రిలిమనరీ పరీక్ష పూర్తైంది. మెయిన్స్‌కు ఒక పోస్టుకు 50 మంది చొప్పున మెరిట్ జాబితాను విడుదల చేశారు. గ్రూప్ 1కు స్పోర్ట్స్ కోటా కింద 36 మంది దరఖాస్తు చేసుకోగా వారి సర్టిఫికెట్లను పరిశీలించి ఇద్దరు అభ్యర్థులు స్పోర్ట్స్ కోటాకు అర్హులని అధికారుల కమిటీ గుర్తించింది. అయితే, వీరిద్దరూ ఇప్పటికే మెరిట్ ప్రకారం మెయిన్ పరీక్షలకు ఎంపికయ్యారు.

ఏసీబీ వలలో జలమండలి అధికారిణి


స్ఫూర్తిరెడ్డి

నార్సింగ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మణికొండ జలమండలి వాటర్‌వర్క్స్ మేనేజర్ స్ఫూర్తిరెడ్డి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నెక్నాంపూర్ వెంకటేశ్వర కాలనీలో ఇంటికి వాటర్ కనెక్షన్ కోసం ఆమె ఉపేంద్రనాథ్‌రెడ్డి అనే భవన నిర్మాణ కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్ ద్వారా డబ్బులు అడిగారు. దీంతో, ఉపేంద్రనాథ్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు ఆయన మంగళవారం నవీన్‌గౌడ్ ద్వారా స్ఫూర్తిరెడ్డికి డబ్బులు ఇచ్చారు. వెంటనే ఏసీబీ అధికారులు స్ఫూర్తిని అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కవల సోదరుల మృతి

- ఖమ్మం జిల్లాలో ఘటన


మహేష్, నవీన్(ఫైల్)

ఖమ్మం రూరల్, ఆగస్టు 20: తల్లి గర్భంలో కలిసి పెరిగి ఒకే సారి భూమి మీదకు వచ్చిన కవల సోదరులైన ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి ఈ లోకాన్ని వీడారు. ఖమ్మంకు చెందిన అత్తులూరి మహేష్(22), అత్తులూరి నవీన్(22)లు కవలలు. డిగ్రీ చదవిన వీరిద్దరూ ప్రస్తుతం పోలీసు ఉద్యోగం కోసం శిక్షణ తీసుకుంటున్నారు. అయితే, భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌కు చెందిన పవన్ అనే స్నేహితుడితో కలిసి మహేష్, నవీన్ ఒకే ద్విచక్రవాహనంపై మంగళవారంకూసుమంచి బయలుదేరారు. అయితే, మార్గమధ్యలో మద్దులపల్లి గ్రామం వద్ద వీరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సూర్యాపేట వైపు నుంచి ఖమ్మం వస్తున్న ట్రాలీ ఆటో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్, నవీన్ అక్కడికక్కడే మరణించగా తీవ్ర గాయాలపాలైన పవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేణుస్వామిపై జర్నలిస్టు మూర్తి ఫిర్యాదు

- తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మరో ఫిర్యాదు
- వేణుస్వామి వ్యవహారంపై పోలీసుశాఖ సీరియస్!

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ/హిమాయత్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్యుడు వేణుస్వామిపై ప్రముఖ జర్నలిస్టు మూర్తి.. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను రూ.5 కోట్ల డబ్బు డిమాండ్ చేసినట్లు చెబుతూ వేణుస్వామి, ఆయన భార్య తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వేణుస్వామి దంపతులు సోషల్ మీడియాలో పెట్టిన వీడియోను పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వారి ఆరోపణలు తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోషియేషన్ ప్రతినిధులు కూడా వేణుస్వామిపై మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులు డబ్బు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై నిజాలు నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ప్రసాదం రఘు ఫిర్యాదులో కోరారు. కాగా, వేణుస్వామిపై గతంలో, తాజాగా నమోదైన ఫిర్యాదులు, సోషల్ మీడియా కామెంట్లు, వివాదాస్పద వీడియోలు అన్నింటి వివరాలూ ఇవ్వాలని సైబర్‌క్రైమ్, ఐటీ సెల్ తదితర విభాగాల అధికారులను హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. వేణుస్వామి వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకునే దిశగా సిటీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్‌లో వాన దడ

- పలుచోట్ల ఇళ్లలోకి నీరు..
- పంజాగుట్టలో పిడుగు పడి కారు, షెడ్డు ధ్వంసం
- ఇంజనీర్ల బృందం సిద్ధంగా ఉండాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాణ, ఆస్తి నష్టం నివారించండి
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



వర్షం నీట మునిగిన హైదరాబాద్‌లోని అమీర్‌పేట నుంచి బేగంపేట వెళ్లే రోడ్డు

హైదరాబాద్, సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో వాన దడ పుట్టించింది. గంటన్నర పాటు కుండపోతతో కంగారు పుట్టించింది. మంగళవారం తెల్లవారుజామున విరుచుకుపడింది. సరూర్‌నగర్‌లో 14.91 బాలానగర్‌లో 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యూసుఫ్‌గూడలో 12.5, ఉప్పల్‌లో 12.1 సెం.మీ. వాన పడింది. రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వెస్ట్‌మారేడ్‌పల్లి, ఎల్‌బీనగర్, గోల్కొండ లంగర్‌హౌస్, న్యూ నాగోల్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, నాంపల్లి, మల్లాపూర్, ముషీరాబాద్‌లలో పది సెం.మీ. వర్షం పడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో 20పైగా ప్రాంతాల్లో 9.5 సెం.మీ., 14 ప్రాంతాల్లో 10 నుంచి 12.5 సెంటీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. వాన ధాటికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. యూసుఫ్‌గూడ, ఫిలింనగర్, వెంగళ్‌రావునగర్‌లలో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. పంజాగుట్ట కాలనీ సుఖ్‌నివాస్ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడి షెడ్డుతో పాటు కారు ధ్వంసమయ్యాయి. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లోని లైబ్రరీలోకి నీరు చేరింది. ముషీరాబాద్ రాంనగర్‌లో వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. యూసుఫ్‌గూడలో బైక్‌పై వెళ్తున్న వాహనదారు, పార్శిగుట్ట చౌరస్తా సమీపంలో కారు కొట్టుకుపోగా డ్రైవర్, ప్రయాణికులను స్థానికులు కాపాడారు.

హైదరాబాద్‌లో భారీ వర్షాలతో యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, యాదగిరిగుట్ట మండలంలో 17.03 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మద్దూరులో 13.6 సెం.మీ., గద్వాల జిల్లా అయిజలో 13.3 సెం.మీ. వానపడింది. రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం ఉమ్మడి పాలమూరుతో పాటు మేడ్చల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రంగారెడ్డి, నల్లగొండ, సిరిసిల్ల, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో కొన్నిచోట్ల, గురువారం నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కామారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హన్మకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జలాశయాలు, చిన్న నీటి వనరులను పర్యవేక్షించేందుకు ఇంజనీర్ల బృందం సిద్ధంగా ఉండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన చోట పాఠశాలలకు సెలవులివ్వాలని చెప్పారు.

నిండని ఎగువ గోదావరి ప్రాజెక్టులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దిగువ గోదావరికి భారీగా వరదలు వస్తుండగా.. ఎగువ గోదావరి ప్రాజెక్టులు కనాకష్టంగా నిండుతున్నాయి. ఎగువ గోదావరిపై మహారాష్ట్రలోని 102 టీఎంసీల సామర్థ్యం కలిగిన జైక్వాడి ప్రాజెక్టులో 50.15 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. సింగూరుకు 1143, నిజాంసాగర్‌కు 1200, శ్రీరాంసాగర్ కు 11,240, కడెంకు 2,539, ఎల్లంపల్లికి 11,427 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దిగువ గోదావరిపై ఉన్న మేడిగడ్డకు 2.02 లక్షలు, తుపాకులగూడెంకు 2.29 లక్షలు, దుమ్ముగూడెంకు 2.49 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

నారాయణపూర్‌కు స్వల్పంగా వరద

ఎగువ కృష్ణా, ఎగువ భీమా పరివాహకాలలో వర్షాలతో కృష్ణానదికి మళ్లీ స్వల్పంగా వరదలు ప్రారంభమయ్యాయి. ఆల్మట్టికి మంగళవారం 31,968 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 30 వేల క్యూసెక్కులను నారాయణపూర్‌కు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టులో నీటి నిల్వ 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది.

రాఖీ పండగ మిగిల్చిన విషాదం

- సోదరునికి రాఖీ కట్టేందుకు వెళ్తుండగా జోగిపేటలో అదుపు తప్పి కారు బోల్తా
- ప్రమాదంలో భర్తను కోల్పోయిన భార్య


అభిలాష్ (ఫైల్)

జోగిపేట, ఆగస్టు 20: రాఖీ పండగ ఓ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అభిలాష్(30) ప్రాణాలు కోల్పోయాడు. జోగిపేటకు చెందిన సింధుతో అభిలాష్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు రుద్ర(3) ఉన్నారు. ఇటీవల వీరు మలేషియా విహారయాత్రకు వెళ్లి సోమవారం రాత్రే స్వస్థలానికి వచ్చారు. రాఖీ పండగ కావడంతో సింధు తన సోదరుడిని రాఖీ కట్టాలని చెప్పడంతో ఆ కుటుంబం శంషాబాద్ విమానాశ్రయం నుంచి కారులో నేరుగా జోగిపేట ప్రయాణమైంది. రెండు నిమిషాల్లో సింధు పుట్టింటికి చేరుకుంటారనగా.. కారు అదుపు తప్పి జోగిపేట బస్టాండ్ రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ సీటులో ఉన్న అభిలాష్, పక్కనే ఉన్న సింధు, రుద్ర స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారికి జోగిపేటలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. అయితే, మార్గమధ్యలో గుండెపోటుకు గురై అభిలాష్ మరణించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, అభిలాష్ తండ్రి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్ అని తెలిసింది.

అలయ్.. బలయ్ కార్యక్రమానికి రండి

- సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా అక్టోబరు 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని.. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కుటుంబ సమేతంగా కలిసిన దత్తాత్రేయ.. ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. దసరా సందర్భంగా ఏటా అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించే దత్తాత్రేయ.. తొలి ఆహ్వాన పత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.

డెంగీతో ఐదుగురి మృతి

- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- ప్రబలుతున్న డెంగీ.. హడలిపోతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

డెంగీ మహమ్మారి విజృంభిస్తోంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా మనుషుల ప్రాణాలను హరిస్తూ వణికిస్తోంది. డెంగీ జ్వరాల బారిన పడి రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల వ్యవధిలో ఐదు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. సూర్యాపేట, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, కామారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ మరణాలు సంభవించాయి. మూడేళ్లు, నాలుగేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు చిన్నారులు, ఇద్దరు బీటెక్ విద్యార్థులు మృతుల జాబితాలో ఉన్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం వెల్లటూరుకు చెందిన దాసు రామకోటయ్య కుమారుడు హర్షవర్ధన్(3) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. తొలుత స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించిన తల్లిదండ్రులు హర్షను శుక్రవారం కోదాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు హర్షవర్ధన్ డెంగీ బారిన పడ్డాడని పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఖమ్మం ఆస్పత్రికి పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాద్ తరలిస్తుండగా హర్షవర్ధన్ మరణించాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన గూబ అశోక్, అమల దంపతుల కుమార్తె హత్విక(4) డెంగీ బారిన పడి మంగళవారం ఉదయం మరణించింది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న హత్వికకు తల్లిదండ్రులు వరంగల్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే, ప్లేట్‌లెట్లు పడిపోయి హత్విక పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున హత్విక ప్రాణం విడిచింది. అలాగే, కేసముద్రం మండలం బేరువాడ శివారు గుడితండాకు చెందిన బోడ శిరీష(34) తీవ్ర జ్వరంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించింది. శిరీష మరణం డెంగీ వల్ల అని నిర్ధారణ కాలేదు. ఇక, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బాయంపల్లితండాకు చెందిన చౌహాన్ వీరేందర్(21) అనే బీటెక్ విద్యార్థి డెంగీ బారిన పడి మంగళవారం మరణించాడు. ఖమ్మంలో బీటెక్ చదువుతున్న వీరేందర్ గత శుక్రవారం స్వగ్రామానికి రాగా ఆదివారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి జ్వరం తీవ్రం కావడంతో కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా డెంగీ నిర్ధారణైంది. మెరుగైన చికిత్స కోసం మంగళవారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే వీరేందర్ మరణించాడు. అదేవిధంగా, నాగర్‌కర్నూల్‌కు చెందిన మిరియాల నిఖిత(21) అనే బీటెక్ విద్యార్థిని కూడా డెంగీ బారిన పడి మరణించింది. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న నిఖిత జ్వరంతో బాధపడుతూ ఇటీవల ఇంటికొచ్చింది. అయితే, నిఖిత పరిస్థితి విషమంగా మారడంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఇక, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ శివారు జ్యోతిరామ్ తండాకు చెందిన బోనోత్ కిషన్(47) డెంగీ బారిన పడి పదిహేను రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. ఈ మరణాలతో ఆయా ప్రాంతాల ప్రజలు హడలిపోతున్నారు. డెంగీ వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 21 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

కాళోజీ అనుబంధ కళాశాలల్లో
మేనేజ్‌మెంట్ కోటా

యూజీ

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ కోర్సుల్లో మేనేజ్‌మెంట్/ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ/మైనారిటీ మెడికల్ & డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్‌ఆర్‌ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ఆర్మీ డెంటల్ కాలేజ్ సహా అనురాగ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీట్లను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే అలాట్ చేస్తారు. కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. మేనేజ్‌మెంట్ కోటా-బీ కేటగిరీలో 85 శాతం సీట్లను స్థానికులకు రిజర్వ్ చేశారు.

అర్హత

అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127; జనరల్ దివ్యాంగులకు 144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్‌ఆర్‌ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.6300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో; నీట్ యూజీ 2024 అడ్మిట్ కార్డ్, స్కోర్ కార్డ్; ఆధార్ కార్డ్, తొమ్మిదోతరగతి నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు; ఇంటర్/తత్సమాన కోర్సు స్టడీ సర్టిఫికెట్; కులం, ఆదాయం, వైకల్యం సంబంధిత ధ్రువీకరణ పత్రాలు; ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్; ఎన్‌ఆర్‌ఐ బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్; ఎన్‌ఆర్‌ఐ పాస్‌పోర్ట్ కాపీ; పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు.
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

ఎండీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్)- ఎండీఎస్ ప్రోగ్రామ్‌లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్మీ డెంటల్ కాలేజ్ సహా తెలంగాణలోని అనుబంధ ప్రైవేట్ డెంటల్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. నీట్ ఎండీఎస్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ సమయంలో ప్రకటిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు.

అర్హత

డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీడీఎస్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉండాలి. నీట్ ఎండీఎస్ 2024లో జనరల్ అభ్యర్థులకు 263; బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 230; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 246ను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివిన వారు పర్మనెంట్ డెంటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఎన్‌ఆర్‌ఐల బంధువులు ఎన్‌ఆర్‌ఐ కోటా కింద అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సంబంధిత ఎన్‌ఆర్‌ఐ నుంచి స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్, స్టాటస్ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సబ్మిట్ చేయాలి. ఇన్‌స్టిట్యూషనల్ కోటా కింద అప్లయ్ చేసుకొనేవారు కాలేజ్ నుంచి స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ జతచేయాలి. ఆర్మీ డెంటల్ కాలేజ్‌లోని సీట్లను ఆర్మీ అధికారుల పిల్లలకు ప్రత్యేకించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** 6300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్ ఎండీఎస్ 2024 అడ్మిట్ కార్డ్, నీట్ ఎండీఎస్ 2024 స్కోర్ కార్డ్, బీడీఎస్ డిగ్రీ సర్టిఫికెట్, బీడీఎస్ స్టడీ సర్టిఫికెట్, రొటేటరీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్; కులం, ఆదాయం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in



ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత

విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.



రాత పరీక్ష వివరాలు

ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్

రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసే వరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

సీఐటీడీలో ఎంఈ

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ), ఓయూకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎంఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్, టూల్ డిజైన్, డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్, మెకట్రానిక్స్

అర్హత

- ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో(బీఈ/బీటెక్)(మెకానికల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యర్థుల వయసు 45 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** www.citdindia.org

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program 2024-25

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility:

- The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.
- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9



SBIF Asha Scholarship Program 2025

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & post-graduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards:

- **Classes 6 to 12:** INR 15,000 each
- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/SBIFS7

Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility:

- Students studying in any year of professional graduation in STEM courses can apply.
- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

buddy4study.com

చిచ్చర పిడుగు



మిత్రుల గొడవ

ఒక అడవిలో ఒక సింహం కలిసి స్నేహంగా ఉండేది. అవి రెండూ కలిసి వేరు వేరుగా వేటాడేవి. దొరికిన ఆహారాన్ని కలసి పంచుకునేవి. ఇలా హాయిగా ఉండే ఆ జంతువులకు ఒకసారి దయనీయమైన పరిస్థితి వచ్చింది. తినటానికి తిండి దొరకలేదు. పన్నెండు రోజుల పాటు పస్తులుండాయి. ఆహారం లేక వట్టి కడుపులతో నకనకలాడాయి. అప్పుడు సింహంతో పులి ఇలా అన్నది.. 'మనం ఇద్దరం వేరు వేరుగా వేటాడితే తప్పించుకుంటున్నాయి. ఇద్దరం వేర్వేరుగా కాకుండా కలిసి వేటాడుదాం' అని తీర్మానించుకున్నాయి. 'ఇద్దరికీ చెరీ సగమే' అని కూడా మాట్లాడుకున్నాయి.




ఇద్దరూ కలిసి జింకను వేటాడాయి. జింక పరిగెత్తలేక.. ఈ రెండింటి వలలో చిక్కుకున్నది. తీరా తిండి దొరికాక .. సగం పంచుకునే విషయం మర్చిపోయి సింహం, పులి కొట్లాడుకున్నాయి. చివరికి నిందించుకున్నాయి. 'నేను ఈ సలహా ఇవ్వకపోతే ఈ తిండి దొరికేది కాదు' అన్నది పులి. 'భలే చెప్పావు. జింక మీద తొలి పంజా వేసింది నేనే. నేను పట్టుకోకపోతే ఈ జింక మాంసం నీకెక్కడిది?' అన్నది సింహం. రెండు క్రూర జంతువులు. వాటికి ఎదురు చెప్పేవారెవ్వరూ లేరు.

పులి, సింహం రెండు వయసు పైబడటం వల్ల ఎక్కువగా పోట్లాడుకోలేకపోయాయి. ఈ సందులో ఒక జిత్తుల మారి నక్క వచ్చి ఆ జింకను వేగంగా ఈడ్చుకుని పోయింది. పోట్లాడి అలసిన ఆ వృద్ధ క్రూర జంతువులు ఒక్కడుగు కూడా వేయలేక పోయాయి. దీంతో పులి, సింహం బాధపడ్డాయి. చెట్టు చాటు నుంచి దూరంగా జింకను లాక్కెళ్లిన నక్క హాయిగా ఆ రోజు ఆహారాన్ని భుజించటమే కాకుండా కూత వేసి మిగతా నక్కలకూ విందు అందించింది. ఇద్దరు మిత్రులు గొడవ పడటం వల్ల మూడో జంతువు నక్క బాగుపడింది. తమ తప్పును తెలుసుకున్న పులి, సింహం తప్పును తెలుసుకున్నాయి.

5 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి





జంతువుల నీడను జతపరచండి



డైలీ సుడోకు - 389

	9			6	7			4
		3		4		2	7	
			2					6
		6	9		2	7	3	
	3	5	8		6	1		
6					5			
	8	2		1		9		
3			6	9			2	

సుడోకు - 388 సమాధానం

3	2	1	6	5	4
6	5	4	3	1	2
5	4	3	2	6	1
2	1	6	5	4	3
4	3	5	1	2	6
1	6	2	4	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.